స్వర్ణసీమకు స్వాగతం

నేషనల్ బుక్‌ట్రస్ట్ ఎంపిక చేసిన అత్యుత్తమ భారతీయ నవల

మధురాంతకం మహేంద్ర

SHOUT
SHARE
IT

నేషనల్ బుక్‌ట్రస్ట్ ఎంపికచేసిన అత్యుత్తమ భారతీయనవల

స్వర్ణసీమకు స్వాగతం

మధురాంతకం మహేంద్ర

రచయిత గురించి

1959 జులై 16న చిత్తూరు జిల్లాలో రవణయ్యగారి పల్లె అనే కుగ్రామంలో పుట్టిన మహేంద్ర ప్రాథమిక విద్య దామల్ చెరువులోనూ, కళాశాల చదువులు చిత్తూరులోనూ, తిరుపతి శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయంలోనూ జరిగింది.

అప్పుడు శ్రీ వేంకటేశ్వరా గ్రామీణ బ్యాంకని పేరున్న గ్రామీణ బాంకుల్లో వుద్యోగం చేస్తూ నంజంపేట, కారణి, గురుపల్లె, మొగిలి, యెరాలవారి పాళెం మొదలైన గ్రామాల్లో చాలాకాలం గడిపారు:

ఆయన రాసిన 13 కథలు 'కనిపించనికోయిల' అనే సంపుటంగానూ, కవితలు 'పర్వవేలా తరంగాలు' అనే కవితా సంపుటంగానూ వెలువడ్డాయి.

ప్రసిద్ధ కథ రచయిత మధురాంతకం రాజారాంగారి అబ్బాయిగా మాత్రమే గాకుండా, తనదంటూ వొక విశిష్టమైన, విలక్షణమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకున్న అరుదైన రచయిత, కవి, చిత్రకారుడు.

1998 జూన్ 11వ తేదీన తన 39వ యేట అర్ధాంతరంగా యీ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయాడు.

స్వర్ణసీమకు స్వాగతం

మధురాంతకం మహేంద్ర

అమరావతి పబ్లికేషన్స్

సాయిబాబారోడ్ - గుంటూరు - 522 007

స్వర్ణసీమకు స్వాగతం

మధురాంతకం మహేంద్ర

ప్రథమ ముద్రణ: మార్చి 1991

ద్వితీయ ముద్రణ: జనవరి 2020

ముఖచిత్రం: చైతన్య

లోపలి బొమ్మలు: మహేంద్ర

డిటిపి & లేఅవుట్: **కె. రామకృష్ణ**

ప్రచురణ:

అమరావతి పబ్లికేషన్స్

4-21-81, చైతన్యపురి, సాయిబాబారోడ్,

గుంటూరు-522 007 ఫోన్: 92915 30714

సోల్ డిస్ట్రిబ్యూటర్స్:

విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ,

నవచేతన పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాద్

ప్రతులకు:

విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు

విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు,

తిరుపతి, ఒంగోలు, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం.

నవచేతన బుక్‌హౌస్ బ్రాంచీలు

అబిడ్స్, సుల్తాన్‌బజార్, యూసఫ్‌గూడ, కూకట్‌పల్లి, బండ్లగూడ-హైదరాబాద్.

హనుమకొండ, కొండాపూర్, హిమాయత్‌నగర్.

నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్.

ముద్రణ:

రెయిన్‌బో ప్రింట్ ప్యాక్, హైదరాబాద్

ఫోన్: 23731620 / 23741620

వెల: రూ. **100/-**

to my father
my favourite storyteller

ఆమోదం

"మట్టిలో నుంచీ బంగారం వెలికితీసి జనుల భవితవ్యాన్ని సుసంపన్నం చేయడం కోసం నవీన యంత్రాల తోడ్పాటుతో, వందలాది కార్మికులు, సాంకేతిక నిపుణులు దీర్ఘ కఠోర శ్రమ సలుపుతున్న ఈ భూమిలోనే, ఒక నిర్భాగ్యుడైన ముసలివాడు ఉన్న తన బంగారాన్ని పోగొట్టుకొని విగతజీవిగా మారిపోతున్న దృశ్యం... మానవ నాగరికతా ప్రస్థానానికి గమ్యం ఏమిటి?... ఈ నిరంతర స్పర్ధాయుత క్షణక్షణ సంఘర్షణామయ, సతత అనిశ్చిత అపాయకర సుదీర్ఘపథంలో చివరకు దొరికేదేమిటి? అది మిగిలేదెవరికి? – పారిశ్రామిక నాగరికతా ప్రస్థానంలో యిమిడివున్న ఈ మౌలికమైన వైరుద్ధ్యాన్ని, హృదయంగమంగా, అనుభూతిపరంగా చిత్రించిన దృశ్యకావ్యం ఈ నవల.

ప్రగతి అంటే ఏమిటి? ఎందరో మనుష్యులు, ఎన్నో కోరికలు, నిత్యనైమిత్తిక జీవన సమస్యలు – అందరి ఆశా 'ప్రగతి' మీదే! ప్రగతి అంటే మిథ్య కాదు! అది పెద్దపర్తిగుంట బస్సు! దానికోసమే అందరూ చూస్తారు – తొందరగా యిల్లు చేరుకోవాలని అందరి తాపత్రయమూను! తొక్కిసలాటలో, కండబలం, చాతుర్యం కలవాళ్ళు సీట్లు సంపాయించి కూర్చుంటారు. మిగతావాళ్ళు క్రిక్కిరిసి నిల్చుంటారు. బస్సు లోపలికి ప్రవేశమే కష్టమైతే, బస్సుమీద ఎక్కి కూర్చుంటారు. బస్సు ద్వారం దగ్గర వ్రేలాడబడుతూ వుంటారు – ఎలా అయితేనేం, అందరూ ఎక్కుతారు! ఎవరు దిగవలసినచోట వారు దిగిపోగా, బస్సు గమ్యం చేరుతుందో లేదో ఎవరూ చెప్పలేరు! పెద్దపర్తిగుంట బస్సు దారి తప్పి, యిసుకవాగులో దిగబడి, గమ్యానికి రెండు మూడు మైళ్ళు యివతలే నిలచిపోతుంది, ఖాళీగా. అప్పటికి మిగిలిన ప్రయాణీకులు తిమ్మరాయప్ప, రమణమూర్తీ. ఈ బస్సు ప్రయాణంలో ఎవరి కోరికలూ, ఎవరి సమస్యలూ తీరలేదు! బస్సు అంటే అది ప్రయాణమే తప్ప, దానికి మానవుని ఆశలతో, సుఖదుఃఖాలతో సంబంధం లేదు! ప్రయాణం అంటే చలనం. ప్రగతి కూడా అంతే! దాని నేపథ్యంలోనే మానవులు అనుభవించే సుఖదుఃఖాలు! ప్రగతి అంటే రంగుల రాట్నం. ఎవరు పైకి వెడతారో, ఎవరు క్రిందికి వస్తారో దానికి పట్టదు! అన్నీ

పోగొట్టుకొని, మృత్యువు నెదురుచూచే తిమ్మరాయప్ప, భ్రమలు చెదరి శూన్యాన్ని చూస్తూ లోపలా బయటా వెలుగు నన్వేషించే రమణమూర్తీ మిగిలారు చివర!

రచయిత మహేంద్ర మంచి కవి, జీవిత వాస్తవికతకు స్పందిస్తాడు; భావనాశీలి కావడంతో ఆ స్పందనను పాఠకులకు అనుభూతిగా అందించగలుగుతాడు. "'బస్సులు మూడూ, ఒకేసారి దీర్ఘంగానూ, కర్ణకఠోరంగానూ హార్న్‌లు కొడుతూ, వెనుకకూ ముందుకూ కవాతు చేస్తూ, ఒకదానికంటె ఒకటి ముందు పార్క్ కావడానికి బస్టాండు అనే శ్లేష్మంలో పడ్డ పురుగుల్లా లుకలుకలాడసాగాయి." ఒక్కొక్క బస్సుకీ విశిష్టత వుంటుంది. "సింహమున్న గుహలోకి సింధురము జొచ్చినట్టు, వీధి నాటకం లోకి కీచకుడు వచ్చినట్టుగా, ఆరెమ్మెస్ బస్ కుప్పం రాజవీధి గుండా వస్తోంది. దాని ముఖమంతా పసుపుకుంకుమ బొట్లున్నాయి. బస్సు నుంచి మంచి అగరొత్తుల వాసన వేస్తోంది. ముందు వైపున కట్టిన మామిడి తోరణాలతో వ్రేలాడదీసిన పూలమాలలతో బస్సు కదులుతున్న పెండ్లి మంటపంలా వుంది.... సేలం – చిత్తూరు రూట్‌మీద ఆరెమ్మెస్ బస్సుకున్న గౌరవం అద్వితీయమైనది. అది ఆ రూట్‌కు రాణి వంటిది." – "మల్లానూరు బస్సు బస్టాండులో ఆగకముందే ఈగలు ముసిరిన మామిడి ముట్టెలా మనుషులతో మూగిపోయింది. "ఇంట్లోకి రాగూడని తరుణంలో తప్పనిసరై గోడ అంచునుంచీ నడచి వచ్చి చాప చెంబు తీసుకుని అంతే బెరుకుగా వరండాలోకి వెళ్ళే స్త్రీలా మెల్లగా వచ్చి ఒకమూల ఆగిపోయింది పెద్దపర్తిగుంట బస్సు."

పెద్దపర్తి గుంట బస్సు ఎక్కవలసినవాళ్ళు కథానాయకుడు తిమ్మరాయప్ప కాక, సుభద్ర వెంకటపతులు; భాగ్యమ్మ వెంకటసామి మల్లిసెండుగాడు; లీడరు అతని అనుయాయులు; ప్రేమికుడు అప్పోజి; జమీందారు వంశస్థుడు వసంతనాయనివారు, బస్సు డ్రైవరు, కండక్టరు, ప్రెస్ రిపోర్టరు రమణమూర్తి – వీళ్ళందరి వ్యక్తిత్వాలను, చరిత్రలను, హావభావాలను చిత్రించడంలో రచయిత చూపిన కౌశలం, ప్రతిభ రసజ్ఞులను మెప్పించేదిగా వుంది.

భాగ్యమ్మ కోసం వెంకటసామి సీటు సంపాదించడానికి ముందుకురికిన వైనం – భీమసేనుణ్ణి సౌగంధికా పుష్పం కోసం కవ్వించి పంపిన ద్రౌపది పోలిక – "వెంకటసామి ద్వారం సమీపించాడు. బస్సు డోరు రేకులుగా చీలి, మేకులుగా తయారై వుంది. వెంకటసామి మొరటుగా దానిమీద పడి భుజంమీద గాయం చేసుకున్నాడు. రక్తంతో అతడి ఎడమ భుజం మోచేతివరకు తడిసింది." – "తిమ్మరాయప్ప వీధి కుక్కలకు దొరికిపోయిన పిల్లికూనలా జనం మధ్యలో బలహీనంగా అరుస్తున్నాడు.", "పిండి మరలోకి పోతున్న

ధాన్యంలా జనప్రవాహం డోరుగుండా బస్సు లోకి ప్రవహిస్తోంది", "ఈ సంక్షోభంలో నుంచీ కండక్టరు కొమ్మలమీద దాటుకునే కోతిలా, బొరియల్లోకి దూరే సర్పంలా, గాలిలో వలయాలు తిరిగే తూనీగలా బస్సులోకి ప్రవేశించాడు.", "కండక్టరు టికెట్లు కొట్టే యజ్ఞం – అతడు మనుషుల శరీరాల మధ్య పాతిపెట్టినట్లుగా యిరుక్కుపోయి, కండరాల మధ్య రక్తనాళంలా కదులుతున్నాడు. అతడు మనుషుల్ని రెండు చేతుల్తోనూ వెనక్కి త్రోసుకుంటూ జనం జలధిని ఈదుకుంటూ ముందుకి వస్తున్నాడు. కండక్టరు అనేక హస్తాలతో విశ్వరూపం ధరించిన కార్తవీర్యార్జునుడిలా వున్నాడు".... ఇలా దృశ్యాల్ని అక్షరబద్ధం చేసి, మనస్సుకి హత్తుకుపోయి, చెరగని ముద్రవేసి భావచిత్రాలని రచించడంలో సిద్ధహస్తుడని నిరూపించు కున్నాడు మహేంద్ర. ఈ బస్సు దృశ్యం నేటి నాగరికతకు ప్రతీక. "కొండ అద్దంమందు కొంచమై ఉండేలా" నాగరికతకు అద్దం పట్టాడు మహేంద్ర.

ఈ నవలలో కథావస్తువు ప్రజాజీవనం. కథాకాలం కొన్ని గంటలు బస్సుకోసం పడిగాపులు పడిన జనం. రకరకాలుగా కాలయాపనం చేసి, చచ్చీ చెడి బస్సులో పడి, పొద్దుబోయాక దిగవలసిన చోట దిగి, ఇళ్ళకు చేరుకోవడం. ఇది అందరికీ అనుభవమే. ఆ అనుభవాన్ని కళారూపంగా తీర్చిదిద్దడంలో రచయిత పొందిన కృతార్థకత సామాన్యమైంది కాదు! వర్జీనియా వూల్ఫ్ వ్రాసిన 'మిసెస్ డాలో వే' గుర్తు వస్తుంది నాకు – నవలా నిర్మాణం చూస్తే. కాని వూల్ఫ్ నవల అంతా ఒక స్వగతం – అందులో గత స్మృతులు, ప్రకృతపు హృదయ స్పందనలు పేటలుగా అల్లుకుని, చివర కథానాయిక పార్టీకోసం మేడమెట్లు దిగి హాల్లోకి రావడంతో కథ ముగుస్తుంది. అందులోని వ్యక్తుల మధ్య, అనుభూతుల మధ్య సంబంధాలు హృదయైకవేద్యం. ఈ నవలలో అంతా ప్రత్యక్ష దృశ్యమే. భిన్న ప్రవృత్తులు గల వ్యక్తుల చిత్రణను కూర్చడంలో ఒక ఆర్కెస్ట్రాని తయారుచేసిన ప్రతిభ కనబరిచాడు రచయిత. దీని స్వారస్యమూ హృదయైకవేద్యం.

భూమిని పండించి బంగారం సంపాదించిన పూర్వ నాగరికతకూ, భూమిని త్రవ్వి బంగారం వెలికిదీసే నేటి నాగరికతకూ మధ్య మానవత్వం పొందుతున్న సంక్షోభాన్ని తిమ్మరాయప్ప వాచ్యం చేస్తాడు చివర – "గెనిలో పని అంటే మిత్తవతో పోరినట్టే వుండాది. ఆ సొరంగాల్లో నేల ఉల్లుకొని మావోళ్ళు ముగ్గురు ఒకేనాడు కాలమైపోయిరి. ఆ గెన్లో పడే కష్టం బూమ్మీదనే పడితే రాజనాలు పండు. బంగారం మీద జనాల కెందుకింత బ్రెమో తెలవటం లేదు. అదేవన్నా కూట్లోకి వస్తాదా? కూర్లోకి వస్తాదా?... ఒక గురిగింజంత బంగారం కోసం ఎకరాలు ఎకరాలుగా బీళ్ళు పెట్టేసినారు. ఈడకొచ్చిన ప్రతి పెద్దమనిషీ ఈడ బంగారం దొరకతా వుండాదా, అని అడగతా వుండాడేగాని,

ఇక్కడ తాగేదానికి నీళ్ళు దొరకతా వుండావా అని అడగతా వుండాడా?.... బూమిమీద కాయకష్టం జేసి నీతిగా జీవనం సేద్దామనేవాళ్ళు తగ్గిపోతా వుండారు. ఒకరు సంపాదించిన సొత్తును మింగేసి బదుకుదామనుకునేవాళ్ళు పెరిగిపోతావుండారు..." వ్యవసాయానికి నీళ్ళు లేక, బావి త్రవ్వే ప్రయత్నంలో సర్వస్వాన్నీ ఒడ్డి, మిగిలిన ఒక్క నగ కూడా బస్సు ప్రయాణంలో పోగొట్టుకుని హతాశుడైన తిమ్మరాయప్ప ఈ నవలకు కథానాయకుడు. అతనితోనే ఈ నవల ప్రారంభం. అతనితోటే అంతం. నిర్మాణ సౌష్టవం గల అందమైన నవల 'స్వర్ణసీమకు స్వాగతం".

చిరంజీవి మధురాంతకం మహేంద్రకు నా అభినందనలూ, శుభాకాంక్షలూ.

మదనపల్లి
10-3-1989

-ఆర్. ఎస్. సుదర్శనం

విశిష్ట నవల

స్వర్ణసీమకు స్వాగతం మధురాంతకం మహేంద్ర రాసిన ఏకైక నవల.

నవల అనగానే వందల పేజీలు ఉండటం సహజం. కానీ నవల 111 పేజీలు మాత్రమే. తెలుగులో చిన్న నవలలు తక్కువనే చెప్పాలి. చిన్న నవలలో ఎంతో ఎక్కువ జీవితాన్ని అందించిన నవలల్లో ప్రముఖంగా చెప్పుకోదగింది స్వర్ణసీమకు స్వాగతం. విలక్షణంగా, నూతనంగా కథను చెప్పిన తీరు ఈ నవల ప్రత్యేకత.

కుప్పం నుంచి పెద్దపర్తిగుంట ప్రయాణం ఈ నవలలోని కథ. కొద్ది గంటల బస్సు ప్రయాణాన్ని నవలకు కథగా మలచుకోవడం చాలా అరుదైన విషయం. చదవటం ఆరంభించిన దగ్గర్నుంచీ వదలకుండా చదివింపజెయ్యడం రచయిత ప్రతిభ.

నవీన్ రాసిన అంపశయ్య నవలలో కథాకాలం 24 గంటలు. మహేంద్ర రాసిన ఈ నవలలో కథాకాలం కేవలం అయిదారు గంటలు మాత్రమే. ఈ అల్పకాలంలోనే అనల్పమైన జీవన వాస్తవికతను, వ్యక్తుల అద్భుతమైన విశ్లేషణాత్మకశైలితో కళ్ళముందు నిలబెట్టారు మహేంద్ర. ఇప్పుడు ఓ విశ్వవిద్యాలయంతో, ఓ ముఖ్యమంత్రి నియోజకవర్గంగా సుప్రసిద్ధమైన కుప్పం నిజానికి 1985 నాటికి ప్రసిద్ధమైన ఊరేమీ కాదు.

తిమ్మరాయప్ప, మల్లెసెండు, అప్పోజి, వసంతనాయనివారు, భాగ్యమ్మ, కోమలమ్మ, తిప్పయ్యగౌడు, అత్తినీరాలు, సుందరేశ వడియార్, జగదాంబ... ఈ ప్రయాణంలోని కొన్ని పాత్రలు... పొరుగుపల్లె క్రాసు, బిజిగానిపల్లె, చీకటిపల్లె ఈ ప్రయాణంలోని ఊళ్ళు. ఈ పేర్లు, ఈ ఊళ్ళు ఇదే ప్రాంతం కథో స్పష్టంగా చెపుతాయి. నీటికి కటకటలాడే రాయలసీమలోని కొన్ని గంటల బస్సు ప్రయాణాన్ని, అక్కడ జీవన విధానంతో మమేకం చేసిన మహేంద్ర ఒక అద్భుత జీవిత వాస్తవికతని, తాత్త్వికతని అతి తక్కువ పేజీలలో మనముందు ఉంచాడు.

తిమ్మరాయప్ప వృద్ధుడు, బడుగు రైతు. నీటికి కటకటలాడే వ్యవసాయం చేసి చేసి అలసి, ఇంకా ఆశ చావక తన పొలానికి బోరుబావి కోసం ఆత్రపడుతున్న మనిషి. బోరుబావి ప్రయత్నంలో, బేంకు అప్పుకోసం తిరగటంలో తప్పనిసరిగా డబ్బు ఖర్చు చేసే ఆ ముసలి ప్రాణం ఎందరికో ఎన్నో లంచాలు ముట్టచెప్పినా ఆ బక్క రైతు గొంతు

ఎండుకుపోతున్నా, ఇరవై నాలుగు గంటలుగా ఆహారం లేకపోయినా, నవనాడులు బిగబట్టి తన ఊరు చేరుకోవాలనీ, ఇంటికి వెళ్లాకే రెండు మెతుకులు తినాలనీ పెద్దపర్తి గుంట బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు.

పైన ఎండ నిప్పులు చెరుగుతోంది. ఒంటికి నిముషం పాటు ఎండ తగిలితే చాలు చమటలు ధారగా కారేలా వుంది వేడి. అటువంటి సమయంలో జ్వరంతో ఉన్న పిల్లాడితో, చేతిలో పిల్లాడి పాలసీసా, పాత గుడ్డల సరంజామాతో అతి కష్టంమీద బస్టాండు కొచ్చింది సుభద్ర. అక్కడ బస్ జాడలేక, ఆ ఎండలో జ్వరం పిల్లాణ్ణి ఉంచలేక పక్కనున్న టీ అంగడికి వచ్చి వేడి బండమీదే సర్దుకు కూచుంది. టీ అతన్ని ఓ గ్లాసు నీళ్ళు ఇమ్మంటే, అసలే బేరాలు లేని అతను 'అరగంటసేపు బోరింగు కొట్టినా ఒక గరిగ నీళ్ళు రావటంలే... వచ్చినాళ్ళందరికీ సలివేంద్రం పెట్టుకుంటే నేను యాపారం చేసి కడతేరినట్టే...' అన్నాడు ఘాటుగా. 'బిడ్డతల్లిని నీళ్ళియ్యన్నా' అని జాలిగా అడిగినా అతను కరగలేదు. సినిమాకి టిక్కెట్టు దొరక్క విసుగ్గా ఆ అంగడికి వచ్చిన వెంకటపతికి సుభద్ర రాకుమారిలా కనిపించింది. అతను ఓ పెద్దనోటు అంగడివాడికి ఇచ్చి సుభద్ర అవసరాలు తీర్చాడు. సుభద్ర కొంచెం తేరుకుని నవ్వింది. ఆ సుభద్ర పెద్దపర్తిగుంట బస్సుకోసం చూస్తోంది. సుభద్ర మీద క్షణాల్లో మోజు పెంచుకున్న వెంకటపతి ఎక్కాల్సిందీ ఆ బస్సే.

అలాగే బాగా తాగిన అత్తినీరాలు, సంపంగి గౌడు, ఆ ప్రాంతంలో ఉన్న బంగారు గనులమీద, సమాచారం సేకరించాలని వచ్చిన పత్రికా విలేఖరి రమణమూర్తి, భాగ్యమ్మతో శృంగారం కోసం వచ్చిన అప్పోజీ, అతని గురువు లీడరు, లీడరు శిష్యుడు తిప్పయ్యగౌడు, తిరుమల దర్శనంనుంచి వస్తున్న సీమేగౌడు, అప్పోజి ఎదురు చూస్తున్న భాగ్యమ్మకి ఇరువైపులా కుదురుకుపోయిన మల్లెసెండు, వెంకటస్వామి, గత వైభవం కరిగిపోయినా అభిజాత్యం కొంచెం మిగిలిపోయిన మాజీ జమీందారు వసంతనాయనివారు, వారి మంత్రిసముడు చాకలి లింగయ్య... ఇలా ఎందరెందరో ఎదురు చూస్తున్నదీ పెద్దపర్తిగుంట బస్సుకోసమే.

ఇంతకీ ఆ పెద్దపర్తి గుంట బస్సు ఎప్పుడు రావాలి, ఎప్పుడు వెళ్ళాలి అంటే, అది ఓ బ్రహ్మ రహస్యం లాంటిది. దానికి తగుమాత్రం వివరణ చెప్పాలంటే... అత్తినీరాలు భాషలో...

"ఆ సమయం చెప్పేదానికి లేదే! ఒక దినం పదిగంటలకే కుప్పం ఎలబారేస్తాది. ఒక్కో దినం మద్దాన్నం రెండు గంటలకు కూడా పలమనేరులో బయల్దేరదు. ఒక్కోదినం సిత్తూర్లోనే కాలు పైకెత్తేస్తాది. సినుకు నేలబడిందంటే కుప్పమొచ్చిన సంగనపల్లి చేర్దానే నమ్మకం లేదు."

ఓ పాసింజరు బస్సులో ఈరకం ప్రయాణం ఎన్నిరకాల నరకాల్ని చూపిస్తుందో చాలామందికి తెలియకపోవచ్చు. కానీ ఆ అనుభవం ఉన్నవాళ్లకి మాత్రం అది సింహ స్వప్నమే. దూరం కొద్ది మైళ్లే. సమయానికి బస్ వచ్చి గమ్యం చేరితే పట్టేది గంట, గంటన్నరే. కానీ మధ్యాహ్నం నుంచి ఎదురుచూస్తున్న పెద్దపర్తిగుంట బస్సు సాయంత్రం ఐదు తర్వాత రావటం, అప్పటికీ ఎప్పుడు బయలుదేరుతుందో తెలియకపోవటం, బయలుదేరినా ఎక్కడివరకు వెడుతుందో, ఎప్పటికి చేరుతుందో అగమ్యగోచరంగా ఉండటం... మహేంద్ర అద్భుతంగా దృశ్యీకరించటమే కాదు, మొత్తం ఈ వ్యవహారం వెనక ఉన్న ఆర్థిక, సాంఘిక, తాత్త్విక నేపథ్యాన్ని ప్రత్యేకించి చెప్పకుండానే కథనంలో ఒదిగిపోయేలా చేయటం ఈ నవల ప్రత్యేకత.

ఈ దేశంలోని చాలా పల్లెలు, చాలా పనులకి దగ్గరలో ఉన్న మండల, తాలూకా కేంద్రాలైన టౌన్లమీద ఆధారపడ్డ యంత్రాంగంలో ఉన్నాయి. బేంకుకి, హాస్పిటల్‌కి, సంతలకి, ప్రత్యేక అవసరాలకి ఏదైనా వస్తువుల కొనుగోలుకి, సినిమాలాంటి వినోదాలకి, ఏదైనా పెద్ద ఊరు వెళ్లాలంటే కూడలిగా బస్సు మారటానికి... ఒకటేమిటి ఇలా చాలావాటికి టౌన్లకి రావటం తప్పదు.. పది పన్నెండు మైళ్ల ప్రయాణం చేసి తమ పల్లె తిరిగి చేరుకోవటానికి ఒక రోజంతా యాతన పడటం 1985లో మహేంద్ర ఈ నవల రాసేనాటికే కాదు ఇప్పటికీ తప్పటం లేదు. అప్పటికీ ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో జరిగిన మార్పుల్లా షేరింగ్ ఆటోలు, టిక్కీలు, వేన్లులాంటివి వాడుకలోకి వచ్చాయి. వాటి శాతం అంత ఎక్కువేమీ కాదు. అందువల్ల ఈ ప్రయాణ నరకంలో పెద్ద మార్పు లేదు. కొందరు తప్పనిసరై ఈ ప్రయాణ బాధని భరిస్తారు. కొందరు అలవాటుగా, మరికొందరు తిమ్మరాయప్ప లాంటివారు జీవచ్ఛవంలా అనుభవిస్తారు.

సరైన రవాణా సౌకర్యం లేని పల్లె ప్రయాణానికి మహేంద్ర నవలని పరిమితం చెయ్యలేదు. ఈ ప్రయాణ నేపథ్యంలో జీవన రీతిని, మానవ నైజాన్ని పట్టి చూపించాడు.

నరకంలాంటి ఈ ప్రయాణంలో కూడా కొందరు సంతోషంగా తమ కోర్కెలు తీర్చుకోవటానికి ప్రయత్నించారు. కొందరు తమ మామూలు తత్వాన్నించి కొంతసేపైనా బెసికారు. కొందరు అప్పటికప్పుడే ఆశపడ్డారు. మరికొందరు నిరాశలో కూరుకుపోయారు. పరిస్థితుల్ని అనుకూలంగా మార్చుకోవటానికి ప్రయత్నించినవారు కొందరు. ఎంతమాత్రం ఎదురు తిరగలేక తలవంచుకు గడిపినవారు మరికొందరు.

తిమ్మరాయప్పకి బతుకు భారం మోసిమోసి, వాస్తవాలు తెలిసీ బతుకు ఇలా ఉందే మిటా అన్న దిగులు, ప్రయాణంలో ముందే నిస్త్రాణ. కొడుకుని వైద్యం కోసం తీసుకువచ్చిన

సుభద్రకి పిల్లాడు కులాసాగా ఉంటే కులాసా, వెంకటపతివేపు మొగ్గు చూపి కాస్తంత గాడి తప్పింది. మళ్లీ పిల్లాడికి బాగా లేకపోవటం చూసిన ఆ తల్లి పశ్చాత్తాపపడింది. ఆడతనం కన్నా తల్లితనంలో బలం తెలిపే వాస్తవ చిత్రణ ఇది. భాగ్యమ్మ మీద మోజుతో వచ్చిన అప్పోజి ఆశానిరాశలు... భాగ్యమ్మ జీవితం, ఆవిడ దగ్గర చేరిన మగాళ్లు... ఇదంతా కేవలం బస్ ప్రయాణంలా కాకుండా, జీవనయానంలా ఉండటం స్వర్ణసీమకు స్వాగతం ప్రత్యేకత.

వసంతనాయనివారు ఓ ప్రత్యేక వ్యక్తి. జమీందారీ వంశస్థుడు. ప్రస్తుతం జమీ లేదు, డబ్బు లేదు. ఆయనకి తన పూర్వీకుల వైభవ అభిజాత్యం తప్ప ఏమీ లేదు. ఆయనా ఈ బస్ ప్రయాణీకుడే. ఆయన ఓ బేగ్‌ని ప్రాణసమానంగా చూసుకుంటున్నాడు. ఆయనకి ఎంతో విశ్వాసపాత్రుడైన చాకలి లింగయ్యకీ, ఆ బేగ్‌లో ఆయన ఆఖరి ఆస్తి పదిహేను సవరల బంగారం ఉందేమోనన్న సందేహం. చివరికి ఆయన బేగ్‌లో ఉన్నదేమిటో తెలిస్తే ఆశ్చర్యమే కాదు, దుఃఖం కూడా వస్తుంది. అందులో ఉన్నవి పాత చెప్పులు. ఆ సంగతి లింగయ్యకి తెలిశాక –

"రెండింటికీ ఉంగరాలు పోయినాయిరా లింగా! కొత్తవే. పారేద్దామంటే మనసు రాలే. ఎండలకాలం, కాలంతా ఆనెలు, దారంతా ముండ్లు, పుంతంతా గులక – అవి లేకపోతే అడుగు వెయ్యలేను. రేపు నారిగాడ్ని పిలసకరా కుట్టించాల." నాయనివారు క్రిందపడిన వాటిని రెంటినీ దీసి బ్యాగులో వేసుకుని నడవసాగారు. తన చెప్పులనైనా నాయనివారికిస్తే బావుండుననిపించింది లింగయ్యకు, కానీ ఏం లాభం! అవి ఆయనకు సరిపోవు. సరిపోయినా ఇంటికి వెళ్లేలోపు అవి ఆయన పాదాలను కరవడం ఖాయం. లింగయ్య తన చెప్పులను కూడా తీసి చంకలో ఇరికించుకుని నడవసాగాడు.

ఆస్తులు కరిగిపోయినా పెద్ద చిన్న అనుబంధం, గౌరవం, ఓ దగ్గరితనం చూపిస్తూ ఇదంతా రూపు మార్చుకుంటున్న తీరుని లీడరు, అతని శిష్యుడి సంబంధంలో చూపించటం మహేంద్ర నైపుణ్యం.

మంచి పేరు రావాలన్న స్వార్థంతోటే కావచ్చు జమీందారు, అన్నీ పోగొట్టుకొని దుర్భర జీవితాన్ని అనుభవించారు. అయినా ఆయనలో మంచితనం చావలేదు. కొందరు తమ స్వసుఖంకోసం, ఆనందంకోసం ఎన్నో దుర్మార్గాలు చేస్తారు. పల్లెలో ఇలాంటి రెండు రకాల వ్యక్తుల మధ్య వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కనబడుతుంది.

వ్యక్తుల మధ్య, పరిస్థితుల మధ్య వ్యత్యాసం చూపించటం చాలామంది రచనల్లో కనపడతాయి. కానీ స్వర్ణభూమికి స్వాగతంలో తాత్విక విధానాన్ని ప్రశ్నించటం, సాంఘిక సంబంధ ఆలోచనారీతిని ఎత్తిచూపటం ప్రత్యేకత.

ఆ ప్రాంతం బంగారం గనుల గురించి అడిగిన పత్రికా విలేఖరి రమణమూర్తితో తిమ్మరాయప్ప-

"గెనిలో పని అంటే మిత్తవతో పోరినట్టే ఉండాది. పోయిన పండగ నెల్లో ఆ సొరంగాల్లో నేల అల్లుకోని మా వోళ్లు ముగ్గురు ఒకేనాడు కాలమయిపోయిరి. ఆ గెన్లో పడే కష్టం బూమ్మీదనే పడితే రాజనాలు పండు. అయినా బంగారం మీద జనాల కెందుకింత బ్రెమో తెలవటం లేదు. అదేమన్నా కూట్లోకి వస్తాదా? కూర్లోకి వస్తాదా? సేతుల కష్టంతో వడ్లు పండించు. రాగులు పండించు. తిండి జరగతాది. టెంకాయ సెట్లు బెట్టు, మామిడితోపులు బెట్టు. మనుషులకు నీడ దొరకతాది. ఊరు వాడంతా పచ్చగ లచ్చిమి కళకళలాడతాది. ఒక గురుగింజంత బంగారం కోసం ఎకరాలు ఎకరాలుగా బీళ్లు పెట్టేసినారు. నాకు తెలీక అడగతా సా. ఈడకొచ్చిన ప్రతి పెద్దమనిషి ఈడ బంగారం దొరకతాదా, ఈడ బంగారం దొరకతా వుండదా అని అడగతా వుండాడే, ఎవురేగానీ ఇక్కడ తాగేదానికి నీళ్లు దొరకతా ఉండదా అని అడగతా వుండాడా? భూమండలానికి సొరంగం ఏసినట్లుగా యోజనాలు యోజనాలుగా తవ్వి కేజీఎఫ్‌కు ఎత్తుకోని బోతా ఉండారే? మంచినీళ్లు తాగను సేదబావులు తవ్వాలని ఎవురైనా అనుకుంటా వుండారా?"

సంపదకోసం ప్రణాళికలు... ప్లాన్లు తప్ప... మెజారిటీ జనం కోసం... వారి బతుకు స్వర్ణసీమగా మారటం కోసం ఎవరి ఆలోచనేనా సాగుతోందా?

సరుకుల రవాణా కోసం, వ్యాపారం కోసం రోడ్లు వేస్తారు తప్ప జన సౌకర్యం కోసం రోడ్లు వేస్తున్నారా? జీవితావసరం అయినా మంచినీళ్ల కోసం ఏం చేస్తున్నారు? ఇన్ని నదులు, వనరులు ఉన్న ఈ భారతదేశంలో అన్నింటికన్నా ముందు మంచినీళ్లు ముఖ్యం అన్న ఆలోచన సాగుతోందా?

మహేంద్ర దార్శనికత గొప్పది. 1985లో అతని ఊహ ఇప్పటికీ సాదృశమే.

ప్రఖ్యాత రచయిత కీ.శే. మధురాంతకం రాజారాంగారి చిన్న కొడుకు, కథా రచయిత నరేంద్ర సోదరుడు మధురాంతకం మహేంద్ర పట్టుమని పాతిక కథలయినా రాయకుండానే, రెండవ నవల రాసే అవకాశం రాకుండానే 1998లో హఠాత్తుగా ఈ లోకం నుంచి నిష్క్రమించడం తెలుగు సాహితీ రంగ విషాదాల్లో ఒకటి. చిన్న వయసులోనే మననీ, సాహితీలోకాన్ని వదిలేసి మహేంద్ర వెళ్ళిపోవడం తెలుగు సాహిత్యానికి లోటే.

తెలుగునాడి మాసపత్రిక **-వి. రాజారామమోహనరావు**

జూన్ 2008

గొప్ప ఆధునిక నవల

కుప్పం బస్టాండు నుంచి ఎదురు చూడగా చూడగా ఎప్పటికో బయలుదేరిన బస్సు... ఆ పల్లెటూళ్లో డొక్కుబస్సులో ప్రయాణం. ఎందరితోపాటు అందులో పెద్దపర్తిగుంట అనే ఊరిదాకా ప్రయాణించిన తిమ్మరాయప్ప అనే పేద ముసలి రైతు కథే ఇందులో ప్రధాన కథాంశం.

తిమ్మరాయప్పకి పెద్దల నుంచి వారసత్వంగా అందిన కాస్త పొలం ఉంది. అది కంగుంది సంస్థానంలోని జమీందార్ల నుంచి అందిన పట్టా. జమీలు పోయి ప్రభుత్వాలు మారిన తర్వాత దాన్ని కొత్తగా మార్చుకోవాలని తెలియని నిరక్షరాస్యరైతు తిమ్మరాయప్ప.

వ్యవసాయం అతనికి పెద్ద సమస్య అయిపోయింది. కూలివాళ్ళు దొరకడం లేదు. కారణం మైనింగ్ తవ్వకాలలాంటి రకరకాల పనులు వాళ్ళని లాగేసుకుంటున్నాయి. భూములన్నీ వానలు లేక బీళ్లుగా మారిపోయాయి. 'వడ్డోని చెరువు' కింద ఉన్న మడి కాస్త పచ్చగా ఉందని, దాన్ని కాపాడుకోవడానికి బావి తవ్వించే పని మొదలుపెట్టాడు. ఎవరెవరి కాళ్లో పట్టుకుని తెచ్చిన డబ్బుతో కొంత పని అయింది. నీరు పడలేదు. గొర్రె పిల్లల్ని అమ్మి కొంత పని పూర్తిచేసేసరికి నల్లరాయి పడింది. అది పేల్చితే నీళ్లు పడతాయి. నీళ్లు పడితే నాట్లు వెయ్యొచ్చు. ఇంట్లో వున్న అడ్డిగలు, అడ్డ సైన్లు నాగరాలు, ఒంకీలు అన్నీ అయిపోయాయి. చివరకు మనవరాలి మెడలో తల వెంట్రుక ప్రమాణంలో గొలుసు మిగిలింది. దాన్ని పట్టుకుని బేంక్‌లో పెట్టి అప్పు తెచ్చుకోవాలని నాలుగు రోజులనుంచి తిరుగుతున్నాడు.

బేంక్‌వాళ్ళు ఈ పట్టాలు పాతవి, తహసీల్దారు దగ్గిరికి వెళ్ళి కొత్తవి రాయించుకు రమ్మన్నారు. దానికోసం తాలూకా ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాడు. అక్కడి ఉద్యోగులు వాళ్ళ టీలకు, బీడీలకు, సిగరెట్లకు ఈ ముసలి పేదరైతు మీదే ఆధారపడ్డారు. అతని కష్టార్జితమంతా అలా ఖర్చయిపోతోంది. మిగిలిన కాసిన డబ్బులూ బస్ టిక్కెట్టుకు దాచుకుని ఆకలి వేసినా చుట్టుపక్కల ఉన్న హోటళ్ళలో ఏమీ తినకుండా, ఇంటికి వెళ్లి మనవరాలు వండిన జొన్న సంకటీ ఆకుకూర పులుసూ తినవచ్చని బస్‌కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు.

కొత్త పట్టాల కోసం, బేంక్‌లోన్ కోసం తిరిగి తిరిగి అడ్డమైన వాడి కాళ్లూ పట్టుకుని అతనికి తన బతుకు మీద రోత పుట్టింది. దేవుడు తనలాంటి వాడిని ఎందుకు పుట్టించాడా అని వగచాడు.

ఆ చుట్టు పక్కల పేద రైతులందరి పరిస్థితి ఇదే. అది చాలా ఉండగా బిగుసుగుంట అనే ఊళ్ళో బంగారపు గనులు ఉన్నాయని తవ్వకాలు మొదలయ్యాయి. ఆ మైనింగు పనివల్లే కూలీలు దొరక్కుండా పోయారు.

వ్యవసాయం లేక పేదరికం రాజ్యం చేస్తున్న చోట ప్రజలలో రకరకాల వ్యక్తులు తయారవుతారు. సోమరులు, తిరుగుబోతులు, తాగుబోతులు, రాజకీయాల ముసుగులో పబ్బం గడుపుకునేవారు... ఇలా రకరకాల వాళ్ళందరి సమూహాలతో ఈ సభలో కొన్ని పాత్రలు ఉంటాయి. వారందరూ కూడా ఈ పెద్దపర్తిగుంట వెళ్ళే బస్ కోసమే ఎదురు చూస్తుంటారు.

వందమంది ప్రయాణీకులు తమ ఊళ్ళకు వెళ్ళడానికి గంటల తరబడి ఎదురు చూడగా ఎదురు చూడగా ఎట్టకేలకు ఆ బస్ అనబడే ఒక వాహనం కుప్పం బస్‌స్టాండులోకి వచ్చింది.

అంతకుముందు అక్కడికి రకరకాల బస్సులు వచ్చాయి. అందులో బెంగుళూరుకు బయల్దేరిన బస్ భోజనానంతరం తిన్నది అరగడం కోసం మాత్రమే అరమైలు దూరం నడిచే జల్సా పురుషుడిలా ఉందట. తిమ్మరాయప్పకు బస్సులోని మనుషుల వాలకం చూస్తేనే ఇది తన బస్సు కాదని అర్థమైపోయిందట. ఉప్పునీళ్ళు చల్లి, మనుషులతో తొక్కించి, బండ్ల మిద్దెల్లో భర్తీ చేసే చింతపడు కన్నా హీనంగా బస్ అంతా జనంతో లోడ్ అయితేనేగాని పెద్దపర్తి గుంట బస్సు బయల్దేరడం తిమ్మరాయప్పకు ఎరుకలో లేదు.

మొత్తానికి బస్ వచ్చింది. అప్పటిదాకా వేచి వున్న రకరకాల జనం ఆడా మొగా ఆ బస్‌మీదకి ఎగబడ్డారు. డ్రైవర్, కండక్టర్ మాత్రం బస్ దిగేసి కనపడకుండా పోయారు. బస్ ఎక్కడికి వెడుతుందో తెలియడానికి దానిమీద ఊరిపేరు రాసిన ప్లేటు పెట్టలేదు. బస్ ఎక్కబోయిన జనాలకి అదొక సమస్య అయింది. మొత్తానికి పెద్దపర్తిగుంటకు పోయే బస్సే అని నిర్ధారణ అయింది.

బస్‌కోసం ఎదురు చూసిన తిమ్మరాయప్ప తిండీ తిప్పలు లేక నీరసంతో సొమ్మసిల్లి నట్టుగా పాతకొయ్యనొకదాన్ని ఆనుకుని నేలమీదకి ఒరిగిపోయిన వాడు లేచాడు.

బస్ ఎక్కడానికి వచ్చినవాళ్ళలో సుభద్రమ్మ ఒకతె. ఆమె చంటి బిడ్డను తీసుకుని హాస్పిటల్‌లో చూపించడానికి పొద్దున్న అనగా వచ్చింది. రెండు గంటల నుంచి ఎండవేళ హాస్పిటల్‌లో నుంచి బయటికి వచ్చి జ్వర తీవ్రతతో ఉన్న చంటిబిడ్డను చంకన వేసుకుని

బస్ కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. ఆమె వివాహిత అయినా సరే ఏ ఇబ్బందీ లేకుండా ఆమెను తనవేపు తిప్పుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్న వెంకటపతి కూడా అక్కడికి చేరాడు. సరదాగా డబ్బు ఖర్చు పెట్టుకుంటూ జల్సాగా తిరిగే షోకిల్లారాయుడు అతను. చూడగానే ఆమెకు సకల సదుపాయాలూ చూడడం మొదలు పెట్టాడు. కష్టమూ, సుఖమూ పట్టించుకోని భర్తతో విసిగిపోయి చంటిబిడ్డ నెత్తుకుని అలసిపోయి ఉన్న సుభద్ర ఆ సౌకర్యాలు వద్దనకుండా తీసుకుంది. అంతా చేసి అవి కాసిని మంచినీళ్ళు, టీ నీళ్ళు, కాస్త నీడ ఉన్నచోటు. చివరకు బస్‌లో చోటు కూడా సంపాదించి పెట్టాడు.

అత్తినీలాలూ, సంపంగి గౌడు అనే ఇద్దరు తాగుబోతులు కల్లు పూటుగా పట్టించి అక్కడికి చేరారు. ఇంకా బస్సు రాకపోవడంతో వాళ్ళిద్దరూ జమీందారుగారి సిల్వర్ జూబిలీ పార్క్‌లో చేరితే, వారి వెనకే తిమ్మరాయప్ప కూడా వెళ్లి తన గోడు అంతా వెళ్ళబోసుకున్నాడు. ఆ పార్కులోనే అదే బస్‌కోసం ఎదురు చూస్తున్న మరోవ్యక్తి వాళ్ళని కలిసాడు. అతను ఒక పత్రికా విలేఖరి. పేరు రమణమూర్తి. చిగురుగుంటలో పడబోతున్న బంగారం గనుల గురించి పేపరుకి రిపోర్టు వ్రాయడం కోసం వచ్చి అతను కూడా ఆ బస్ కోసమే ఎదురు చూస్తున్నాడు.

ఆ పార్కులో 'కంగుంది జమీందారు' విగ్రహం ఠీవిగా నిలబడి ఉంది. ఆయన పీఠం దగ్గర కూర్చున్న తిమ్మరాయప్ప గురించి రచయిత ఇలా రాస్తాడు – "తిమ్మరాయప్ప కడుపు మడతపడి డొక్క వీపుకి అంటుకుపోయింది. అతడు తనకోసం ఇంటి దగ్గర ఎదురు చూస్తున్న మనవరాల్ని గురించి ఆలోచించడం లేదు. తన ఇంటి చూరునుంచి వ్రేలాడుతున్న ఉట్టిలో తనకోసం తొంగి చూస్తున్న సంగటి ముద్దని గురించి కూడా అతడు ఆలోచించడం లేదు. అతడు ఆలోచనా శూన్యుడై శిథిలమై పోతున్న జమీందారి పట్టాల్నీ, తన కష్టార్జితం, తన రక్తం అయిన సంపాదనలో అధికార్ల టీలకు, సిగరెట్లకు పోగా మిగిలిన చిల్లర కాసుల్ని కెలుక్కోసాగాడు."

తిమ్మరాయప్ప ఆకలిగా ఉన్నా కూడా ఆ కాసిని డబ్బులు ఖర్చు పెట్టకూడదని కడుపు మాడ్చుకుంటూ దాచుకున్న డబ్బులు అవి. అవి లెక్కపెట్టుకుంటూ కూర్చున్నాడన్నమాట.

భాగ్యమ్మ అనే స్త్రీ మోజులో పడి ఆమెను వెతుక్కుంటూ బస్‌స్టాండ్‌లో తిరుగుతూ ఇదే బస్ దగ్గరికి వచ్చిన మరొక వ్యక్తి అప్పాజీ. భార్య వదిలెయ్యగా భాగ్యంతో కలిసి ఉండబోయినా, భాగ్యమూ ఏమార్చి దూరంగా తిరుగుతూ ఉండడం అప్పాజీకి కష్టంగా వుంది. ఇదంతా తెలిసిన లీడరూ, అతని వెంట తిరుగుతూ డబ్బు ఖర్చు పెడుతూ వుండే తిప్పయ్యగౌడ్ అనే వ్యక్తి. అరవై ఏళ్ళ ముసలివాడు గౌడ్, లీడరు ప్రభావానికి గురైన మరో వ్యక్తి. వీళ్ళతోపాటు గుడుపల్లె సుందరేశ వడియార్ అనే కుమ్మరి పని చేసుకునే

అతను కూడా వారితో కలిసి బస్‌కోసం ఎదురు చూస్తున్నాడు. వీరందరూ మాట్లాడుతున్న రాజకీయ, ఆధ్యాత్మిక విశేషాలతో తనకేమీ సంబంధం లేకపోయినా, వాటన్నిటికి తిప్పయ్య గౌడుతో పాటు తిమ్మరాయప్ప కూడా శ్రోతగా మిగిలాడు.

జమీలు పోయి బీదరికంలో ఉన్నా దర్పం వదలలేని వసంత రాయనివారు, అతని అనుయాయి లింగయామాత్యులు కూడా బస్ కోసం కూర్చున్నారు. ఇలా వివిధ రకాలయిన వ్యక్తులను పరిచయం చేస్తూ వారి వేషభాషల ద్వారా వారి వ్యక్తిత్వాలను మనకు అవగతం చేస్తూ కథ నడుపుతాడు.

బస్సులోకి జనం ఎక్కడం ఒక పెద్ద యుద్ధంలా ఉంటుంది. కిక్కిరిసిన బస్సును డ్రైవరు నడపలేక, టిక్కెట్లు కొట్టలేక కండక్టరూ పడే పాట్లన్నీ చూస్తుంటే ఎంత దుర్భరంగా ఉందో ప్రయాణీకులతో నిండిన ఆ బస్సు పరిస్థితి అని అనిపిస్తుంది. ఒక్కొక్కరూ బస్ ఎక్కడాన్ని అతి వివరంగా రాస్తాడు మహేంద్ర. అందులో సీటు సంపాదించటంలో వారు చూపిన శక్తియుక్తులు ఎన్ని విధాలుగా ఉన్నాయో వ్యంగ్య పూరితమైన ధోరణిలో రాస్తాడు.

చివరకు బస్సు ఎలాగయితేనేమి బయలుదేరింది. ఇప్పుడు బస్సు వందలాది చేతులతో, కాళ్ళతో కదులుతున్న రోకలి బండలా ఉంది. బస్సంతా సజీవ మాంసం వేసిన గోడౌన్‌లా మారిపోయింది. మురికి మురికిగా నరక కూపానికికొక నమూనాగా ఉంది. కండక్టర్‌కి టిక్కెట్టుకి డబ్బులు ఇవ్వడానికి తిమ్మరాయప్పకి చాలా టైం పట్టింది. కారణం తిమ్మరాయప్ప ఒకానొక కమ్మీని పొదివి పట్టుకుని దాదాపు దానిమీదే ఒరిగిపోతున్నట్లుగా నిలబడి ఉన్నాడు. ఊత కర్ర జారిపోయింది. తిండి తిని ఇరవై నాలుగు గంటలు పూర్తి కావస్తోంది. బస్సులో జనం అతడిని నల్లిని నలిపినట్టు నలిపేస్తున్నారు. మోకాళ్ళతో మోచేతులతో కుమ్మబడి అతని పక్కటెముకలన్నీ నుగ్గు నుగ్గు అయిపోతున్నాయి. ఈ జనం మధ్యలోంచి చెయ్యి కదిపి నడుముకు కట్టుకున్న కొండి నుండి చిల్లర తియ్యాలి. అందులో ఉన్న ఆస్తి తాలూకు పత్రాలు, వాటికి కిస్తు చెల్లిస్తున్నట్టు రశీదుల మధ్య నుంచి చిల్లర తియ్యాలి. అదీ ఆలస్యం. ఈ ఆలస్యానికి కండక్టరు వెటకారంగా వ్యంగ్యంగా తిట్టి ఆ చిల్లర పుచ్చుకుని వెళ్ళిపోయాడు. బస్సు పెద్దపర్తి గుంట దాకా పోదని సంగనపల్లి దాకానే పోతుందని చెప్పి, తిమ్మరాయప్పకి ఇవ్వవలసిన చిల్లర గురించి పట్టించుకోకుండా ముందుకు సాగిపోయాడు, అతడు అడుగుతున్నా వినిపించుకోకుండా.

దారి పొడుగునా దిగేవాళ్ళు దిగటం, ఎక్కేవాళ్లు ఎక్కడం... చెయ్యక తప్పని దుర్భర ప్రయాణం. అదంతా తెలియాలంటే నవల చదివి తీరాల్సిందే. రాయలసీమ గ్రామీణ ప్రాంతాల కరువు, బీదరికం, పేద ప్రజల ఇక్కట్లు అన్నీ ఇందులో సవివరంగా కనిపిస్తాయి. కానీ రచయిత ఎక్కడా ఉద్వేగానికి గురి కాకుండా నిర్లిప్తంగా చెప్పడం ఈ నవల తాలూకు గొప్ప విశేషం. చదువుతున్న మనమే రకరకాల భావాలకు గురి అవుతాం.

రచయిత పరిచయం చేసిన పాత్రలు ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా తమ తమ ఊళ్ళలో బస్సు దిగుతారు.

బస్సు డొక్కు డొక్కుగా నడుస్తూ దూరంగా మెరుస్తున్న ట్రాఫిక్ సిగ్నల్స్‌ను సమీపించింది. పట్టాల కవతల గుడుపల్లె గ్రామం ఉంది. ఆ రైల్వే లైను మద్రాసు బెంగుళూరు నగరాలను కలుపుతున్న బ్రాడ్ గేజ్ లైను. ఇక్కడిదాకా నిర్వికారంగా భీకరమయిన పేదరికాన్ని దుర్భరమయిన రవాణా సౌకర్యాన్ని గురించి రాసుకుంటూ వచ్చిన రచయిత రెండు పేజీలు అత్యాగ్రహంతో, సత్యాగ్రహంతో రాస్తాడు.

ఆ రెండు పేజీల్లో కొన్ని వాక్యాలు.... "బ్రాడ్ గేజ్ రైలు మార్గం బాధలు తీరి దిక్కులు కొలుస్తున్నట్టు గంభీరంగా వుంది. నగరాలు రెండూ పంచతంత్ర గాథల్లోని ఒక ద్వయంలా విపరీతమయిన వేగంతో నవ నాగరికతా విహాయస వీధిలో విహరిస్తున్నాయి. కొంగలు రెండు ముక్కున కరుచుకున్న ఎండపుల్లలా వుంది రైలు మార్గం. కట్టెపుల్లను నోటితో కరుచుకుని వేలాడుతూ ఏ క్షణాన అయినా అగాథంలోకి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న తాబేలులా ఉంది గుడిపల్లె..." ఎంత అద్భుతమయిన ఉపమానం.

నాగరికతల్ని మోసుకుని రైళ్ళు అయోమయ (ఇనుప) మార్గంమీద ప్రతి దినం పహారా చేస్తున్నా మధ్యనున్న గ్రామాలూ, పల్లెలూ ఇంకా జడంగానూ, నిస్తేజంగానూ, అనాగరికంగానూ ఉన్నాయి. దారి పొడవునా వ్యాపించిన వందల వేల ఎకరాల బీడు భూములు బహుశా రైలులో ఎసీ కోచ్‌లలోనూ, ఫస్ట్‌క్లాస్ కంపార్టమెంట్లలోనూ పయనిస్తున్న గౌరవనీయుడయిన ఏ రాజకీయ నాయకుడి కంటికీ, విద్యాధికుడయిన ఏ ఉన్నతాధికారి కంటికీ ఆనినట్టు లేదు. ఇటు ఆసియాలోని రైళ్లతోనూ, అటు ప్రపంచంలోని రైళ్లతోనూ పోటీపడి పరిగెడుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు మార్గాల పక్కనే పూడిక పడిపోతున్న బావులున్నాయి. అర్ధరాత్రి చలిలోనూ, మధ్యాహ్నపు టెండలోనూ అంతంత మాత్రం ఆచ్ఛాదనలతో ఏతాలు తొక్కుతున్న ఇతర మనుషులున్నారు. మోయలేని బరువుల్ని మోసే డొక్కు బస్సులు, ఎడ్ల బళ్ళు, ప్రచండ వేగంతో పరిగెత్తే రైళ్ళవంక బెంబేలు పడి చూస్తూ ఉంటాయి.

అయితే రైళ్ళలో సదా ప్రయాణం చేస్తున్న నాగరిక సమాజానికి ఇలాంటి అల్పమైన విషయాలను పట్టించుకునే వెసులుబాటు ఉండదు. వారి కాలక్షేపానికి అనేక విషయాలుంటాయి. పత్రికలు, రాజకీయాలు, చలన చిత్రాలు చర్చలకు, పాప్‌కార్న్‌లు, బఠాణీలూ తినడానికి, శీతల పానీయాలు తాగడానికి కదలక్కరలేకుండానే అందుతాయి. అనేకరకాల కార్యక్రమాలకు ఈ రైలు పెట్టెలే తగిన స్థలం అంటూ ఎంతో ఆగ్రహపూరితమైన వ్యంగ్యంతో మహేంద్ర దర్శనిమిస్తాడు.

చివరకు బస్సు గమ్యం చేరింది. అప్పటికి బస్సులో రమణమూర్తీ, తిమ్మరాయప్ప మాత్రమే మిగిలారు. బంగారు గనుల ఆచూకీ గురించి రమణమూర్తి కనపడిన వాళ్ళనల్లా

అడిగి అడిగి విసిగిపోయాడు. ఎవ్వరూ తగిన సమాధానం ఇవ్వలేదు. చివరకు తిమ్మ రాయప్పను అడిగాడు. బంగారు గనులు ఇక్కడ పడడం వల్ల మీకందరికి జీవనోపాధి లభిస్తోంది కదా! మీ బతుకులు బాగు పడుతున్నాయి కదా అని.

తిమ్మరాయప్ప పెద్ద సమాధానమే చెప్పాడిలా... "గెనిలో పని అంటే మిత్తవతో పోరినట్టే. అక్కడ పడే కష్టం భూమ్మీద పడితే రాజనాలు పండుతాయి. అయినా బంగారం మీద జనాలకెందుకింత బ్రమో తెలవడం లేదు. అదేమన్నా కూట్లోకి వస్తదా? కూర్లోకి వస్తదా? ఒక గింజంత బంగారం కోసం ఎకరాలుగా బీళ్ళు పెట్టేసినారు" అంటూ...

ఇంకా ఇలా అంటాడు "ఇక్కడకొచ్చిన ప్రతి పెద్ద మనిషీ ఈడ బంగారం దొరుకుతాదా అని అడుగుతా ఉండాడేగానీ, ఎవురేగానీ ఇక్కడ నీళ్ళు దొరుకుతా ఉండాయా అని అడుగుతా ఉండాడా? భూమండలానికి సొరంగం ఏసినట్టుగా యోజనాలు యోజనాలుగా తవ్వి కేజీఎఫ్‌కు ఎత్తుకొనిపోతా వుండారే. మంచినీళ్ళు తాగను సేద బావులు తవ్వాలని, ఎవరైనా అనుకుంటూ ఉండారా?" అని ప్రశ్నిస్తాడు.

"నేను పసరంలాంటి వోణ్ణి. కానీ ఒక మాట చెప్తా. భూమిమీద కాయకష్టం చేసి నీతిగా జీవనం చేద్దామనేవోళ్లు తగ్గిపోతూ ఉండారు. ఒకరు సంపాదించిన సొత్తును మింగేసి బతకదామనుకునేవాళ్లు పెరిగిపోతా ఉండారు" అని చివరకు తేలుస్తాడు. ఆ జాతి ఇప్పుడు ఇంకా పెరిగింది.

ఇద్దరూ బస్ దిగారు. దిగేక దార్లో తిమ్మరాయప్ప రాయి పడిన తన బావి చూపించాడు. దాని గురించి చెప్తూ బేంక్‌లో తాకట్టు కోసం పట్టికెళ్లిన మనవరాలి గొలుసుకోసం చూస్తే అదీ మాయమైపోయింది. బస్‌లో ఎవరో ఆ తొడతొక్కిడిలో తోపుడులో కొట్టేసారు. అది తెలుసుకుని ముసలివాడు నెత్తీ నోరూ కొట్టుకుని విలపించాడు. అతడు దుఃఖంతో పిచ్చివాడయి పోతాడేమోనని రమణమూర్తి భయపడ్డాడు. "ఈ గుంతే అన్నింటినీ మింగేసింది. చివరికి ఆ నగను కూడా" అంటూ ఏడుస్తూ ఇంత మట్టిపోసి ఆ గుంతలోకి విసిరాడు. అంత దుఃఖంలోనూ ఆ ముసలివాడు తన అతిథి మాట గుర్తు తెచ్చుకుని, సంభాళించుకొని రమణమూర్తిని వెంటబెట్టుకుని దూరంగా కనిపిస్తున్న బంగారు గని దగ్గర వెలుగుతున్న దీపాలను చూపించాడు.

కానీ రమణమూర్తికి ఇప్పుడు అటు వెళ్ళాలనిపించలేదు. అనేక వ్యయ ప్రయాసల కోర్చి, మట్టి తవ్వి బంగారం తీసి జనుల భవితవ్యాన్ని సంపన్నం చెయ్యడం కోసం వందలాది కార్మికులు, యంత్రాలతో కలిసి దీర్ఘ కఠోర శ్రమ జరుపుతున్న ఈ భూమిలోనే ఒక నిర్భాగ్యుడైన ముసలివాడు ఉన్న కాస్త బంగారాన్ని పోగొట్టుకుని విగత జీవిగా మారిపోతున్న దృశ్యం అతనిని కలచి వేస్తోందంటూ ఒక ప్రశ్నతో నవల ముగిస్తాడు మహేంద్ర.

ప్రశ్న ఇది... "ఈ నిరంతర స్పర్ధాయుత, క్షణక్షణ సంఘర్షణామయ, సతత అనిశ్చిత అపాయకర సుదీర్ఘ పథంలో చివరకు దొరికేదేమిటి? అది మిగిలేదెవరికి?"

ఈ ప్రశ్నతో మహేంద్ర ఇటువంటి జీవనాన్ని చూడలేక సెలవు తీసుకున్నాడు. తాత్వికత లోతులు నిండిన పెద్ద పెద్ద కళ్లలోని చూపులు ఏవో లోకాలను వెదుకుతూ ఉండగా అక్కడికే చేరుకున్నాడు. నూట పదిహేను పేజీల ఈ విలువైన కానుకను తెలుగు భాషకు అందించి తన వంతు బాధ్యత నెరవేర్చాడు. భారతీయ భాషలన్నింటిలోకీ, ప్రపంచ భాషల లోకీ వెళ్ళవలసిన నవల ఇది.

1985లో 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో సీరియల్‌గా వచ్చిన ఈ నవల 1991లో మొదటి ముద్రణ పొందింది. సాహితీ విమర్శకులు శ్రీ ఆర్.యస్. సుదర్శనంగారు దీనికి ముందుమాట రాశారు. బస్సు ప్రయాణం అన్న దాన్ని జీవన ప్రయాణానికి ప్రతీకగా తీసుకుని కూడా విశ్లేషించారు. ఈ బస్సు ప్రయాణంలో ఎవరి కోరికలూ, ఎవరి సమస్యలూ తీరలేదు. బస్సు అంటే అది ప్రయాణమే తప్ప దానికి మానవుని ఆశలతో, సుఖ దుఃఖాలతో సంబంధం లేదు. ప్రయాణం అంటే చలనం. ప్రగతి కూడా అంతే... అదీ బస్సు ప్రయాణం లాంటిదే. ఎవరు పైకి వెడతారో, ఎవరు కిందకి వస్తారో దానికి పట్టదు. అన్నీ పోగొట్టుకుని మృత్యువును ఎదురుచూచే తిమ్మరాయప్ప, భ్రమలు చెదిరి శూన్యంలోకి చూస్తూ లోపల బయటా వెలుగు నన్వేషించే రమణమూర్తి మిగిలారు చివరకు అంటారాయన.

నవలలోని వర్ణన మహేంద్ర ప్రత్యేకతను తెలుపుతోంది. శిల్పం అనితర సాధ్యమన్నట్టుగా ఉంటుంది. రాయలసీమలో పేదరికం మీద, కరువుమీద, రైతుల సమస్యల మీద తరువాతి కాలంలో వచ్చిన నవలలన్నింటికి ఇది మొదటిది అనే చెప్పవచ్చు.

భారతీయ భాషలలో వచ్చిన గొప్ప నవలల స్థాయిలో చేర్చవలసిన నవల వ్రాసిన మధురాంతకం మహేంద్ర - మధురాంతకం రాజారాం గారి చిన్న కుమారుడు. తండ్రీ కొడుకులిద్దరూ తెలుగు సాహితీ ప్రపంచంలో చిరంజీవులు, చిరస్మరణీయులు, మధురాంతకం నరేంద్రతో పాటు మన అందరికీ ఆత్మీయులు.

-డా॥ వాడ్రేవు వీరలక్ష్మీదేవి

మహేంద్ర 'స్వర్ణసీమ'కు మా స్వాగతం

ఆంధ్రజ్యోతి వారపత్రికలో 'సంపంగితోట' శీర్షికలో విచ్చుకున్న మొగ్గ గుబాళిస్తోంది. మహేంద్రగారి మహేంద్రజాలం మనోహరంగా వుంది. స్వర్ణసీమకు స్వాగతం చెప్పక తప్పదు. అడుగడుగునా కవిత్వాన్ని నింపే రావిశాస్త్రిగారు ఆంధ్రదేశానికి ఆ కొసలో, 'ఆకాశాన్నీ, భూమినీ కొలిచే' మహేంద్రగారు ఆ వారసత్వాన్ని అందుకుని ఈ కొసలో.

కవులు కళ్ళు తెరిచి లోకాన్ని చూడలేకపోయినా మహేంద్రగారి అక్షరాల్ని చదివినా చాలు, అనుభవాలు, ఆవేశాలు బొమ్మలు కట్టి పాఠాలు చెబుతాయి.

ఎప్పుడో వర్జీనియా వుల్ఫ్ నుండీ యిప్పటి చండీదాస్ గారి దాకా నవలాకారుల శ్రమ గురించి చెబుతూనే వున్నారు. 'జీవితం - నవలాకారుడు' అన్న వ్యాసంలో వర్జీనియా వుల్ఫ్ నవలకారుడి శ్రమను ఆకాశానికెత్తింది - "He is being stimulated and played upon the subject - matter of his art.

Taste, sound, movement, a few words heard, a gesture there, a man coming in, a woman going out, even the motor that passes in the street or the begger who shuffles along the pavement, and all the reds and blues and lights and shades of the scene claim his attention and rise his curiosity.

He can no more cease to receive impressions than a fish in mid ocean can cease to let the water rush through his gills."

మహేంద్రగారు ఎన్నాళ్ళు బస్టాండులో నిల్చుని తన రక్తనాళాలతో ఏకాగ్రంగా పరిశీలించారో - ఆయన దృష్టిలో పడని దృశ్యమే లేదు.

-సౌభాగ్య

స్వర్ణసీమకు స్వాగతం

ఆంధ్రదేశానికి దక్షిణపు చివర కర్ణాటక, తమిళ నాడు రాష్ట్రాలకు సరిహద్దుగా వున్న ఒక మారుమూల ప్రాంతం కుప్పం తాలూకా కంగుంది సంస్థానాధిపతుల కాలంలోను, బ్రిటీషువారి హయాంలోను, పాలకుల నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన ఈ ప్రజల నాలుగు దశాబ్దాల స్వతంత్ర పరిపాలన తర్వాతి జీవనం ఈ నవలలో కనిపిస్తుంది. ఈ మారుమూల చీకటి ప్రపంచం లోకి చేసిన ఒక నవలా యాత్ర 'స్వర్ణసీమకు స్వాగతం.'

ఈ నవలికలోని పాత్రలు వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్దేశించి రాసినివి కావని గమనింప మనవి.

కథా రచనాకాలం : 1985

-మహేంద్ర

(జులై 1వ తేదీ 1988 నుంచి పదివారాలపాటు ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రికలో ధారావాహికంగా వెలువడిన నవల)

1. కుప్పం బస్టాండు ఫేమ్

"పెద్దపర్తిగుంట బస్సు ఎప్పుడొస్తుంది నాయినా" – ఎంక్వయిరీ ఆఫీసు బైట నిలబడి ద్వారంగుండా తల మాత్రం పోనిచ్చి అడిగాడు తిమ్మరాయప్ప. కుర్చీలో చతికిలబడి ఎదురుగా వున్న బల్లపై కాళ్ళు బార్లా చాపుకుని కంట్రోలరు సన్నగా గురకపెట్టి నిద్రబోతున్నాడు. అతడి మెడ మీద, బొజ్జమీద కండరాలు మడతబడి చెమట కాలువలు కట్టి శరీరమంతా తడిసిపోతోంది. చెంపలమీదినుండి చొంగ కారడం వల్ల ఈగలు అతడి నోటిమీదికి జుయ్‌మంటూ వాలుతున్నాయి.

మధ్యాహ్నపు ఎండ దబాయిస్తోంది. బస్టాండులో ఎర్రటి దుమ్ము రేగుతోంది. ఎండలో నడిచి రావడంవల్ల తిమ్మరాయప్పకు ఎంక్వయిరీ ఆఫీసులోకి తొంగిచూసినప్పుడు కళ్ళకేమీ కనిపించకుండా బైర్లు కమ్మాయి. వయసు మీరడం వల్ల చెవులు కూడా మాంద్యం అయినాయి. ప్రక్క పండ్లన్నీ వూడి లొక్కి దవడలు పడడం వల్ల మాట స్పష్టంగా పలకడం లేదు. ఊతకర్ర లేకపోతే దారి సాగదు. మొలకు చుట్టుకున్న మాసికల పంచ వొక్కటే అతడి శరీరంపైన చెప్పుకోదగ్గ వస్త్రాలంకారం.

తిమ్మరాయప్ప అడిగిన ప్రశ్ననే మళ్ళీ అడిగి జవాబు కోసం మళ్ళీ కొంతసేపు వేచి చూశాడు.

కంట్రోలరు పడుకున్న గది చాలా చిన్నది. అందులో ఒక బల్ల, కుర్చీ తప్పించి కొన్ని బస్సు రూట్ల నేమ్‌బోర్డులు, అదనపు సిబ్బంది కెవరికైనా ఆసనాలుగా ఉపయోగపడే పాత టైర్లు వున్నాయి. సిమెంటు రేకుల కప్పు కల్గిన ఆ గదిలోనికి గాలి రావడానికి ఉద్దేశించిన కిటికీకి అడ్డంగా ఇప్పుడు బస్సుల రాకపోకలకు సంబంధించిన బోర్డును కట్టేశారు. బయట ఎప్పుడైనా గాలి ఆడితే బోర్డు డబడబ కొట్టుకుంటూ వుంది. తిమ్మరాయప్ప చెవులు రిక్కించి, కండ్లు పొడుచుకొని కంట్రోలరు గురక విన్యాసాల్ని గుర్తించటానికి ప్రయత్నించాడు.

తర్వాత మెల్లగా కాళ్ళు ఈడ్చుకుంటూ ఎంక్వయిరీ ప్రక్కనున్న వెయిటింగు రూములోకి నడిచాడు. వెయిటింగు రూము గోడలకు అతికించిన పాత సినిమా వాల్‌పోస్టర్లు అక్కడక్కడ చినిగి వ్రేలాడుతున్నాయి. ఎవరో కొందరు అభిమానులు తమ ఆపోజిట్ పార్టీ సినిమా హీరోలను బండబూతులు తిడ్తూ, తమ పార్టీ హీరోలు మాత్రం జిందాబాద్ అనీ వర్ధిల్లాలి అనీ వ్రాసిన బొగ్గు రాతలు వెయింటింగు రూము లోపలి గోడల్ని ఆక్రమించేస్తున్నాయి. మరికొంతమంది అక్షరాస్యులు మానవ సంతానోత్పత్తి రహస్యాలను పవిత్రంగా అందరికీ అందుబాటులో తేవడానికి మిగిలిన జాగాను వినియోగించుకుంటున్నారు. నేలంతా గచ్చు వూడి గుంతలు ఏర్పడ్డాయి. చాలని దానికి కాలిపోయిన అగ్గిపుల్లలు, బీడీముక్కలు, కర్ర గట్టిన వక్కాకు ఎంగిళ్ళు, చెత్త చెదారంతో గది పూర్తిగా నిండిపోయి వుంది. ప్రయాణీకులు కూర్చోవడానికి వేసివున్న సిమెంటు బెంచీలపైన కట్టెల మోపులు సేదతీరి వున్నాయి. బస్సులపైకి మూటలు మోసే కూలీలు కొందరు ఒక మూల కూర్చొని పులిజూదం ఆడుకొంటున్నారు. తిమ్మరాయప్ప తన ఊత కట్టెను కొట్టుకుంటూ వెయిటింగ్ రూంలో అడుగు పెట్టాడు. దారిలో పడుకున్న గజ్జికుక్క కుంయ్‌మంటూ లేచి నడుమును విల్లులా వంచి వొళ్లు విదిలించుకుని గది మూలగా వెళ్ళి పడుకుంది.

తిమ్మరాయప్ప వెయిటింగ్ రూం నుంచి మళ్ళీ బయటకు నడిచాడు. సేలం నుండి ధర్మపురి, కృష్ణగిరి మీదుగా చిత్తూరు వెళ్ళే అణ్ణా ట్రాన్స్‌పోర్ట్ బస్సు బస్టాండులో ఒక క్షణంసేపు మాత్రం తప్పు చేసినట్లుగా ఆగి మళ్ళీ అంతే వేగంగా ముందుకు కదిలి న్యూ రామవిలాస్ హోటలు ముందు ఆగింది. ఆగిన బస్సులో నుంచి ఇద్దరు వ్యక్తులు ఎంక్వయిరీ ఆఫీసుకేసి నడుచుకుంటూ వచ్చారు. కాశీ మజిలీ కథల్లో మణిసిద్ధుని వెంట గోపాలుడు పడ్డట్టు తిమ్మరాయప్ప మళ్ళీ వారిననుసరించి ఎంక్వయిరీ ఆఫీసు ముందు మోకరిల్లాడు.

వచ్చిన వారిద్దరూ గసపోసుకుంటూ ఎంక్వయిరీలోకి దూకారు. కంట్రోలరును కుదిపి మరీ లేపి కూచోబెట్టి మల్లానూరు బస్సు మధ్యలో చెడిపోయిందనీ, డిపోనుంచి మెకానిక్కు వస్తేగానీ కదిలేట్టు లేదని చెప్పారు. కంట్రోలరు కళ్ళు తెరిచి వారికేసి కొంతసేపు అనాసక్తంగా జూసి నిస్తేజంగా వుండిపోవడంతో, వచ్చినవాళ్ళు ఈసారి గొంతు పెంచి చెప్పిన సంగతినే మరొక్కసారి చెప్పి, సాయంకాలానికి బస్సు రిపేరు గాకపోతే సంతకొచ్చిన జనాలు పిల్లాజల్లా అందరూ నానా అవస్థలు పడిపోతారని కూడా చెప్పి చూశారు. ఇన్నీ మాట్లాడిన తర్వాత కొద్దిసేపటికి వారు కంట్రోలరు కళ్ళు తెరుచుకునే నిద్రపోవడం సాధన చేస్తున్నట్లు తోచడంతో విసుగ్గా వెలుపలి కొచ్చేశారు. గయ్యాళి భార్య భర్తమీద రుసరుసలాడు తున్నట్లుగా ఎండ మనుషుల తలలమీద చురచురలాడుతోంది. ఆగంతకులిద్దరూ ముఖాలు

ముడుచుకుని మొదట బస్సుల్నీ, తర్వాత రోడ్లనీ, బస్సుల్ని సక్రమంగా పెట్టలేని ప్రభుత్వాన్నీ, తర్వాత సక్రమమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోని ప్రజల్నీ, ఆపైన తమలో తామే ఒకరు మరొకర్ని తిట్టుకుంటూ, పేంటు గుండీలు సవరించుకుంటూ బస్టాండు కటువైపునున్న పాయిఖానాల వెనకకు నడిచారు. మూడుకాళ్ళపై వూగుతూ తిమ్మరాయప్ప మళ్ళీ వారి వెనుకనే బడి "నాయిన్నాయినా, పెద్ద పర్తిగుంట బస్సు ఎప్పుడొస్తాదో కొంచెం చెప్పండి సామీ, సచ్చి మీ కడుపున పుడతా. అంత పొద్దుకాన్నించీ ఎండలో నిల్సుకోని నిల్సుకోని ప్రాణానికొస్తా వుండాది" అంటూ బ్రతిమాలాడుకోసాగాడు.

"ఏమయ్యా పెద్దాయనా, అంతసేపట్నుంచీ ఈడనే పడిగాపులు పడకపోతే దోవపట్టుకో నుంటే ఈ యరవకు పచ్చార్లపల్లి దాటుకోనుందువుగదా! మీ యబ్బ కాలాల్లో అంతా బస్సుల్లో, కార్లల్లో తప్ప నేలమీద అడుగు పెట్టనట్టు మాట్టాడతా వుండావే, కాళ్ళు కదిలించి బయల్దేరుంటే పొద్దుబోకముందే కొంప జేరుకోనుందువుకదా! హూఁ నిన్నని ఏవిఁ లాభం? గంటలకు గంటలు బస్సుకోసరం బాట జూసుకోని వుండేవాడే గానీ అడుగు దీసి అడుగు పెట్టేవాడెవుడు? అర ఫర్లాంగు దూరం నడిచేవాడెవుడు? కాలమే అట్ట మారిపోయి వుండాది" భుజాలు ఎగిరి పడేట్టుగా వొళ్ళు జలదరించి పోతుండగా పేంటు గుండీలు పెట్టుకుని ఆగంతకులిద్దరూ రోడ్డుపైకి నడిచారు.

తిమ్మరాయప్ప నిలుచున్న చోటనే మరి రెండు నిమిషాలు నిలబడి కండ్లు చిట్లించి, పండ్లు యికిలించుకుని తనతో ఎకసెక్కమాడిపోయిన వారికేసి చూస్తూ వుండిపోయాడు. సూర్యుడు నడినెత్తిమీది నుంచీ పడమరకు వంగుతున్నాడు. సమయం ఒంటిగంట కావడంతో బస్టాండు ప్రక్కనున్న బడి గంట మ్రోగింది. బిలబిలమంటూ పిల్లలు రోడ్డుమీదకొచ్చి అలసిపోయిన ముఖాలతో భోజనాల కోసం ఇంటిదారి పడుతున్నారు. చుట్టుపట్ల పల్లెలనుంచీ కారియర్లు తెచ్చుకున్న పిల్లలు బోరింగ్ దగ్గర నీళ్ళు కొట్టుకోసాగారు. తిమ్మరాయప్ప కాళ్ళు ఈడ్చుకుంటూ రోడ్డు ప్రక్కగా పార్కు గోడకు ఆనించి వేసిన ఒక టీపాకలోకి వెళ్ళి అక్కడ కస్టమర్ల కోసం వేసిన బండపై ఒక చివరగా కూర్చొన్నాడు.

కస్టమర్లెవరూ లేకపోవడం వల్ల అంగడివాడు బాయిలెర్‌లోనూ, కుంపటిలోనూ సెగ తగ్గించి తీరుబడిగా కూర్చొని అరవ దినపత్రిక నొకదాన్ని పుచ్చుకుని ఆసాంతం చదివేస్తున్నాడు. అందులో 'అణ్ణా, ఎంజీఆర్, తమిళ్‌నాడ్' మొదలైన పదాలు కన్పించినపుడు ఆనందాతి శయంతో బిగ్గరగా పలుక్కుంటూ మిగిలిన అట్టే ప్రాధాన్యత లేని పదాలను కూనిరాగాలుగా లాగేస్తున్నాడు. పాకలో కొచ్చేసిన తిమ్మరాయప్ప రొండిలో నుంచీ డబ్బు తీస్తాడేమోననీ, టీగానీ కాఫీగానీ, త్రాగుతాడేమోననీ పేపరు మడతల్లోనుంచే చూపు తిప్పి

అతడు ఒకటి రెండుసార్లు తీక్షణంగా చూశాడు. కానీ తిమ్మరాయప్ప అలాంటి ప్రయత్నమేమీ చేయకపోవడంతో బస్టాండులో బలాదూర్లు తిరిగి వెయిటింగురూంలో శయనించే గజ్జికుక్కే నేరుగా వచ్చి తన బండమీద కూచున్నట్టు అతడు తిమ్మరాయప్ప కేసి అసహ్యంగా చూసి పేపరు విదిలించి, తిరగేసి మళ్లీ ప్రసన్నవదనంతో వార్తలమీద పడ్డాడు. వడగాలికి తాటాకులు చప్పుడు చేస్తున్నాయి. బాయిలర్ నుంచీ తెల్లటి బూడిద రాలుతోంది.

తిమ్మరాయప్ప కూచొన్న బండ పొయ్యిమీద పెట్టిన పెనంలా కాలిపోతోంది. అతడి కడుపులో ఆకలికి మూలుగుతున్న పేగుల పరిస్థితి కూడా అంతకన్నా నయంగా లేదు. అల్లంత దూరాన వున్న రామవిలాస్ హోటల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమం పకడ్బందీగా సాగుతోంది. గ్లాసులూ, ప్లేట్లూ, కూల్‌డ్రింకు సీసాలు ఖాళీ అవుతున్నాయి. ఎంగిలి అరిటాకులు బకెట్లు బకెట్లుగా వచ్చి హోటల్ పక్కనున్న చెత్తకుండీలో పడిపోతున్నాయి. ఊరకుక్కలు రెండు తగుమాత్రంగా కొట్లాడుకుంటూ మిగిలిన పదార్థాలను స్వాహా చేస్తున్నాయి. కుప్పం బస్టాండు ఫేం గజ్జి కుక్క దూరంగా నిలబడి పండ్లు చూపిస్తూ గుర్రుమంటోంది.

హోటలు ముందున్న కిళ్లీ కొట్టతను యమ బిజీగా వున్నాడు. అప్పుడే చాలామంది ప్రయాణీకులు భోజనాలు ముగించి తాంబూలాలు దట్టిస్తున్నారు. కృష్ణగిరి సమీపంలోని మిట్టూరు డామ్ క్రింద పండిన తెల్లటి తమలపాకులు ప్లాస్టిక్ బకెట్లలో నానుతున్నాయి. కొంతమంది సిగరెట్లు ముట్టించుకుంటున్నారు. మరికొంతమంది అరటిపండ్లు తిని తొక్కల్ని రోడ్డుమీదికి పారేస్తున్నారు. హోటలుముందు నిలబడ్డ అణ్ణా బస్సు హార్న్ మ్రోగడంతో అందరూ బస్సులోకి దూరసాగారు. హోటలు ప్రొప్రయిటరు జరదా కిళ్లీతో బుగ్గలు పూరించి రెండు చేతుల్తోనూ నోట్లను గల్లాలోకి తోసుకుని చిల్లరను కస్టమర్లవైపుకు నెట్టేస్తున్నాడు. తడిసిన బిల్లు కాగితాలతో స్లైక్ నిండిపోతోంది. తిమ్మరాయప్ప చేయి అప్రయత్నంగా నడుంమీదికి జారింది. బిగించి కట్టుకున్న అతడి పంచ రొండిలో కొన్ని కిస్తీ రసీదులు, పాత భూమి పట్టా పత్రాలు, ఒక రూపాయి కాగితం, రెండు అర్ధరూపాయి బిళ్లలు, ఒక పావలా బిళ్ళ మరొక పదిపైసలు నాణమూ వున్నాయి.

ప్రస్తుతం తనదగ్గరున్న డబ్బుకు హోటలు ఆసామి భోజనం పెట్టడు. దీనికి సరిపడా వచ్చే ఇడ్లీలాంటివి ఇప్పుడు హోటల్లో దొరక్కపోవచ్చు. అయినా బస్సు వచ్చేసిందంటే ఎంతసేపు? మరోగంటలో తాను ఇంట్లో వుంటాడు. సంగటికెలికి మునగాకు తీయగూర కాంచుకోని మనవరాలు తన కోసరం ఎదురు జూసుకోనుంటాది. అయినా ఇంతసేపు బస్సు కోసరం జూసుకోని ఇప్పుడు గనక తను హోటల్లో దూరితే ఆ మాయదారి బస్సు

ఈలోగా ఉడాయిస్తే మళ్ళేముండాది? పొరబాటున హోటల్లోకి దూరే తొందరబాటు పనికి పాల్పడనందుకు తిమ్మరాయప్ప తన్ను తానే అభినందించుకున్నాడు.

బస్టాండులోని లావెటరీ గోడలపైన ఒక పెయింటరు నెంబరు నూట నాలుగు జాడి బీడీల ప్రకటనను ఒక ప్రముఖ సినీ నటి సహితంగా చిత్రిస్తున్నాడు. పెయింటరు కాకీ దుస్తులు చెమటలో తడిసి అతడి శరీరమంతా చెమట రంగుల్లో మెరుస్తోంది. క్యారియర్లు ఖాళీ చేసిన బడిపిల్లలు పెయింటరు చుట్టూ చేరి అతడు వేస్తున్న బొమ్మకేసి విచిత్రంగా చూస్తున్నారు.

ఇంతలో ఒకదాన్నొకటి తరుముకు వస్తున్నట్టుగా ఒకటి, రెండు, మూడు బస్సులు పొడుగ్గా వున్న కుప్పం రోడ్డుపైన దూసుకుంటూ వచ్చేశాయి. బడి గంట మ్రోగడం వల్ల పిల్లలందరూ బస్సుల కింద పడబోతూ పరుగెత్తసాగారు. సడన్ బ్రేకులు వెయ్యడం వల్ల బస్సులు తిరుణాలలో కీలుగుర్రాల్లా అటూ ఇటూ ఊగుతూ ఎగిరెగిరి పడసాగాయి. వచ్చిన మూడు బస్సుల్లో ఒకటి తన బస్సు కావచ్చుననే ఆశ చిగురించడంతో టీ అంగడిలో నుంచీ బస్టాండు మధ్యలోకి వచ్చేశాడు తిమ్మరాయప్ప.

బస్సులు మూడూ ఒకేసారి సుదీర్ఘంగానూ, కర్ణకఠోరంగానూ హార్న్‌లు కొడుతూ వెనుకకూ ముందుకూ కవాతు చేస్తూ ఒకదానికంటే ఒకటి ముందు పార్క్ కావడానికి బస్టాండు అనే శ్లేష్మంలో పడ్డ పురుగుల్లా లుకలుకలాడసాగాయి. బస్సులు నిలవకముందే ఎక్కేవాళ్లు ఎక్కేయాలనీ, దిగేవాళ్ళు దిగేయాలనీ ఒట్టు పెట్టుకున్నట్టుగా చుట్టుపట్లనున్న జనాలందరూ క్షణంలో బస్టాండులో పోగయిపోయారు. 'సోడా, నన్నారి, కలర్' అంటూ కొంతమంది అబ్బాయిలు పది పన్నెండు కూల్‌డ్రింకు సీసాలను చంకల్లో యిరుకించుకుని మధ్యమధ్యలో సివంగుల్లా తిరగసాగారు. వృద్ధాప్యం అనే నేరం చేసిన పాపానికి కొంతమంది తిమ్మరాయప్పను క్రూరంగా నెట్టుకుంటూ, తొక్కుకుంటూ, ముసలి ఘటం కదలడం లేదనీ, తమకు దారి ఇవ్వడం లేదనీ నోరు పారేసుకుంటూ కొక్కిరాయిని వొరుసుకు వెళ్ళే ప్రవాహంలా ముందుకు పోసాగారు. సూర్యకిరణాలు తలెత్తి చూసిన వారి కళ్ళలోకి గుండు సూదుల్లా గుచ్చుకుంటున్నాయి. తిమ్మరాయప్ప అరచేతిని నుదిటికడ్డంగా బెట్టుకుని, ఉసురునంతా కళ్లల్లోకి తెచ్చుకుని నిలుస్తున్న ప్రతి బస్సు కేసీ, ఎక్కుతూ దిగుతున్న జనం కేసీ పరకాయించి చూడసాగాడు.

విజలాపురం బస్సు ఒంటినిండా పుల్లదుమ్ము అలదుకుని మాష్టీకునిలా విచ్చేసింది. ప్రధాన ద్వారం నుంచీ, డ్రైవరు డోరు నుంచీ కమ్మీలు విరిగిన కిటికీలనుంచీ జనం పుట్టనుంచీ బైటపడ్డ ఈసిళ్లలా నేలమీదకు దూకేస్తున్నారు. మనుషుల కన్నా సరుకులకే

విలువ ఎక్కువనే సమకాలీన ధర్మం తెలియడం వల్ల కాబోలు, 'విజలాపురం ప్రయాణీకు లందరూ సరుకుల్నంతా బస్సులోపలే వేసేసి తాము మాత్రం టాపుమీదే విచ్చేశారు. 'చేతులూ, కాళ్ళు, మొండెం, తల మొదలైన శరీరావయవాలతో మాకు అట్టే ఆసక్తిలేదు కానీ మా టమేటా గంపలూ, మా పట్టుగూళ్ళ మూటలూ, మా పొరకట్టలూ మాకు ముఖ్యం' అన్నట్టుగా వారు తమ సరుకుల్ని అతి జాగ్రత్తగా బస్సులోనుంచీ దించుకుంటున్నారు. అలా దించుకుంటున్న సరుకుల్లో కంగుంది నుంచీ వస్తున్న వీధినాటకం కంపెనీ వారి గదలూ, విల్లులూ, హార్మోనియం, తబలాలు, మైక్ సెట్లు, తెరలు కూడా వున్నాయి.

వెనుక వస్తున్నవాళ్ళు తోసుకుంటూ రావడం వల్ల తిమ్మరాయప్ప అప్రయత్నంగా మరో బస్సు ముందరికి వచ్చేశాడు. అది బెంగళూరు నుంచి కేజీఎఫ్, రాళ్ళబూదుగూరు మీదుగా కుప్పం వచ్చే ఫాస్టు సర్వీసు. ఆ బస్సు అప్పుడే ముక్కుల దాకా పెట్రోలు బిగించి, లోపలున్న ప్రయాణీకుల సెంటువాసనతో ఘుమఘుమలాడుతోంది. నల్లటి బురఖాలు ధరించిన ముస్లిం సుందరీమణులు ముఖంమీద మాత్రం ముసుగులు తొలగించి అరటిపండ్లు తిని తొక్కలు నేలమీదికి జారవిడుస్తున్నారు. మరి కొంతమంది ఎర్రగా పాన్ బీడాలు నమిలి చారికలు చారికలుగా బస్సులో నుంచీ ఉమ్మేస్తున్నారు. ఫుల్ సూట్లు ధరించిన వారి పురుషులు నడుమ అంగళ్ళనుంచీ ఆడవాళ్ళ వద్దకు ఓడకళాసీల్లా తిరుగుతున్నారు. భోజనానంతరం తిన్నది అరగడం కోసం మాత్రమే అరమైలు దూరం నడిచే జల్సా పురుషుడిలా విలాసంగా బయల్దేరింది బెంగుళూరు బస్సు. తిమ్మరాయప్పకు బస్సులోని మనుషుల వాలకం చూస్తూనే ఇది తన బస్సు కాదని ఏర్పడ్డ విశ్వాసం బస్సు మరీ అంత తొందరగా బయల్దేరేయడంతో మరింత బలపడింది. ఉప్పు నీళ్ళు చల్లి, మనుషులతో తొక్కించి, బండ్ల మిద్దెల్లో భర్తీ చేసే చింతపండు కన్నా హీనంగా బస్సంతా జనంతో లోడైన తర్వాతగానీ పెద్దపర్తిగుంట బస్సు బయల్దేరడం తిమ్మరాయప్పకు ఎరుకలో లేని విశేషం.

తిమ్మరాయప్ప మరో బస్సు దగ్గరికి నడిచాడు. ఈ బస్సునిండా తనకపరిచిత వ్యక్తులే కొలువుదీరి వున్నారు. జన సమ్మర్థాన్ని బట్టి ఇది తన వూరి బస్సులాగానే వున్నా దీనికి కనీసం సగం కిటికీలకు అద్దాలున్నాయి. తన వూరి బస్సుకు ఒకటి రెండు కన్నా ఎక్కువ కిటికీలకు అద్దాలుండే అవకాశం లేదు. ఆలయ ప్రదక్షిణం పూర్తవుతూనే భగవద్దర్శనం చేసుకునే భక్తుడిలా డ్రైవరు, కండక్టరు కోసం వెదికాడు తిమ్మరాయప్ప. అల్లరి చేస్తున్న పిల్లల్ని యింట్లో వేసి తలుపుకు తాళం బిగించి మ్యేట్నీకి బయల్దేరిన భార్యాభర్తల్లా డ్రైవరూ, కండక్టరూ ఒకర్నొకరు భుజాలతో తోసుకుంటూ టీ అంగడివైపు వెళ్తున్నారు.

లేని ఓపికనూ, ధైర్యాన్నీ కూడగట్టుకుని మూడుకాళ్ళపై ఎగురుకుంటూ తిమ్మరాయప్ప వారి వెనుకబడి "సార్! ఈ బస్సు ఏడనుంచీ వస్తూ వుంది సార్!" అంటూ దేబిరించ సాగాడు. కాకి బట్టలు వేసుకున్న నీటి ఏనుగులాంటి డ్రైవరు కాలుతున్న బీడీని నోటి చివరకు త్రోసేస్తూ 'పలమనేం చొస్తా' అంటూ తాను చెప్పదలచుకున్న దానిలో కనీసం సగం అక్షరాల్ని సైలంటు జేసి మళ్ళీ ఏకాగ్రతగా బీడీ పొగనూ, కండక్టరు బోధనామృతాన్నీ కాక్‌టైల్ చేసి గ్రోలసాగాడు.

కోరిన వెంటనే తారకమంత్రం దొరికితే ధన్యుడునయినానని పాడుకునే భాగవతునిలా విన్న మాటల్ని తన మానసవీణపై పదే పదే పలికించుకుంటూ తన్మయావస్థలో పడి పోయాడు తిమ్మరాయప్ప. నాలుగైదు నిమిషాల తర్వాతగానీ అతడికి తాను చేసిన పొరపాటు అర్థం కాలేదు. 'ఏ బస్సు ఎక్కడినుంచి వస్తే తనకేమి? అది తన వూరు వెళ్ళే బస్సా, కాదా, అదీ తనకు కావాల్సిన సంగతి' - మరొక్క వరం అడగడానికి బస్సు దేవరల వెంట టీకొట్లోకి నడిచాడు తిమ్మరాయప్ప.

టీ కొట్టువాడు భూమ్యాకాశాల్ని కొలుస్తున్నట్లుగా తేనీటిని ఒక గ్లాసు నుంచీ మరో గ్లాసులోకి పోస్తున్నాడు. పరిసరాల్ని పూర్తిగా మరిచిపోయి డ్రైవరు, కండక్టరు ఏదో జటిలమైన విషయాన్ని నిశితంగా విశ్లేషించేస్తున్నారు.

డ్రైవరు, కండక్టరు కనుక మాట్లాడుకున్నారంటే అది నికరంగా బస్సుల గురించే అయివుంటుంది. బావులు తవ్వడాలు, పంటలు ఎండిపోవడాలు, అప్పు దొరక్క రైతుల అగచాట్లు మొదలైన అల్పమైన విషయాల్ని గురించిన చింత వారికవసరం లేదు. వారి సంభాషణను జాగ్రత్తగా వినినట్టయితే తన విచికిత్సకు తరుణోపాయం దొరకవచ్చు. లేదా కాలక్రమాన వారి కటాక్షం తనపైన ప్రసరించి తన సందేహ నివృత్తి గావచ్చు... దొండపండు నోట యిరికించుకుని చెట్టుపైకి చేరిన కాకిని జూస్తూ నేలమీద కూర్చున్న ముసలి నక్కలా వారి పాదాల చెంత కూలబడ్డాడు తిమ్మరాయప్ప.

చిత్తూరునుంచీ కుప్పంకు బయల్దేరిన లైట్‌నింగ్ సర్వీస్ తమ బస్సు కంటే ముందు బయల్దేరినా యింకా రాకపోవడం గురించి కండక్టరు, డ్రైవరు మాట్లాడుకుంటున్నారు. వారికి ఎంతసేపటికీ పెద్దపర్తిగుంట బస్సు విషయం మాత్రం కాబట్టలేదు. తిమ్మరాయప్ప ఏకాగ్ర శ్రవణం కోసం కళ్ళు మూసుకుని, అందులో నుంచీ నీరసంలోకి జారి చివరకు సొమ్మసిల్లినట్టుగా పాక కొయ్య నొకదాన్ని ఆనుకుని నేలమీదికి ఒరిగిపోయాడు.

2. శంకా - సువార్త

సుభద్రమ్మ రెండు గంటల ఎండవేళ హాస్పిటల్ నుంచీ బయటపడి తడబడుతున్న నడకలతో ఆయాసపడిపోతూ బస్టాండులోకి వచ్చింది.

ఎండ తీవ్రత కంటే చంకలోని బిడ్డ జ్వర తీవ్రతవల్ల ఆమె అమితంగా అలసిపోయి వుంది.

ఆమె చేతిలోని వైరుబుట్టలో పిల్లవాడి పాలసీసా, వాడి కిందికి మార్చవలసిన గుడ్డ పేలికలు, యింటికి మరీ అత్యవసరంగా కావల్సిన సరుకులు, డాక్టరు ఫీజుకు, సరుకులకు పోగా మిగిలిన ఏడెనిమిది రూపాయలు ముడివేసిన చేతిగుడ్డా వున్నాయి. పిల్లవాడ్ని పొదివి పట్టుకున్న మరో చేతిలో డాక్టరు రాసిచ్చిన ప్రిస్క్రిప్షను కాగితం రెపరెపలాడుతోంది. ఆమె మనసులో తన వూరి బస్సు పోయిందేమోనన్న ఆతురత వుంది. తను వెళ్ళేదాకా అది పోకూడదనే కోరిక వుంది.

నిప్పులు ఉమిసేస్తున్నట్లుగా కాలిపోతున్న రోడ్డుపైన ముంగాళ్ల మీద పరుగెత్తుతున్నట్టుగా వచ్చి బస్టాండులో నిలబడిపోయింది సుభద్ర. బస్టాండంతా నిర్మానుష్యంగా వుంది. ఆమె ఎండలో నిలబడి కొంతసేపు దిక్కులు చూడసాగింది. బస్సులు రాకపోకల పట్టిక డబడబ కొట్టుకుంటూ వుంది. కంట్రోలరు స్వేదసిక్త శరీరంతో జోగుతున్నాడు. స్కూలు ముందు అయిస్క్రీం అమ్మే పిల్లవాడు వాడిపోయిన తోటకూరలా నిలబడి బలహీనంగా బూరా ఊదుతున్నాడు. ఎంతసేపు చూసినా తన వూరి వారెవరూ కన్పించకపోవడంతో బస్సు కానీ వెళ్ళిపోయిందేమోనన్న భయంతో ఆమె ఒక క్షణకాలం నిలువునా వొణికిపోయింది. ఈ బస్సు గనక తప్పిపోయిందంటే మళ్ళీ బస్సు ఆరుగంటలకు. అదీ ఖచ్చితంగా వస్తుందన్న నమ్మకం లేదు. ఇంటి దగ్గర మొగుడికీ, కూతురికీ తను వెళ్ళి వండిపెట్టే దాకా తిండిపెట్టే

దిక్కెవ్వరూ లేదు. నోట్లో నాలికలేని మొగుడు ఆకలయినా అన్నం పెట్టమని కూడా అడగడు. కూతురొక భూమి మీద పుట్టరాని బిడ్డ. ఏం జేస్తా వుండాదో ఏమో! ఈ పొద్దు యిలా అయిందేమి దేముడా అనుకుంది సుభద్ర. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు క్రమం తప్పాయి.

ఉదయం తనతోబాటూ బస్సు ఎక్కినవారందర్నీ ఆమె పేరుపేరునా గుర్తు తెచ్చుకోసాగింది. 'మల్లి సెండుగాడు ఎక్కినాడు. సుశీలమ్మ ఎక్కింది. సంపంగిగాడు ఎక్కినాడు. ఒకరూ కనబడాటం లేదే, బస్సింకా పోకనే వుంటుందా...' ప్రశ్నార్థకంలా నిలబడి పోయింది సుభద్ర. ఇంతలో పిల్లవాడు ఎక్కిళ్ళు పెట్టడంతో తేరుకుని 'అయ్యయ్యో', నేనొక మతిలేని ముండను. జరమొచ్చిన బిడ్డను ఎండలో పెట్టుకోని యిర్తం పర్తం లేకుండా యోచించుకుంటా వుండా' అనుకుంటూ ఆమె ఆదరబాదరగా టీ అంగడిలోకి నడిచింది.

టీ అంగడిలోని బండమీద కూర్చొని ఆమె పయిట చెంగుతో బిడ్డ ముఖం మీద తుడిచి, నోటితో గాలి వూదుతూ 'మా అప్పడు, మా బంగారు సామి', మా సందమామ – బిడ్డకు జరమొచ్చేసిందమ్మా. నిన్నటినుంచీ ఈ యరవదాక మూసిన కన్ను తెరవకుండా వుంది. మద్దాన్నం సూదిమందు పడేటప్పటికి లేచి కూచోని నవ్వుకుంటా వుండాడమ్మా...' అంటూ మురిపాలు కురిపించసాగింది.

బిడ్డకూ, తనకూ కొంచెం స్వస్థత కుదిరిన తర్వాత సుభద్ర మెల్ల మెల్లగా పరిసరాల్ని గమనించసాగింది. వ్యాపారం మందకొడిగా వున్న సమయంలో వచ్చిన ఒకే ఒక కస్టమరును ఎలా అయినా ఆకర్షించాలనే తపనతో అంగడివాడు గ్లాసులు, ప్లేట్లు శబ్దమొచ్చేలా కడిగి పెట్టసాగాడు. ఫిల్టరు దులిపి చక్కెర, కాఫీపొడి డబ్బాల మూతలు తీసి మళ్ళీ వెయ్యసాగాడు. ఏ క్షణానైనా సుభద్ర తనకోసమో, పిల్లవాడికోసమో కాఫీ గానీ, పాలుగానీ అడగవచ్చుననే స్పృహతో అతడు అప్రమత్తుడై వున్నాడు.

"ఒక గ్లాసు నీళ్ళియ్యన్నా, నోరెండుకోని పోతావుంది" నోరు విప్పింది సుభద్ర.

"అరగంట సేపు బోరింగు కొట్టినా ఒక గరిట నీళ్ళు రావటం లేదు. వచ్చినోళ్ళ కందరికీ సలివేంద్రం పెట్టుకుంటే నేను యాపారం చేసి కడతేరినట్టే" ఘాటుగా అని మెడను కరుగ్గా వెనిక్కి తిప్పుకున్నాడు అంగడివాడు.

"బిడ్డ తల్లికి నీళ్ళియ్యన్నా? పాపంలే" సుభద్ర వోపికగా మళ్ళీ మళ్ళీ అడగసాగింది. ఇంతలో అబ్బిగానిపల్లె వెంకటపతి రావడంతో "చూడప్పా, సిన్నబిడ్డకు ఒక గళాసు నీళ్ళిమ్మంటే యియ్యాపనంటా వుండాడు" అంటూ మేగుదాలు చేసింది.

ఎండలో పడి సోలిపోతూ వచ్చిన వెంకటపతికి టీ అంగడిలో సుభద్ర కన్పిస్తూనే కళ్ళు విప్పారాయి. మెడ నిటారుగా లేచి నిలబడింది. మొఖం తామరపువ్వులా వికసించింది. హోరాహోరీగా పోరాడినా సినిమా టికెట్టు దొరక్కపోవడం వల్ల మురుగన్ టాకీస్

నుంచీ నిరాశా నిస్పృహలతో తూలుకుంటూ వచ్చేసిన వెంకటపతికి సుభద్రను చూడటంతోనే అంత విసుగూ క్షణంలో మటుమాయమైంది. దాదాపు రెండు నెలల క్రితం రాళ్ళ గంగమ్మ పరసలో చూసిన మొదటి చూపులోనే అతడికి సుభద్ర మీద కలపరం పడిపోయింది.

రాకుమార్తెను మాంత్రికుడు ఎత్తుకొని పోతుండగా, గుర్రంమీద వేగంగా వస్తున్న రాకుమారుడు ఆమె ఆక్రందనలు విని మాంత్రికుడి మీదికి కలబడ్డట్టుగా వెంకటపతి టీ అంగడి వాడిమీదకు విరుచుకు పడిపోయాడు.

అతడు వెంటనే తన జేబులో నుంచీ ఒక పెద్ద నోటు తీసి టీ అంగడి వాడివైపు విసిరేశాడు. తరువాత పనులన్నీ క్షణాల్లో జరిగిపోయాయి. అంగడివాడు ఒకదాని వెనుక ఒకటిగా రెండు గ్లాసుల నీళ్ళు యిచ్చేశాడు. సుభద్ర కోసం డబుల్ పాలు ఇచ్చాడు. ఆమె ఆ పాలనంతా చంకబిడ్డ కోసం సీసాలో నింపుకుంది. మళ్లీ సుభద్ర కోసం సింగిల్ కాఫీ యిచ్చాడు. వెంకటపతికి డబుల్ స్ట్రాంగ్ టీ ఇచ్చాడు. అంతేగాక అంతకుముందు సుభద్రకు మంచినీళ్ళు యివ్వలేకపోయిన తన దురవస్థను, నీళ్ళకోసం దినమంతా తానుపడే పాట్లను, బస్టాండులోని రెండీమూక తన హోటల్లోని నీటిని దుర్వినియోగం చేసే వైనాన్ని వివరించాడు. చివరిగా పెద్దపర్తి గుంట బస్సు యింకా పోలేదనే సువార్తను కూడా శ్రవణ సుభగంగా ఆమె చెవిలో వేశాడు. అది వచ్చే సమయం ఆసన్నమైందని కూడా భరోసా యిచ్చాడు.

మురుగన్ టాకీసు నుంచీ రొప్పుకుంటూ రావడం వల్ల వెంకటపతికి వొళ్ళంతా చెమటలు కట్టి కారుతోంది. కానీ అతనికిప్పుడు అత్తరు అందినంత హాయిగా వుంది. టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటలో అతడి వొళ్ళు నజ్జు గుజ్జయిపోయింది. కానీ అతనికిప్పుడు కండరాలకు మాలిష్ చేసుకున్నంత హాయిగా వుంది. అతనికిప్పుడు కుప్పం బస్టాండు బృందావన్ గార్డెన్‌లా వుంది. టీ బాయిలెర్ నీళ్ళు విరచిమ్ముతున్న పొంటెన్‌లా వుంది. దాదాపు అరగంట క్రితం ప్రాణాలు పణంగా పెట్టి కొనాలనుకున్న సినిమా టికెట్టు దొరక్కపోవడమే అతనికిప్పుడు అరుదైన అదృష్టం లభించినట్టుగా వుంది. తన అభిమాన హీరో సినిమా చూడకపోతే ఏమయింది? నిజానికి తానే నిజ జీవితంలో దక్షిణ నాయకుడై పోయినట్టుగా అతనికి ఆనందంతో పులకింతలు కల్గుతున్నాయి.

అతడు సుభద్రతో పిల్లవాడి ఆరోగ్యం గురించి సాకల్యంగా వాకబు చేశాడు. పిల్లవాడికి వైద్యం చేసిన డాక్టరు అపర ధన్వంతరని పొగిడాడు. సుభద్ర చేతిలోని ప్రిస్క్రిప్షన్ కాగితాన్ని లాక్కుని జెండాలా వూపుకుంటా వెళ్ళి సంజీవినీ పర్వతం తెచ్చే హనుమంతుడిలా ఆఘమేఘాలమీద మందులు పట్టుకొచ్చేశాడు. సుభద్ర యిప్పుడు అడగాలేగానీ అతడు కొండమీద కోతినైనా తెచ్చి యివ్వడానికి సిద్ధంగా వున్నాడు.

పిల్లవాడికి జ్వరం తగ్గి కొంచెం ఉల్లాసం కలుగుతున్నట్టుగా వుంది. వాడి చిన్ని పెదవిపై ఒక చిరుహాసం మెరిసింది. సుభద్ర పిల్లవాడి కింద వేసిన గుడ్డల్ని సరిజేసి ముక్కుపుడక మెరుస్తుండగా మనోహరంగా నవ్వుతూ వెంకటపతి కేసి ఓరగా చూసింది.

వెంకటపతికిప్పుడు ఉక్కిరిబిక్కిరిగా వుంది.

"అప్పటంగా వీడు వీడప్పని పోలిక. పడుకుంటే సాలు గురకబెట్టి నిద్రబోతాడు" పండ్లు ఎర్రటి చిగుళ్ళతో సహా కన్పించేలా నవ్వుతూ అంది సుభద్ర.

సుభద్ర భర్త ప్రసక్తి తేవడంతో వెంకటపతికి చేదుమాత్ర మింగినట్టు అయింది. అరతవ్వ ఆముదం తాగినవాడిలా ముఖం పెట్టి – పడుకుంటూనే నిద్రపోయేవాడు, వాడూ ఒక మొగుడేనా అన్నట్టుగా "ఏం లాభం, బిడ్డకు జ్వరమొచ్చి పెండ్లాం పడరాని మల్లగుల్లాలు పడతావుంటే పట్టించుకోని మొగుడు ఉండేం లాభం..." నోరు చప్పరించేశాడు వెంకటపతి.

"ఎందుకు జెప్తావులే ఆ మాట! చెప్పుకోనిబోతే వొళ్ళు మంట. చెప్పుకోకపోతే కడుపు మంట! ఆ మడిసికి అన్నిటిమీదా అక్కరే, ఒక్క కట్టుకున్న దానిమీద తప్ప...." అంగడిలోకి ఎవరో రైతులు వస్తుండడంతో అర్ధాంతరంగా ఆపేసింది సుభద్ర.

సుభద్ర తన భర్త అనాదరాన్ని గురించి, తమ మధ్య వున్న పొరపొచ్చాల గురించి మరింతగా వాపోతే శ్రవణానందకరంగా వినాలనుకుంటున్న వెంకటపతికి దాంతో కొంత నిరుత్సాహం కలిగింది.

టీపాకలో బెంచీమాదిరిగా వుపయోగపడుతున్న బండ ఎండ వేడిమి వల్ల ఎంతగా కాలిపోతున్నప్పటికీ, నిలబడి నిలబడీ కాళ్ళు లాగుతున్నవారు విధిలేక దానిమీదే ఆసీనులవుతున్నారు. తనకంతగా సేవలు చేస్తూ అంతసేపట్నుంచీ తన ముందు నిలబడే వున్న వెంకటపతిని బండమీద కూర్చోమంటూ సుభద్ర అప్పటికే రెండుమూడుసార్లు చెప్పిచూసింది.

కానీ రాకరాక వచ్చిన ఈ మహదవకాశాన్ని సుభద్రకు దూరంగా కూచొని జారవిడుచుకోవడం వెంకటపతికిష్టం లేదు. పోనీ పక్కనే కూచొందామంటే బండమీద అంత ఖాళీ జాగా వుండగా అంత పక్కన ఎందుకు కూచొన్నాడని చూసేవాళ్ళెవరైనా అనుకోవచ్చు. లేదా అంత మాటా అనొచ్చు. కాదా సుభద్రే కొంచెం పక్కకు జరిగి కూచోవచ్చు. 'ఫరవాలేదు, ఫరవాలేదు' అంటూ అప్పట్నుంచీ ఆమెకు అత్యంత తక్కువ దూరంలో నిలుచునివున్న వెంకటపతిని అంతలో మరొక్క అదృష్టం కూడా వరించింది.

వచ్చిన రైతులంతా సుభద్ర పక్కన కొన్ని అంగుళాల జాగా మాత్రం వదిలి సుఖాసీనులైపోయారు. అతడు ఆశించిన సదవకాశం అతడికిప్పుడు సునాయాసంగా

లభించింది. అతనికి ఒక్కసారిగా కాళ్ళు లాగుతున్నట్టుగా తోచింది. ఆడవాళ్ళకు వీలయినంత దూరంలో కూచోవడమే తన నైజమైనట్టు యిప్పుడు విధిలేక మాత్రమే ఆ జాగాలో కూర్చున్నట్లు అతడు మనిషి ఏమాత్రం కూచోవడానికి వీల్లేని ఆ యిరుకులో ఒదిగిపోయాడు.

సుభద్ర సీటును పూర్తిగా వెంకటపతికే యిచ్చేందుకు లేవబోయి, అంతలో వెంకటపతి సుభద్ర కూచోని బండ నాకెందుకన్నట్టుగా లేవబోవడంతో విధిలేక మళ్ళీ కూచుంది. వెంకటపతి యిప్పుడు నిజ జీవిత సినిమాలోని క్లైమాక్సు సీనులో జీవిస్తున్నాడు. సుభద్ర వెంకటపతిని ఎంతగా అలరిస్తున్నా మధ్య మధ్యలో కన్పించిన ప్రతివాడినీ బస్సు గురించి వాకబు చేస్తోంది. ఇంటిని గురించిన బెంగను మైమరపించి సుభద్రను వినోదపర్చడానికి వెంకటపతి తన సకలోహ వైభవ విజ్ఞానాన్నంతా వెచ్చింపసాగాడు. అతడు సినిమాల్లో ఆడవాళ్ళు కట్టే కోకల పోకణాల గురించి చెప్పాడు. పేటలో స్టీలు సామాన్లు, సత్తు సామాన్లు అమ్మే అంగడి వాళ్ళతోనూ, జవుళి అంగడివాళ్ళతోనూ తనకు గల సాన్నిహిత్యాన్ని, వాటి బేరసారాల్లో తనకు గల నైపుణ్యాన్ని అతిశయంగా చెప్పాడు. మాటలకు అభినయాన్ని కూడా జోడించి అతడు ఆమె దృష్టినంతా తనవైపుకు తిప్పుకోవడానికి ముప్పుతిప్పలు పడసాగాడు.

సుభద్ర ఊ కొడుతూ వెంకటపతికేసి మురిపెంగా చూస్తోంది. అప్పుడప్పుడూ పగలబడి నవ్వుతూ పైకే ఒరిగిపోతోంది. చక్రాల్లా కళ్ళు తిప్పుతూ, ముక్కు విరుస్తూ, అంతలోనే పెదవులు బిగించి నవ్వును దాస్తోంది. ఒక అద్భుత సన్నివేశాన్ని తాను అత్యంత సమర్థవంతంగా రక్తికట్టిస్తున్నట్లు వెంకటపతికి యిప్పుడు తనపైన తనకే గొప్ప విశ్వాసం కల్గుతోంది. బస్సు రాకపోతే కొంపలేం మునిగిపోవనీ, రామవిలాస్‌లో రవ్వదోసె రుచి జూడకపోతే జన్మ వ్యర్థమనీ, ఊరంతా తనకు తెలిసినవాళ్ళ యిళ్ళేనని అతడు వూగిపోతూ చెప్పసాగాడు. సుభద్రకు ఊకొట్టే ఓపిక వున్నంతవరకూ ఆమెను ఊదరగొట్టి, ఆమె అది కూడా ఆపేయడంతో తదేకంగా ఆమె ముఖారవిందాన్ని చూడడంలోనే మునిగిపోసాగాడు వెంకటపతి.

రోడ్డుమీద జనసంచారం పెరుగుతోంది. సరుకులు నిండిన సంతబండ్లు రోడ్డుమీద పోతున్నాయి. అమ్మకానికొచ్చిన బక్కెద్దులు దారంతా మెడలు వూగించుకుంటూ నడుస్తున్నాయి. వెంకటపతికిప్పుడు పెద్దపర్తిగుంట బస్సు వచ్చేస్తుందేమోనన్న శంక భరింపరానిదిగా తయారైంది. వీలయితే అది ఒక కల్పాంతానికి కూడా రాకూడదనే కోరికగా వుంది.

3. ది కంగుంది టయిమ్స్

తిమ్మరాయప్పకు మెలకువ వచ్చేసరికి రోడ్డుమీద జనసంచారం పెరిగింది. సంత ప్రారంభానికి నాందిగా పరిసర గ్రామాల ప్రజలంతా బిగ్గరగా మాట్లాడుకుంటూ వెళు తున్నారు.

బస్టాండులో బస్సులేవీ నిలిచి లేవు. బస్సు యింకా రాలేదా? లేదా వచ్చి వెళ్ళిపోయిందా? కించపాటుతో పరిచయస్తుల కోసం కలియజూడసాగాడు తిమ్మరాయప్ప.

మరి కాస్సేపటికి తనకు బాగా పరిచయమున్న రెండు గొంతులు తనముందు నుంచీ నడిచిపోవడంతో ఊతకర్రతో సహా ఊగిపోతూ లేచి "రామా, గోవింద, నారాయణా, పరాత్పరా' అనుకొంటూ ఆవజీవాలను బిగపట్టుకుని భగవంతుని మీద భారం వేస్తున్నట్టుగా కదిలి వారి వెనక బడ్డాడు.

అత్తినీరాలు, సంపంగి గౌడు వొకర్నొకరు పట్టుకుని నడిపించే నెపంమీద ఒకరిమీద ఒకరు తూలిపోతూ ఒకరికొకరు జాగ్రత్తలు చెప్పుకునే నెపం మీద వారికి వారే పరాకు పలుక్కుంటూ జమిందారుగారి సిల్వర్ జూబ్లీ పార్కులోకి నడుస్తున్నారు.

పార్కులో చెట్లన్నీ ఆకులు రాల్చేస్తున్నాయి. పార్కు గోడ పక్కనే నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం సెల్యూట్ చేస్తోంది. చెట్ల మొదళ్ళకు కుదించుకుపోయిన నీడలలో కొంతమంది బాటసార్లు సేదతీరి వున్నారు. చెట్టునీడ అనతి దూరంలో వుండగానే 'ఇక్కడ నీడగా వుంది' అంటూ సంపంగి గౌడు ఎండలో కాలిపోతున్న సిమెంటు బెంచీమీద కూలబడ్డాడు. సంపంగి గౌడంతటివాడే అక్కడ కూచున్నాక యింకా ఆ స్థల విశిష్టతను శంకించడంలో అర్థం లేదని తోచడంతో అత్తినీరాలు కూడా అతడికి చేరువలోనే చతికిలబడ్డాడు. ఆరిపోగా అలవాటుగా చెవిపైన పెట్టుకునే బీడీముక్కను తీసి అతడు నోట్లో కుక్కుకున్నాడు. పూటుగా తాగిన కల్లు వారి తల కెక్కుతూ వుంది.

తిమ్మరాయప్ప ఊతకర్రను నేలపైన బలంగా కొట్టి రొప్పుకుంటూ నేలమీద కూలబడ్డాడు. అష్టకష్టాలకోర్చి తన్ను చేరుకున్న భక్తున్ని కావడానికి కళ్ళు విప్పిన భగవంతుడిలా తన పాదాల దగ్గర ప్రత్యక్షమయిన తిమ్మరాయప్పను జూస్తూ "ఏం తిమ్మప్పో, కొప్పం వచ్చేసినావు" కించిత్ ఎగతాళిగా అన్నాడు అత్తినీరాలు.

"వచ్చేస్తి! గాచ్చారం తప్పతాదా" అంటూ తన గోడును చెప్పుకోడానికి ఉపక్రమించాడు తిమ్మరాయప్ప.

"ఏవిరాc అత్తినీరాలూ! నాకెన్నేండ్లొచ్చుంటాయి. నీకేం తెలుసు, మొన్నమొన్నటోడివి! మీయబ్బ విజలాపురానికి పోయి మీయమ్మను పెండ్లాడి వచ్చేనాటికి నేను మల్లప్ప కొండకు మేకలు దోలుకొని పోతావుంటి. నేను సూస్తావుండగానే బంగారమట్లా వాళ్ళంతా దాటుకుండ్రి. అట్టా ధర్మకాలమంతా పోయి కలిగ్గం అంతాని కొచ్చేసుండాది.

మీ యబ్బ పెండ్లికంతా తొంభై ఏడు రూపాయల కర్చు. మీయమ్మకు ఓలియిచ్చింది నలభై మూడు రూపాయలు, రెండు మణుగుల వక్కలు పదిరూపాయలు, యిన్నూరు కట్ట ఆకులు రెండు రూపాయలు, పుట్టిడొడ్లు అయిదు రూపాయలు, పందుం ఒక రూపాయి. యిప్పుడు తవ్వ ఒక రూపాయి లెక్కన అమ్మతా వుండాదె. దానాలీశ దేనికన్నా మితం ఉండద్దా! పందుంకు నలభై బళ్ళలు, బళ్ళకు రెండు శేర్లు, శేరుకు రెండు పడులు, పడికి రెండు తవ్వలు – తవ్వ నూకలు రూపాయిలెక్కన అమ్మతా వుండాదె – దానాలీశన దేవుడన్నా ఓర్సద్దా?

–వానలు! వానలా అవి? తలుసుకుంటే మాపటేళకు మొబ్బెక్కి రాత్రి తెల్లవార్లూ జళ్ళు పట్టుకోని ఊరు యీదులన్నీ రొచ్చు రొచ్చు అయిపోయి యాడున్న సెరువులూ తటంగిలుగా నిండిపోతావుండె. అట్టాటిది సినుకు నేలరాలేది అదిశెంగా వుండాదె! ఏం పోయేగాల మొచ్చిందిరా నాయనా!

–తెల్లారికుందికి కూలోల్లొచ్చి యిండ్ల ముందర కూసుంటా వుండిరి. అట్టాడిది గాంగీపనికి పొయ్యేవాళ్ళు, మైనింగుపనికి పొయ్యేవాళ్ళు – కూలోడు సెయ్యి దొరకటం లేదే! ఉండే జమీన్లన్నీ బీళ్ళు పండుకోనుండాయి. కడకు వడ్డోని చెరువుకింద వుండే కొనమడి కొంచెం కండ్లు తెరుసుకోనుండాది. దాన్నైనా కాపాడుకుందామని బెమపడి బాయిపని మొదులు బెడ్తినిరా నీరాలూ – అది మొదులు బెట్టిన్నాటినుంచీ నా అగసాట్లు నాకు దెలుసు. ఆ మండేవాడికి దెలుసు. నారాయణ గౌని కాళ్ళు పట్టుకోని తెచ్చిన దుడ్డుతో మొదటి మట్టుగొడ్తి. రెండు తెగేదానికి గొర్రె పిల్లల్ని కావసముద్రంలో అమ్మేస్తి – అదీ అయినకాడికి మద్దాన్నంగా జత నూట ఏభై లెక్కన. పట్ల బలవంతాన మూడో మట్టు తెగుండాది. నల్లరాయి పడుండాది. రాయి తెగితే అంతా జవుకే అంటాడు శాస్త్రిగాడు.

నాట్లు బెట్టాల. సేతిలో రూక ఆడటంలే. అద్దిగలు, అడ్డసైన్లు, నాగరలు, వొంకీలు అన్నీ పొయ్యి మనవరాలి మెడలో ఒకే వొకటి ఎంటిక పెవాణంలో మిగిలుండాది. దాన్ని కుప్పం బాంకీలో పెడ్తే దుడ్డిస్తారని జెప్పిరి.

ఏవని జెప్పేదిరా నీరాలూ, దాని కోసరమని నాలుగు దినాలుగా కాలికి బలపం కట్టుకోని తిరగతా వుండా. మొదటిదినం పిల్లోళ్లు యిస్కూళ్ళకు పోకముందే బోయి బాంక్ ముందర కూసొంటి. మద్దానానికీ ఒక మారాజు పలకరించి నా బూవుల లెక్కలు దెమ్మనె. ఏనాటి పట్టాలు? జమీందారు కాలం నాటివి. కంగుంది దొర్తానం నాటివి. అటకలోబడి సెదులు తింటా వున్నివి. అవి తెచ్చి చూపిస్తి. పాత దొర్తానం పోయి కొత్త దొర్తానం వచ్చేసుండాది – తాసిల్దారు కాడికి పోయి కొత్త లెక్కలు తెమ్మనిరి. నాలుగు దినాలనుంచి వ్రతంగా ఆడికిపోతా పోతా వుండా. నా బూవిఁ నా బంగారం – దానిమీద అప్పుకోసరం సిన్నోడు – సితకోడూ అందరి కాళ్ళూ పట్టుకుంటి. ఛీసీ – నా బతుకుమీద నాకే రోత బుట్టిపోయుండాది. నాయట్టావాళ్ళు బతక్కూడదురా నీరాలూ, ఏ దేవుడికీ పుణ్ణిం చెప్పు, ఏ మడిసికి సుఖం జెప్పు. కాకిమాదిరి యిన్నారేండ్లు బతికి యింకా ఏవి బావుకోవాలో జెప్పు నేను–

ఇంకా సూడు! పక్కనుండే ఎత్తు దిన్నెమీద దొరవారు ఎట్ట నిల్సుకోనుండారో! వారిది బదుకు. బదికినంత కాలం బంగళాలో ధుర్యోదన మహారాజు మాదిరి రాజ్యం ఏలిరి. మోకాళ్లదాకా ఆ కోటు సూడు. తలమీద ఎండి పాగా సూడు. కాళ్ళకు కిర్రుసెప్పులు జూడు. మెళ్ళో మంచి ముత్యాలహారం జూడు. సేతిలో పట్టా కత్తి సూడు. కంగుంది నుంచి సవారి బండిలో బయల్దేరినారంటే దారంతా అడల్. అడుగడుక్కీ దండాలు, ఏళేళకు బోజినాలు, పలారాలు, ఊరూరికీ లంజలు, బదికితే అట్ట బతకాల. సచ్చినా పేరూ కీర్తిగా సావాల. నామాదిరి నిర్భోగి కాకిమాదిరి సిరంజీవిగా బదికి ఎవురికి ఉద్దారకం...” ఆకలి, ఆవేశం, ఉక్రోషం, నీరసం, ఏవగింపు మిళితమై గొంతు జీరవోయి వగర్చసాగాడు తిమ్మరాయప్ప.

“ఊ ఎవురి బాగ్గానికెవురు కర్తలు, ఎవురి దరిద్దరానికి ఎవురు కర్తలు. మనం అడిగొచ్చిందొకటి, కావాలనుకొనేది ఒకటి. దర్మరాజట్లా వానికి తప్పలా, గోచిపాత దాసర్లం మనమెంత” పుల్లగా తేన్చుతూ కండ్లు తేలవేసి డ్రాయరు జేబులో చెయ్యిబెట్టి అగ్గిపెట్టె వెదుక్కోసాగాడు అత్తినీరాలు.

అత్తినీరాలుకు అనతిదూరంలో ఒక కొత్త వ్యక్తి కూర్చుని వున్నాడు. అతడి జుట్టు బాగా పెరిగి పాయలు పాయలుగా వెనిక్కి దువ్వబడివుంది. ఎర్రటి అతడి చెంపలపై వెంట్రుకలు నారుమడిలా కన్పిస్తున్నాయి. అతడు పొడుగాటి పసుపురంగు జుబ్బాను,

తెల్లటి పయిజమాను తొడుక్కునివున్నాడు. బహుశా సుదూర ప్రయాణం చేసి రావడం వల్ల కావచ్చు, ఆ బట్టలన్నీ బాగా నలిగి, మాసిపోయి వున్నాయి. అతడి భుజాల నుంచీ రంగురంగుల దారాలతో అల్లిన సంచీ ఒకటి బరువుగా వ్రేలాడుతోంది. అతడిచుట్టూ ఆరిన సిగరెట్టు పీకలు, కాలిన అగ్గిపుల్లలు పడి వున్నాయి.

అత్తినీరాలు అపరిచిత వ్యక్తి పారవేయబోతున్న సిగరెట్టు పీకను ఆప్యాయంగా తీసుకుని బీడీ ముట్టించుకున్నాడు. దవడలు సొట్టపడేట్టుగా, పొగపీల్చి నాలుక మడిచి లొట్టవేసి నట్టుగా చప్పరించి, ఇంద్రజాలం చేసినంత గర్వంగా పొగ వదిలాడు.

సిగరెట్టుపీక యిచ్చినందుకు థ్యాంక్స్ చెబుతున్నట్టుగా అగంతుకుని కేసి అలవోకగా జూస్తూ "ఏ వూరండీ సార్ మనది? మిమ్మల్ని ఈ యిలాఖాలో ఏడా జూసినట్టు లేదు" అడిగాడు అత్తినీరాలు.

ఆగంతకుని పేరు రమణమూర్తి. అతడు సుషుప్తిలో నుంచి తొట్రుపడినట్టుగా మేల్కొని మీట నొక్కగానే వెలిగే దీపంలా నోరు తెరిచేశాడు "నేనాండీ! నేను బెజవాడనుంచీ వస్తున్నానండీ, తిరుపతి దాకా తిరుమలాలో వచ్చానండీ. అక్కడ్నుంచీ చిత్తూరుకు నాన్‌స్టాప్‌లో వచ్చానండి. అట్నుంచీ సేలం బస్సెక్కి అదిగో ఆ రామ విలాస్ హోటల్ ముందు దిగానండీ! అంతేనండి! అప్పట్నుంచీ బస్టాండంతా సర్వే చేసేశానండీ! అక్కడ్నుంచీ కన్పించిన ప్రతి శాల్తీని వాకబు చేసేశానండీ! నోటీసు బోర్డులో ఏదో టైం రాసుందిగానీ దాన్నెవరూ పట్టించుకోటం లేదండి. పెద్దపర్తి గుంట బస్సు ఏటయ్యిందో, అసలు వస్తుందో రాదో తెలీటం లేదండి."

ఆగంతకుని వాక్ప్రవాహంలో అత్తినీరాలు తల దిమ్మ తిరిగిపోయింది. ఒక క్షణంపాటు అతడు తన భాషే మాట్లాడుతున్నాడా అనే సంశయం కూడా కల్గింది. అలసటతో మూతబడుతున్న కళ్ళను బలవంతంగా తెరిచి పెద్దపర్తి గుంట బస్సు విషయమై జరగబోతున్న చర్చను వినడానికుద్యుక్తుడయ్యాడు తిమ్మరాయప్ప.

"ఆ యిసయం చెప్పేదానికి లేదే! ఒక దినం పదిగంటలకే కుప్పం ఎల బారేస్తాది. ఒక్కో దినం మద్దాన్నం రెండు గంటలకు కూడా పలమనేరులో బయల్దేరదు. ఒక్కోదినం సిత్తూర్లోనే కాలు పైకెత్తేస్తాది. సినుకు నేల బడిందంటే కుప్పమొచ్చినా సంగనపల్లి చేర్తాదనే నమ్మకంలే" – బ్రహ్మ పదార్థ స్వరూప స్వభావాలను వివరిస్తున్నట్టుగా మత్తుమత్తుగా చెప్పాడు అత్తినీరాలు. అతడికి ఆవులింతలు ప్రారంభమై కళ్ళు మూతలు బడుతున్నాయి.

నిద్రావస్థలోకి జారిపోతుండడం వల్ల అతడి బీడీ మళ్ళీ ఆరిపోయి నోరుజారి పడబోయింది. అంతపనీ జరక్కముందే తేరుకుని మళ్ళీ అగ్గి పెట్టె తీసుకునేందుకై "ఐతే ఏడ పోవాల్నో మీరు" అంటూ అడిగాడు అత్తినీరాలు.

"చిగుర్లగుంట కెళ్ళాలండీ! అక్కడ మైనింగ్ ఆఫీసర్ని కలుసుకోవాలండి" మీట నొక్కడమే తరువాయిగా జవాబు దూసుకువచ్చేసింది.

అత్తినీరాలు స్ప్రింగు యిచ్చినట్టు చివాలున పైకి లేచాడు. అంటించుకున్న బీడీని ఆర్పేసి, చెప్పులు తీసి నిలబడి చేతులు కట్టుకున్నాడు.

"అట్ట జెప్పండి. మీరు మైనింగ్‌లో పనిచేసే ఆఫీసర్లని యిప్పుడు గదా తెలిసింది. ఏవనుకోవద్దండి. యింతవరకు నాకా సంగతి తెలవలేదు. తెలీకుండా మీకాడే అగ్గి తీసుకుని బీడీ ముట్టిస్తి. చమించుకోవాల....

"సార్, నేనెంతోమంది ఆఫీసర్లకాడికి పోయి అడుక్కుంటా వుండా. మా పిలగాడొకడుండాడు. వాడూ నాలుగో కళాసు దాకా సదుంకోనుండాడు. యిట్ట కోలారు నుంచీ అట్ట సేలం దాకా ఏడ పడినోళ్ళంతా వచ్చి మైనింగులో పన్జేస్తావుండారు. మావానికొక కొలువు సూపించండి దేవరా, మీ పేరు జెప్పుకుంటాం" అత్తినీరాలు పై గుడ్డతో చేతులు నలుపుకోసాగాడు.

"అబ్బెబ్బే! నేనేమీ అక్కడ పర్మనెంటుగా ఉజ్జోగం జెయ్యడానికి పోవడం లేదండి! నేను ప్రెస్ రిపోర్టర్నండి. ఈ బంగారు గనులమీద మా పేపర్‌లో ఆర్టికల్ రాయడానికి వెళుతున్నానండీ! అంతే బాబూ, అంతే..." రమణమూర్తి లేచి నిలబడి అత్తినీరాలును తప్పించుకోవడం కోసం ఎదురుగా వున్న జమిందారుగారి విగ్రహం చుట్టూ తిరగసాగాడు.

కుప్పం చలువరాళ్ళతో తాపడం చేసిన ఎత్తయిన వేదికమీద కంగుంది జమిందారుగారి విగ్రహం ఠీవిగా నిలబడి వుంది. పీఠంపైన అమర్చిన పలకంపైన 'శ్రీ రాజా కంబినాయని జవ్వాజి వెంకటపతి నాయనివారు, కంగుంది సంస్థానాధిపతులు' అనీ, దానిక్రింద జనన, సంస్థానాధిపత్య, పరిపాలనా కాల రజత జయంత్యుత్సవ తేదీలూ రాసివున్నాయి. మరోపక్క సదరు విగ్రహం సంస్థాప ప్రజాబృంద విరాళముల వలన ప్రతిష్టాపనమనీ, ఆయా గ్రామాల, దాతల, మొత్తాల వివరాలు రాసి వున్నాయి. యిదే సమాచారం మిగిలిన రెండు వైపులా తమిళంలోనూ, ఆంగ్లంలోనూ రాసివుంది.

విగ్రహం పీఠం చెంత తిమ్మరాయప్ప కూర్చొని వున్నాడు. అతడి కడుపు మడతబడి డొక్క వీపుకు అంటుకబోయివుంది. అతడు తనకోసం యింటిదగ్గర ఎదురుజూస్తున్న మనవరాల్ని గురించి ఆలోచించడం లేదు. తన యింటి చూరునుంచీ వేలాడుతున్న ఉట్టిలో తనకోసం తొంగి చూస్తున్న సంగటి ముద్దని గురించి కూడా అతడు ఆలోచించడం లేదు. అతడు ఆలోచనా శూన్యుడై శిథిలమైపోతున్న జమిందారీ పట్టాల్నీ, తన కష్టార్జితం, తన రక్తం ఆయిన సంపాదనలో అధికార్ల టీలకూ, సిగరెట్లకూ పోగా మిగిలిన చిల్లరకాసుల్ని కెలుక్కోసాగాడు.

4. గుణసంగ్రామ పరిషత్

రోడ్డుమీద జనసంచారం పెరుగుతోంది. ముందొకడు పలక కొడుతూ వెళుతుండగా సినిమాబండి పోతోంది. కృష్ణగిరివైపుగా నాలుగయిదు లారీలు భారంగా సరుకులు మోసుకుని వెళ్తున్నాయి.

అప్పోజీ చిత్తూరుకు వెళ్లే ఆర్ ఎమ్మెస్ బస్సు కోసం ఎదురుజూస్తున్నాడు. 'సింహమున్న గుహలోకి సింధురము జొచ్చినట్టు', వీధి నాటకంలోకి కీచకుడు వచ్చినట్టుగా ఆర్‌ఎమ్మెస్ బస్సు కుప్పం రాజవీధి గుండా వస్తోంది. దాని ముఖమంతా పసుపు కుంకుమ బొట్లున్నాయి. బస్సు నుంచీ అగరొత్తుల వాసన వేస్తోంది. ముందువైపున కట్టిన మామిడి తోరణాలతో, వేలాడదీసిన పూలమాలలతో బస్సు కదులుతున్న పెండ్లి మంటపంలా వుంది. బార్డరు దాటుతూనే అరవపాటలు ఆపి తెలుగుపాటలు విన్పిస్తోంది బస్సులోని టేప్ రికార్డర్. బస్సు శుభ్రంగా, కాంతివంతంగా మెరుస్తోంది. సేలం – చిత్తూరు రూట్ మీద ఆరెమ్మెస్ బస్సుకున్న గౌరవం అద్వితీయమైది. అది ఆ రూట్‌కు రాణి వంటిది.

బస్సు పార్కుముందు నిలుస్తూనే దాని చుట్టూ ప్రదక్షిణాలు చెయ్యడం ప్రారంభించాడు అప్పోజీ. అతడలా తిరుగుతూనే మెడమీద, కాలరు క్రిందవున్న కర్చీఫ్‌ను తీసి ముఖం మీద బలంగా రుద్దుకున్నాడు. జేబులోని దువ్వెన తీసి నెత్తిమీద గాట్లు పడేట్లు దువ్వుకున్నాడు. అతడి ముఖం వార్నీషు వేసిన నల్లతుమ్మ చెక్కలా మెరుస్తోంది. అతడు ప్రతి తెల్లవారీ లేస్తూనే మెలితిప్పుకునే మీసం మెలిక సరిగా వున్నదీ లేనిదీ చూసుకున్నాడు.

అప్పోజీ అలా తిరుగుతూనే కిటికీలగుండా కన్పిస్తున్న ప్రతి చీర వంక ఆబగా చూడసాగాడు. భాగ్యమ్మ చీరలన్నీ అతడికి బాగా ఎరుకే. వాటి మెత్తదనం గురించీ, పొడవు, వెడల్పుల గురించీ, రంగుల గురించీ అతడికి క్షుణ్ణంగా తెలుసు. ఎంతసేపు చూసినా భాగ్యమ్మ కన్పించకపోవడంతో, ఆమె అసలు రాలేదేమోననే సందేహం కూడా

వచ్చింది అతడికి. అంతలోనే అప్పోజీ తన తెలివి తక్కువ తనానికి తనే కించపడ్డాడు. ఎందుకంటే భాగ్యమ్మ వెళ్ళింది సద్యా ఆడబిడ్డ కూతురి పెండ్లికి. కొత్తకోక ఎత్తీకుండా ఆడబిడ్డను పంపిస్తారా? అప్పోజీ ఈసారి కొత్త కోకల కోసం గాలించసాగాడు.

పాతవాళ్ళు కొంతమంది దిగి, కొత్తవాళ్ళు కొంతమంది ఎక్కి ఆరెమ్మెస్ బస్సు, కొత్త అసెంబ్లీలా గందరగోళంగా తయారైంది. 'దుప్పటల్లె కప్పుకుందామా, వయసు ఎప్పటల్లె వుండిపోదామా' టేప్ రికార్డర్ దుమ్ము లేపుతోంది. నలిగిన మల్లెపూల వాసన పెట్రోలు వాసనతో కలిపి వెగటు పుట్టిస్తోంది. భాగ్యమ్మ దర్శనం దొరకక అప్పోజీ విరహ విహ్వలుడయ్యాడు. రామేశ్వరానికి పోతే శనేశ్వరమెదురైనట్టు భాగ్యమ్మ కోసం వెదుకుతూ వెదుకుతూ రామవిలాస్ నుంచి వస్తున్న లీడరు దృష్టిలో పడిపోయాడు అప్పోజీ.

లీడర్ చొక్కాకు కేవలం ఒక గుండీని మాత్రం పెట్టుకుని వున్నాడు. కట్టుకున్న అడ్డపంచ చివరను పైకిలాగి చంకలో యిరికించుకుని వున్నాడు. పంచ పైకి ఎత్తబడటం వల్ల కింద వేసుకున్న ఎర్రటి డ్రాయరు, వెంట్రుకలు పెరిగిన అతడి తొడ, మోకాలు బాహాటంగా కన్పిస్తున్నాయి. రకరకాల కాగితాలతో, బిల్లులతో నిండి అతడి చొక్కాజేబు గుడ్ల తేలులా వేలాడుతోంది.

లీడరు వెనుకనే తిప్పయ్య గౌడు వస్తున్నాడు. అతడి మనసంతా ఉక్రోషంతో నిండిపోయి వుంది. వారిద్దరు రెండ్రోజుల క్రితం చిత్తూరుకు వెళ్ళి వచ్చి యింకా గంట కూడా గడవలేదు. ఈ రెండు రోజులుగా తిప్పయ్యగౌడ్ జేబుకు గండి పడిపోయింది. లీడరు తనను నడుస్తున్న మనీపర్సుగా భావించి అమిత ఉదారంగా వాడుకున్నాడు. మళ్ళీ కుప్పంలో బస్సు దిగేటప్పటికి తిప్పయ్యగౌడు తన నిగ్రహాన్ని పూర్తిగా కోల్పోయాడు. అతడు మెడను వీలయినంత పక్కకు తిప్పుకుని లీడరుకు పెడముఖంగా నడుస్తున్నాడు.

"వీడు కన్పించినాడా – అట్ట కట్టుకున్నదీ వదిలేసినోడు, యిట్ట పెట్టుకున్నదీ తన్ని తరిమేసినోడు, వీడు కన్పించినాడా! ఏవప్పా వీడెవడో తెలుసునా, వీడేనప్పా అప్పోజీ!" తిప్పయ్య గౌడుతో చెబుతున్నట్టుగా అప్పోజీ మీదకు లంఘించాడు లీడరు.

అప్పోజీ ముఖం చింతాకంతయింది.

"దానికెందుకప్పా సిగ్గు. జాతైనమొగోనికి బంగారట్లా పెండ్లాం, కోతట్లా లంజ వుండాల" తిప్పయ్యగౌడు అప్పోజీని సముదాయించ జూశాడు.

"ఏమీ లేదప్పా! మా కేంపు మేనేజరేమన్నా వస్తాడేమోనని సూస్తా వుండా" – అపద్ధర్మంగా బొంకాడు అప్పోజీ.

లీడరు శిష్యులిద్దర్నీ వెంట బెట్టుకుని బస్టాండుకొచ్చాడు. శంకరాచార్యుల వెంట శిష్యగణం పెరుగుతున్నట్టు అతడి వెనుక చిన్న గుంపు తయారౌతోంది.

లీడరు ప్రభావానికి గురైన వారిలో ముఖ్యుడు సీమేగౌడు. అతడు అరవై యేళ్ళ ముదుసలి. అతడి గుండు ఎర్రగా పండిన పరిందిపండులా వుంది. నుదుటిపైన తెల్లటి నామమూ, మధ్యలో తిరుచూర్ణపు గీతా వున్నాయి. చేతిలో ఒక ట్రంకుపెట్టె వుంది. చంకలో న్యూస్‌పేపర్‌లో ప్యాక్ చేసిన వెంకటేశ్వరస్వామి పటం వుంది. అతడు తిరుమలకు వెళ్ళి వస్తున్నాడు.

తిప్పయ్యగౌడు మర్యాదకోసం సీమేగౌడు చేతిలో నుంచీ బ్యాగు తీసుకుంటూ "ఏం మామా, ఏం యిసేషం? తిరుమల కొండకు పొయ్యొస్తా వుండేట్టుగా వుండావే! దర్శనం బాగ అయ్యిందా!" అన్నాడు.

ఆ ప్రశ్నకోసం ఎంతసేపటినుంచో ఎదురుచూస్తుండడం వల్ల ప్రశ్న పూర్తిగాకముందే సమాధానం ప్రారంభించేశాడు సీమేగౌడు. అతడు పటాన్ని, ట్రంకును కిందకుబెట్టి, రెండు చేతుల్నీ ఆకాశంలోకి ఎత్తి ఊగిపోతూ "యిసేషమంటే చిన్న యిసేషమా? ఆహాహా - కలియుగ పరంధాముడు. ఆ వెంకటేశ పెరుమాళ్ళ కొలువు మహావైభవంగా జరిగి పోతావుండాదే - ఆహాహా దినమ్మూ ఒక జాతర మాదిరి ఉండాది. దినమ్మూ ఒక తిరణాలమాదిర వుండాది. దినమ్మూ ఒక పరషమాదిర వుండాది. ఎన్ని యిండ్లు, ఎంత జనం, ఎంత ధనం - బస్సుల్లో ఎక్కే జనం, దిగే జనం, ఓటల్లలో జనం, కళ్యాణకట్టలో జనం, రోడ్లమీద జనం, సత్రాల్లో జనం - యోజనాల పొడుగ్గా కంటిమీద కునుకెయ్యకుండా సాగతావుంటే కూడా సమసడం లేదే! ప్రపంచంలో వుండే జనమంతా ఆ మూర్తిని చూసేదానికి వస్తానే వుండారు. ఆహాహా - ఆ తలమీద వైడూర్యాల కిరీటం, ఎగవసేతుల్లో శంకుచక్రాలు, దిగువసేతుల్లో తామరకవలం, గదాయుధం - సూసినోడంతా తరించిపోతా వుండాడే... ఆహాహా" అంటూ భక్తపారవశ్యంలో వణికిపోసాగాడు.

సీమేగౌడు అన్ని అప్రధాన విషయాలకూ ప్రాధాన్యత యిచ్చి అతి ముఖ్యమయినదాన్నే మర్చిపోతున్నట్టు గ్రహించి లీడరు తొందరగానే తేరుకున్నాడు. "అద్సరే. శంకుమిట్ట పక్కసోలుపులో మన ఎంపీ బావమరిది కట్టుండే పచ్చరంగు కాటేజీ చూసినావా?" - అసలు విషయంలోకి సీమేగౌడును లాక్కురావడానికి ప్రయత్నించాడు లీడరు.

"ఎన్నని జూడమంటావు. దినదినానికీ ప్రవర్ధమానంగా పెరిగిపోతా వుండాదే. దేన్నని జూడమంటావు? శంకుమిట్ట సూసేదా, పాపనాశం సూసేదా... అహాహా" సీమేగౌడు తన్మయత్వంలో కొత్త రికార్డు సృష్టించదలచుకున్నట్టున్నాడు.

లీడరు తిప్పయ్యగౌడును సీమేగౌడు ముందర్నుంచీ తనవైపుకు తిప్పుకుని "అన్న... మన అన్న చిక్టీటూ (62)లోనే శంకుమిట్టలో కాటేజీ కట్టించేసుండాడు. అది యించుమించు

అప్పుడే అర (లక్ష) పైన అయింది. అన్న ఎప్పుడు పోయినా దాంట్లో వుండేవాడు. ఎవుడైనా – వాడు కలెక్టరుగానీ, మినిష్టరుగానీ పది నిమిసాల్లో దర్శనం. క్యూలో ఎవుడేగానీ అన్నమీద చెయ్యి వేసి బదుకునా? దేవుడి ముందర నిలబడినామంటే సూసీ సూసీ మాకు మోకాళ్ళే నెప్పులు పుట్టిపోవును. తిరిగొచ్చేటప్పుడు గంపలకు లడ్లు, వడలు, కలకండ పెచ్చులు, పూలు – కుంకుమ" అంటూ వూగీ వూగీ చెప్పసాగాడు.

ఇదే అదనుగా భావించి గుడుపల్లె సుందరేశ వడియార్ తన కుల వృత్తి అయిన కుమ్మరి కళావిశిష్టతను నిరూపించడానికి సీమేగౌడు తలను ఘటంగా చేసుకుని వాయించ మొదలుపెట్టాడు.

"బూవులుగా, యిండ్లుగా అంత ధనం వుండాదిగదా! వొళ్ళంతా గోరంత తావువొదల కుండా బంగారం దిగేసుకోనుండాడు గదా! ఏవి, ఆయన తినాలంటే ఒక ఎండికంచంలోనే తినొచ్చు గదా! ఒక బంగారు కంచంలోనే తినొచ్చుగదా! ఎందువల్ల ఆయన మట్టికుండలో తింటావుండాడంటావు? మట్టికుండ అంటే అంత శ్రేష్టమని శాస్తరాల్లోనే రాసుండాదంట. యిప్పుడొక పదేండ్లుగా గదన్నా సిలవరుబోకులనీ, యిస్టీలు బోకులనీ జనాలు ఎగబడతా వుండేది! యివి వచ్చినాకనే గదన్నా దేశంమీద లేని రోగాలు పుట్టుకోనస్తా వుండేది? కుండల్లో వండుకోని, కుండల్లో నీళ్ళు దాగి, మూకుళ్లలో అన్నం దింటావున్నన్ని దినాలు మనుసులు రాళ్ళుదిని రాళ్ళు అరిగించుకుంటావుండ్రి... అసలు కుమ్మరోడు లేకపోతే యిప్పటికన్నా ఎవురింట్లోనయినా, అది పెండ్లేగానీ, సావేగానీ ఏం కార్యం జరగతాదో జెప్పు...." సుందరేశవడియార్ ఉద్రేకంగా చెప్పుకుబోతున్నాడు.

అన్న కాటేజీ ఉద్ధతి పట్ల, సీమేగౌడు దైవదర్శన పద్ధతి పట్ల సుందరేశ వడియార్ ఘటవాయిద్యం పట్లా తిప్పయ్యగౌడుకేం పెద్ద ఆసక్తి లేదు. అతడు విషయ మీమాంస మానేసి తనకే సంగతయినా ఒకటే నన్నట్టుగా యాంత్రికంగా తల వూపుతున్నాడు. అతడికి వీలయినంత త్వరగా యింటికి చేరుకోవాలనుంది.

యింతలో అప్పోజీకి కూడా తాను కోరుకున్న కోనలో వాన కురిసినట్టయింది. సీతమ్మ జాడ చెప్పగల జటాయువులా అతడికి భాగ్యమ్మ జాడ చెప్పగల మల్లిసెండుగాడు కంట్రోలరు రూము ముందర తారాడుతూ కన్పించాడు. అప్పోజీ మెల్లగా వెనక్కు తగ్గి జనం జలధిలో పార్కు దగ్గర మునిగి, మళ్లీ కంట్రోలు రూముదగ్గర తేలాడు. సీమేగౌడు ఆధ్యాత్మిక వయలెన్‌తోనూ, లీడరు రాజకీయ మృదంగంతోనూ, సుందరేశ వడియార్ ఘటంతోనూ తిప్పయ్యగౌడు శ్రోతగా కచేరీ సాగుతూనే వుంది.

5. లీడరోద్యోగ పర్వము

సంత పూర్తికావస్తోంది. ఊళ్ళకు తిరుగుముఖం పట్టిన గ్రామీణులతో బస్టాండు రద్దీగా వుంది. టీ అంగళ్ళలోని బండలమీద, పార్కులోని సిమెంటు బెంచీలమీద మొదలుపెట్టి ఆసనమనిపించే ప్రతిదానిమీదా మనుషులు కూర్చొని వున్నారు. ఆడవాళ్ళు కొందరు కంట్రోలరు రూము ముందర నేలమీదే తిష్టవేసి వున్నారు. వాళ్ళు తరచూ చుట్టుపక్కల వక్కాకు ఎంగిళ్ళు ఉమ్మేసుకుంటూ, వాటిమీద మన్ను తోసేసుకుంటూ వున్నారు.

బీడీలు తాగడమనేది మగతనానికి చిహ్నంగా వయోపరిమితి లేకుండా మగాళ్ళందరూ బీడీలు తాగుతున్నారు. ఆడవాళ్ళు సంతలో చౌకగా దొరికిన చేమంతి పూలను తలనిండా తురుమకుని వున్నారు. తమ భుజాల్ని రాసుకుని బోతున్న పరిచితులను చేతులు పుచ్చుకొని ఆపడాలు, దూరంగా కనిపించి జనంలో కలిసి మాయమైపోబోతున్న స్వజనాన్ని అరచి పిలుచుకోవడాలు, క్షేమ సమాచారాలు, సేద్యం పనులు, కబుర్లు, రాని బాకీల కోసం కీచులాటలు, పాత కక్షలపైన కొత్త పన్నాగాలు – బస్టాండు రభస రభసగా వుంది. బస్సులు వుండి వుండీ వచ్చి ఆగసాగాయి.

మల్లానూరు బస్సు బస్టాండులో ఆగకముందే ఈగలు ముసిరిన మామిడిముట్టెలా మనుషులతో మూగిపోయింది. అది కదిలేసరికి మనుషుల మధ్యలోకి కృష్ణగిరి నుంచీ ప్రైవేటు బస్సులు రెండు కరటక దమనకుల్లా విచ్చేశాయి. జనాలతో నిండిన బస్సులు తేనె తుట్టెల్లా వెళుతున్నా బస్టాండులో సమ్మర్ధం తగ్గడం లేదు. విజలాపురం వెళ్ళిన బస్సు యిప్పటికే రావలసి వుంది. కంగుందివైపు వెళ్లే గ్రామీణులు అప్రమత్తులైనారు. ఇన్ని బస్సులు వచ్చిపోతుండగా కేవలం తమ బస్సు మాత్రం రాకపోతుందా అన్న ఉద్దేశంతో పెద్దపర్తిగుంట బస్సు జనం కూడా తమను తాము ఉత్సాహపరచుకోసాగారు.

ఏమాత్రం బస్సు వచ్చే శబ్దం విన్పించినా వారు తమ సంభాషణల్ని ఆపి రోడ్డుకేసి జూస్తున్నారు. అది తమకు సంబంధించినది గాకపోవడంతో అంతలోనే తాము వదిలిపెట్టేసిన సంగతుల్ని మళ్లీ మొదలుబెట్టుకుంటున్నారు. వారిలో బస్సు వచ్చేస్తే ఎంతటి ముఖ్యమయిన చర్చనయినా అక్కడికక్కడే ముగించే సంసిద్ధత వుంది. రాకపోతే ఆ విషయాల అంతు తేల్చాలన్న వాగ్వాద లోలుపత్వమూ వుంది.

రోడ్డుమీద తరచుగా ఏ లారీయో, జీపో పోతుండడము వల్ల వారికి మోటారు యింజన్లు చేసే శబ్దాలపట్ల రానురానూ అనుమానం పెరగసాగింది. హార్న్ మోత విన్పించగానే కొంతమంది అనవసరంగా లేచి సామాన్లు సర్దుకుని ఆ వచ్చింది బస్సుగాకపోవడంతో అపహాస్యానికి గురికాసాగారు. మరికొంతమంది బస్సు స్టాండులోకి ఆసాంతం వచ్చి ఆగేవరకు నిశ్చలంగా వుండి తమ నిబ్బరాన్ని ప్రదర్శించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. అయినా రావాలేగానీ బస్టాండులోకి వచ్చి ఆగిన బస్సు తమను ఎక్కించుకోకుండా ఎలా వెళుతుందన్న ధీమాను యింకా కొంతమంది తమలో తాము ప్రోది చేసుకోసాగారు.

బస్సు అసలు వస్తుందా అన్న అనుమానం ఒకవైపు, రాక ఎక్కడికి బోతుందన్న భరోసా ఒకవైపు – వచ్చిన బస్సులో ఖాళీ వుంటుందా అన్న సందేహం ఒకవైపు, ఎంత రద్దీగావున్నా తాము ఎక్కలేకపోతామా అన్న ఆత్మవిశ్వాసం ఒకవైపు, ఏది ఏమైనా పరిస్థితులెలా వుంటాయో కాబట్టి తాము తగినంత జాగరూకతలో వుండాలనే నిశ్చయం మరొకవైపు జనం ఎవరికి వారు తగిన హెచ్చరికలోనే వున్నారు.

ఇంతలో దూరంగా ఏదో హార్న్ వినిపించింది. దాని బలహీన స్వరాన్ని బట్టి అది ఖచ్చితంగా ఆర్టీసీ బస్సే అయ్యుంటుందని కొంతమంది పసిగట్టారు. రాజవీధిలోని ఒక మలుపులో ఒక ఎర్రటి ఆకారం కన్పించింది. జనంలో సంచలనం ప్రారంభమైంది. సంచీలు తడమబడ్డాయి. మూటలు చేరువయ్యాయి. తలగుడ్డలు బిగిశాయి. చెంగులు నడుములో దోపుకోబడ్డాయి. పిల్లవాళ్ళ చిటికెనవ్రేళ్ళు పెద్దవాళ్ళ చేతుల్లో నలిగాయి. జనాలను తప్పుకుంటూ వచ్చేస్తోంది – బస్సు.

బస్సు దూరంగా వస్తున్నప్పుడే అది పలమనేరు నుంచీ వస్తున్నదని కొంతమంది చెప్పేశారు. దానిమీదవున్న కట్టెల మోపుల్ని బట్టి అది విజలాపురం నుంచే వస్తోందని మరికొంతమంది వాదించసాగారు. నేమ్‌బోర్డు సరిగ్గా దృగ్గోచరం అయ్యే సమయానికి అది కాస్తా తొలగించబడింది. మరికొంతసేపటికి పేరులేని బస్సు బస్టాండులో పార్కు చేయబడింది.

బస్సు చుట్టూ జనం మూగిపోయారు. ఎక్కే జనం ఎక్కకుండా, దిగే జనం దిగకుండా అక్కడ కొంతసేపు జనస్తంభనం జరిగింది. బస్సు దిగుతున్న జనాన్ని బట్టి అది విజలాపురం

నుంచీ వచ్చిన బస్సేనని తేలిపోయింది. అయితే మళ్ళీ అది విజలాపురం వెళుతుందనే నమ్మకం ఏమిటి? – అన్న అనుమానం ఒకటి వారిని వేధిస్తోంది. అద్దాలు వూడిపోయిన కిటికీలగుండా కొంతమంది ఒళ్ళు చీరుకుపోతుండగా, గుడ్డలు చిరిగిపోతుండగా వెలుపలికి దూకసాగారు. మరికొంతమంది వెలుపల్నుంచీ లోపలికి దూరడానికి ప్రయత్నించసాగారు. దాదాపు అయిదు నిమిషాల తర్వాత బస్సులోనుంచీ దిగాల్సిన జనం అంతా దిగగలిగారు. వారి ముఖాలలో ఒక యజ్ఞం పూర్తి చేసిన సంతృప్తి కన్పిస్తోంది. బస్సు చుట్టూ పలచబడుతున్న జనసమూహం నుంచీ కండక్టర్ రొప్పుకుంటూ బైట కొచ్చేశాడు. అతడి జుట్టు చెల్లాచెదురై కాకిగూడులా వుంది. కళ్ళజోడు ముక్కుమీది నుంచీ జారిపోతూ వుంది. నలిగి మాసిపోయిన కాకీ బట్టల మధ్యలో అతని శరీరం అమితంగా వడిలిపోయి వుంది. అతడు చంకలో వున్న క్యాస్ బ్యాగ్‌ను గుండెకంటే పదిలంగా పొదవి పట్టుకుని వున్నాడు.

బస్సులోనుంచీ బయటపడ్డ తర్వాత బస్సు కండక్టరుకు తన బస్సులోనే తాను పడిన అవస్థ, జరిగిన త్రొక్కిసలాటలో తన ఒళ్ళు హూనమైన వైనం, వాగ్వాదాలు, ఘర్షణలు, అవహేళనలు, తిట్టిపోతలు మొదలైన అవమానాల పట్ల అమితమైన కించపాటు కల్గింది. అతడు నడుమును విల్లులా వంచి తన ఎడమ చెవిని అరిచేత్తో మూసుకుని కుడిచేత్తో బస్సు చుట్టూ వున్న జనాన్ని ఉద్దేశించి చూపుతూ బొంగురుపోయిన గొంతుతో బూతులు తిట్టసాగాడు. ఆ కండక్టరు ఉద్యోగంలో చేరకముందు చీమనైనా మందలించినవాడు కాడు. ప్రస్తుతం అతడు తిట్లలో డిప్లొమా సాధించి వున్నాడు. ఈ దూషణ భాషణాలన్నీ అతడు తను కండక్టరు కావడానికి ఉద్యోగంలో చేరిన తర్వాత నేర్చుకున్నవి.

బస్సులో స్థానం సంపాదించుకున్న ప్రయాణీకులకు వెంటనే ఒక కొత్త సమస్య ఎదురైంది. విజలాపురం పోవాల్సినవారు, మల్లానూరు పోవాల్సినవారు, సోగడబల్ల వెళ్ళాల్సినవారు, పొగురుపల్లెకు వెళ్ళాల్సిన వారు అంతా కలిసి ఒకే బస్సు ఎక్కేయడం అనే పొరపాటు చేసినట్టు కొద్ది క్షణాల్లోనే అందరూ గుర్తించారు. ఎక్కినవారిలో కొంతమంది బస్సు దిగేసి అది ఎక్కడికి పోతుందనే విచికిత్సలో పడ్డారు. మరికొంతమంది జాగరూకులు బస్సు తమ వూరికి వెళ్ళదనే నిర్ధారణకు వచ్చిన తర్వాత మాత్రమే బస్సు దిగాలని దృఢంగా నిశ్చయించుకొని లోపలే బైఠాయించేశారు.

వరాలనిచ్చేసి వెళ్లిపోతున్న భోళాశంకరుని వెంటబడ్డ భస్మాసురుల్లా కొందరు కండక్టరు వెనకబడ్డారు.

"ఏం సార్, ఇది మల్లానూరు బస్సే కదా?"

"నువ్వుండవయ్యా! విజలాపురం నుంచీ వచ్చిన బస్సు ఎక్కడికి బోతుందో ఆమాత్రం తెలవదా?"

"ఈ బస్సు పొగురుపల్లెకు పోతుంది కదప్పా" విమానమెక్కబోతున్న ప్రైమ్మినిస్టరు వెంటబడ్డ విలేకర్లలా జనాలు కండక్టరు వెనక బడ్డారు. కండక్టరు కంట్రోలరు రూంలోకి దూరి గట్టిగా తలుపులు వేసుకున్నాడు. ఊహించని ఈ పరిణామం వల్ల గుంపు ఖిన్న వదనులయ్యారు. అక్కడక్కడ వేడి వేడి నిశ్వాసాలు రేగాయి. కండక్టరు మళ్ళీ తలుపు తీస్తూనే అతడిని సంధించడానికి కొంతమంది కంట్రోలరు రూముముందే తిష్టవేశారు. మిగిలినవాళ్ళు మళ్ళీ బస్టాండులోకి చెదిరిపోయారు. రానున్న బస్సు రాకమానదనీ రాని బస్సుకోసం ఎదురుచూసి ప్రయోజనం లేదనీ మరికొంతమంది వేదాంత ధోరణిలో పడ్డారు.

వాతావరణం ఉమ్మగిస్తోంది. దూరంగా ఆకాశంలో మబ్బులాడుతున్నాయి. ముఖాల్లోకి అలసట, విసుగు నీడల్లా ప్రాకుతున్నాయి. కడుపులో చిచ్చు రాజుకొంటోంది. అందరికీ యిళ్ళు గుర్తుకు వచ్చే సమయం. బస్సు సకాలంలో వచ్చివుంటే తామీపాటికి యింట్లో వుండేవాళ్లము గదా అనే తలపోత, యింకా తామిక్కడే అఘోరిస్తావున్నామనే ఉక్రోషం వారి ముఖాల్లో స్పష్టంగా కన్పిస్తోంది.

ఆ సరికి లీడరుకు విదేశీ పర్యటనాంతరం స్వజనాన్ని పలకరించే కార్యక్రమం ఒక కొలిక్కి వచ్చింది. అప్పటికే అతడు తిప్పయ్యగౌడు జేబులోని బీడీలన్నింటినీ ఖాళీ చేసేశాడు. బస్సు రాని దారుణం యింకా కొంతసేపు కొనసాగేపక్షంలో తన జేబులోని అరకట్ట బీడీలు కూడా మన్ను కలసిపోవడం ఖాయం. లీడరుకి ఒక్కసారిగా తన వూరివారిపై పెద్దపర్తిగుంట బస్సుకోసం ఎదురుచూస్తున్న వెస్ట్‌ఫిర్కా జనాలపైన ప్రేమ ముంచుకొచ్చేసింది. ఈ సంకట పరిస్థితిని చక్కచేయడానికి ఈ దిక్కుమాలిన వెస్ట్‌ఫిర్కా జనాలకు తనకంటే దిక్కు ఎవరున్నారన్న భావన రావటంతోటే అతడు ఉద్రేకపడిపోయాడు. ఒక్కపెట్టున పూనకం వచ్చినవాడిలా వూగిపోతూ ముందుకు కదిలాడు. అడ్డపంచ ఒక చివరను పైకిలాగి, ఎర్రటి తన డ్రాయరు బైటకు కన్పించేలా చంకలో దోపుకున్నాడు. తిప్పయ్యగౌడు చేతిలోని ఆఖరి బీడీని బలవంతంగా లాక్కుని అంటించి గబగబ రెండు గుక్కలు పీల్చి వెంటనే కాలి కిందవేసి రాచేశాడు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ఒక ప్రాంతీయపార్టీ బస్టాండు ముందునాటిన జెండా పీఠాన్ని ఎక్కి అతడు వాదన మొదలుపెట్టాడు.

"ఐతే ఏవంట! అడిగేవాడు లేకపోతే మాత్తరం యింత అన్నాయమా? సంతనాడై నా బస్సులు సక్రమంగా నడపకపోతే సంతకొచ్చిన జనాలు ఏమైపోవాల? కంట్రోలు రూములోకి బోయి తలుపేసుకున్నట్టు గాదు. ధైర్నముంటే నాకాడికొచ్చి మాట్టాడమనండి.

ధైర్నముంటే కంప్లయింటు బుక్కు నాకాడికి తెమ్మనండి. ఎవురప్పా ఆడ? ధైర్నముంటే మొగోడెవుడన్నా వచ్చి నాతో కలబడమనండి" భుజాస్ఫాలనం ఒక్కటి తక్కువగా లీడరు బహిరంగ ప్రదర్శన ప్రారంభించేశాడు.

పెద్దపర్తిగుంట జనాలందరూ లీడరు చుట్టూ మూగిపోయారు. జనాలను చూడను చూడనూ లీడరులో పెగ్గె శ్రుతి మించుతోంది. ఉత్సాహం పెల్లుబుకుతోంది. ఉద్రేకం పగ్గాలు తెంపుకొంటోంది. ఆవేశం పరవళ్ళు తొక్కుతోంది.

"నాయాల్ది – కుప్పం తాలూకా అంటే అందరికీ సిన్నసూపే! ఏమి ఈడుండేవాళ్ళకు కట్టుకోను గుడ్డపేలిక పన్లేదా! కూర్లోకి ఉప్పు మిరక్కాయ శలవులు పన్లేదా? వారానికొక నాడు సంత పన్లేదా? నిన్న ఈ ఇసయం సిత్తూర్లో నేరుగా అన్నతోనే మాట్లాడేసి వచ్చినా. ఆయన నేరుగా ఈ ఇసయం డియిజనల్ ఆఫీసులోనే మాట్లాడతానని చెప్పినాడు. నాయాల్ది దేవుడు వొరమిచ్చినా, పూజారి వొరమిచ్చేట్టు లేడు. ఎవురాడ, ఎంక్వయిరీ లోకి దూరిపోయిన కండక్టరుని ధైర్నముంటే నాకాడకు రమ్మనండి" లీడరు పేట్రేగిపోయాడు.

"అయితే సిత్తూర్లో అంతా లీడరన్నకు తెల్సినోళ్ళేనా?" ఒంటిపల్లె కోమలమ్మ తిప్పయ్యగౌనితో యింటర్వ్యూ ప్రారంభించేసింది. సుభద్ర చంకలో జారిపోతున్న పిల్లవాడ్ని ఎగేసుకుంటూ చోద్దెం జూస్తోంది. వెంకటపతి ఆమె మీదకు ఈగ వాలనీకుండా అంగరక్షకుడిలా నిలబడి వున్నాడు.

ఎట్టకేలకు ఎంక్వయిరీ తెరుచుకుంది. లీడరు ద్వైపాక్షిక సంబంధాల మీద చర్చకోసం కంట్రోలు రూములోకి ప్రవేశించాడు. ఏ ఆఫీసులోనైనా అడుగు పెడుతూనే బీడీ ముట్టించడం ద్వారా తన పరపతి త్వరగా పెరుగుతుందని అతని నమ్మకం. వెళ్తూ వెళ్తూ అతడు జనంలో నుంచీ నాలుగయిదు బీడీలు సేకరించుకుని వెళ్ళాడు.

కంట్రోలు రూముకివతల బస్సు ఎటుబోతుందో తెలియని జనంతో బస్టాండు నిండి పోయి వుంది. అప్పోజీ భాగ్యమ్మ జాడ తెలియజేయగల మల్లిసెండు గాడి కోసం బస్సు చుట్టూ తిరుగుతూ గాలిస్తున్నాడు. ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూస్తున్నట్టుగా జనం ఎంక్వయిరీ కేసి ఆసక్తిగా చూస్తున్నారు.

దాదాపు అరగంట తర్వాత లీడరు, కండక్టరు కంట్రోలు రూం తలుపులు తీసుకుని వెలుపలికి వచ్చేశారు. కండక్టరు బస్సులోకి దూరి విజలాపురం బోర్డు తగిలించి దిగేశాడు. విజలాపురం జనాల్లో ఆనంద పవనాలు వీచాయి. వాళ్ళు వెంటనే మిగిలిన గ్రామాల జనాలను పురుగులను జూసినట్టు జూడసాగారు. ఆ చూపుల్లో మీరింకా మా బస్సులో ఎందుకు కూర్చుని వున్నారన్న కర్కశత్వం వుంది. విషయం తెలిసిన తర్వాత కూడా

యింకా మీరెందుకు నిలబడి వున్నారన్న అసహనం వుంది. 'చ్చ్' మీ బస్సింకా రాలేదు కదా, పాపం' అనే జాలి కూడా వుంది.

పెద్దపర్తిగుంట జనాలందరూ లీడరు చుట్టూ చేరిపోయారు. లీడరు, కంట్రోలరు జనం మధ్యలో జెమినీ బొమ్మల్లా నిలబడి గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లు తాగుతున్నారు. నెంబరు నూటనాలుగు జాడీ బీడీలతో ప్రారంభమైన చర్చలు గోల్డుఫ్లేక్ సిగరెట్లతో ముగియడం పట్ల గుంపులో ఏమంత సంతృప్తి కన్పించడం లేదు.

"తప్పు పాపం, గవర్నమెంటుది కాదంట. సిత్తూరులో వున్న అన్నది గానీ, డివిజినల్ ఆఫీసు వారిది కూడా కాదంట. నిజానికి తప్పు అన్నెం పున్నెం తెలియని కండక్టరు, డ్రైవరులది కూడా కాదంట. తప్పంతా దిక్కుమాలిన డొక్కు బస్సులదేనంట. ప్రాణమున్న మనుషులనైతే ఏమన్నా అనొచ్చు. నోరులేని జీవాలైన బస్సుల్నంటే ఏం లాభం!" లీడరు తేల్చేశాడు. కండక్టరు, లీడరు మరోదఫా చర్చలకోసం టీ అంగడికేసి నడిచారు. విజలాపురం నుంచీ చవుకగా కట్టెల్ని దీసుకొచ్చే శుభ సమయంలో కండక్టరు లీడరుతో మూడో దఫా చర్చలు జరిపే అవకాశం కూడా లేకపోలేదు.

సమయం అయిదు గంటలు దాటింది. జనాలలో నిస్పృహ వ్యాపిస్తోంది. ఎక్కడివాళ్ళక్కడ పేడముద్దల్లా నేలకు అంటుకుపోతున్నారు. పార్కులో అత్తినీరాలుకు, సంపంగి గౌడుకు అప్పుడే కొంచెం మత్తు తగ్గడం వల్ల వాళ్ళప్పుడే తెల్లవారినట్టుగా వర్తమానాలు వాకబు చేసి తెలుసుకుంటున్నారు.

జమీందారుగారి పార్కులో వున్న ఆసనాలన్నీ ప్రయాణీకుల్తోనూ, బిచ్చగాళ్ళతోనూ, బస్టాండు కూలీలతోనూ నిండిపోయాయి. వారిమధ్యలోనే ఒక రాతి చప్టామీద వసంతనాయనివారు ఠీవిగా కూర్చొని వున్నారు. ఆయన నెరిసిన గుబురు మీసాల చాటున గోప్యమైన చిరునవ్వు వుంది. ఆయన చిరుగుల చొక్కాను కప్పుకుని ఎర్రటి జిగినీ బుటాల పచ్చడం వుంది. చెవిలో సన్నటి బంగారపు పోగులున్నాయి. నుదుటిపైన తిరుచూర్ణపు నామముంది. ఆయనకు పూర్వపు జమీందారులతో బహుదూరపు చుట్టరికం వుంది. ఈ పార్కు, ఆ వూరు, యిదంతా తమ వంశస్తుల దయాదాన కైంకర్యమే గదా అనే లోలోపలి అభిజాత్యం వుంది.

ఆయన చివాలున లేచి పక్కనేవున్న బ్యాగును తీసుకుని ప్రస్తుతం తనకు మంత్రి హోదాలో మసలుకుంటున్న చాకలి లింగయ్యతో "ఈ బస్సు ఈ దినం సక్రమంగా వచ్చేటట్టులేదురా లింగయ్య!" అంటూ రోడ్డుమీదకు వచ్చేశారు. అలా రోడ్డుపైకి రావడం వాళ్ళిద్దరికీ యిది అయిదోసారి.

బస్సు రాకపోయిన పక్షంలో వసంతనాయని వారికి గల గత్యంతరం పార్కులో పడిగాపులు పడడమే! ఆయనకు యిప్పుడు టౌనుకు చివరనున్న ప్యాలస్‌లో ఆతిథ్యమిచ్చే వాళ్ళెవరూ లేరు. ఊళ్లోని లాడ్జింగు హౌసులో బస చేయడానికే గాదు, హోటల్లో భోజనం చేయడానికి కూడా ఆయన దగ్గర తగినంత పైకం లేదు. అయితే ఆయన బస్సు చేస్తున్న ఈ ధిక్కారాన్ని సహింతునా అన్నట్టు రోడ్డుపైకి పార్కులోకి కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు.

'లింగయా మాత్యునికి' కూడా ఆయన వెనక బరాబరులు తిరగడం ఏమంత కష్టమైన విషయంగాదు, కానీ దొరవారు బ్యాగు మోస్తుండగా తాను వెనుకనే చేతులూపుకుంటూ నడవడం మాత్రం నామర్దాగా వుంది. అప్పటికీ ఆ బ్యాగును తన దగ్గరికి తీసుకోవడానికి అతడు శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తూనే వున్నాడు. కానీ నాయనివారు దాన్ని తనదాకా రానివ్వడం లేదు. పూర్వపు ఆస్తి తనకింకా పదిహేను సవరాల బంగారం రావలసి వుందని నాయనివారు ఎప్పుడూ చెబుతూ వుంటారు. బహుశా బ్యాగులో వున్నది అదే గావచ్చు. లింగయ్య నాయనివారివెంట మళ్లీ పార్కులోకి నడిచాడు.

అయిదు గంట పదిహేను నిమిషాల ప్రాంతంలో పెద్దపర్తిగుంట బస్సు ప్రయాణీకుల స్వప్నం ఫలించింది. ఆరులో మరులొచ్చినట్టుగా వాళ్ళందరూ ముసిముసిగా నవ్వుకున్నారు. కొంత జనం గట్టిగా చప్పట్లు కొట్టసాగారు. మరికొంతమంది ఈలలు వేయసాగారు. జనసమ్మర్దం చెలరేగింది. ఇంట్లోకి రాకూడని తరుణంలో తప్పనిసరై గోడ అంచునుంచి నడచివచ్చి, చాప, చెంబు తీసుకుని, అంతే బెరుకుగా వరండాలోకి వెళ్ళే స్త్రీలా మెల్లగా వచ్చి ఒక మూలగా ఆగిపోయింది పెద్దపర్తిగుంట బస్సు.

6. భాగ్యరేఖా విలాసమ్

బస్సును చుట్టుముడుతున్న ప్రయాణీకుల్ని సరుకు చేయకుండా ముందుకూ వెనుకకూ కవాతు చేయించి యింజను ఆపుజేసి, కిందికి దూకి పాంటు గుండీలను సరిజేసుకుంటూ ఎంక్వయిరీ వెనుకకు పరుగెత్తాడు డ్రైవరు. ముందు జాగ్రత్తగా డోరు దగ్గరే నిలుచున్న కండక్టరు బస్సు ఆగకముందే నేలపైకి దూకి ఎంక్వయిరీ ఆఫీసులోకి దూరిపోయాడు. చీర లెత్తుకుని చెట్టెక్కబోతున్న శ్రీకృష్ణుని దగ్గర చేతులు చాచే గోపికల్లా ప్రయాణీకులు కొందరు చేతులు చాచుకుంటూ కండక్టరు వెంట చిల్లర కోసం ఎగబడ్డారు.

బహుదూరం నుంచీ బస్సులో వచ్చినవారు మెల్లగా లేచి సామాన్లు సర్దుకుంటున్నారు. ప్రయాణపు బడలికలో చిన్నపిల్లలు కొంతమంది నిద్రపోయి యింకా లేవలేకపోతున్నారు. ముసలివాళ్ళకు మోకాళ్ళు, మోచేతుల వద్ద నెప్పులు పుడుతున్నాయి. స్థూలకాయులైన మరికొందరికి మోకాళ్ళు, పాదాలు వాచాయి. జనాల, సామాన్ల, సీట్ల మధ్య యిరుక్కు పోవడం వల్ల మరికొంతమందికి శరీరావయవాలు తిమ్మిరెక్కి వున్నాయి. కారణాలు ఏవైనా గావచ్చు. బస్సులోని వారు వున్నపళంగా బస్సును వదలి రాకపోవడం పట్ల బయటవున్న వారిలో అసంతృప్తి, అసహనం ప్రబలాయి.

దిగుతున్నవారిని పక్కకు తోసి కొంతమంది లోపలికెళ్లి సీట్లు ఆక్రమించసాగారు. బయటనుంచీ కొంతమంది లోపలికెళ్ళిన వారితో తమకు కూడా సీట్లను అట్టిపెట్టవల సిందిగా అరచి చెప్పసాగారు. బస్సు డోరు ముందు గుంపు గుమిగూడింది. తొక్కిసలాట ప్రారంభమైంది. తిట్టుకోవడాలు, మోచేతులతో కుమ్ముకోవడాలు, భుజాలతో నెట్టుకోవ డాలు, అరికాళ్ళను తొక్కుకోవడాలు, మనుషుల మధ్యలో యిరుక్కుపోయిన సంచులను, మూటలను బలవంతాన లాక్కోవడాలు – పిండి మరలోకి పోతున్న ధాన్యంలా జనప్రవాహం డోరుగుండా బస్సులోకి ప్రవహిస్తోంది.

తొక్కిసలాడుకుంటున్న గుంపుకు వెలుపుల కించిత్ ప్రత్యాలీన భంగిమలో నడుము మీద చెయ్యివేసి నిలబడి సవిలాసంగా వక్కాకు నములుతోంది భాగ్యమ్మ. నములుతున్న వక్కాకును ఎర్రగా ఉమ్మేస్తూ, నాలుకను నోటిలో ఒక చుట్టు తిప్పి 'ఈ పెహారంగా అయితే మనం కొంపజేరినట్టేనా' అంటూ 'సౌగంధికా పుష్పాన్ని తేగల మొగవాడివేనా నువ్వు' అని భీమసేనుణ్ణి కవ్వించిన ద్రౌపదిలా ఆమె వెంకటసామి కేసి చూసింది. వెంకటసామి ఆమె ఆంతర్యపు సవాలును బంతిలా అందుకొన్నాడు. జుబ్బాను పైకి లాగి పంచను బిగించికట్టి మొలత్రాడుతో సంధించాడు. అరచేతుల వరకు వేలాడుతున్న జుబ్బా చేతులను భుజాలపైకి ముడుచుకున్నాడు. తలగుడ్డ బిగించాడు.

పర్వతాన్ని ఢీకొనే రాక్షసుడిలా, పోరాటానికి దిగుతున్న పొట్టేలుకు మల్లే అతడు మెడ వంచుకుని ఎనుబోతులా గుంపును ఢీకొన్నాడు. బలిష్టమైన అతడి తల పిడిగుండులా జనాన్ని మోదుకుంది. 'అయ్యో', 'అబ్బా', 'సస్తినో', 'కాలుబోయ', 'యింకేంగతో', 'దేవుడా' మొదలైన పొడిమాటల ఆర్తనాదాలు గాలిలోకి లేచాయి.

గుంపులో మొదటి వలయాన్ని దాటుకున్న తర్వాత వెంకటసామి గమన వేగం కొంచెం తగ్గింది. ఇప్పుడిక జనం మరింత చిక్కగా కూరుకుపోయి వున్నారు. కొంతమంది హతభాగ్యులు బస్సులోనుంచీ యింకా దిగడానికి ప్రయత్నిస్తున్నారు. కనీసం బస్సులోని వారందరూ దిగినాక, తాము పూర్తిగా విజృంభించ వచ్చుననే ఉద్దేశంతో కొంతమంది తగిన సమయంకోసం వేచి జూస్తున్నారు.

'ముందు ఆడవాళ్ళను ఎక్కనియ్యండప్పా' ఒంటిపల్లె కోమలమ్మ వెనక నిలుచున్న తిప్పయ్యగౌడు ఆమె ముందు నిలుచున్న మగవాళ్ళతో అంటున్నాడు. ముందు గనుక ఆమె ఎక్కితే తనకు కనీసం రెండవ అవకాశం లభించగలదన్న ఆశ అతడికుంది. 'ముసిల్దాన్ని నన్ను యెక్కనియ్యండి సామీ' ఒక ముసలావిడ బదుకు చివరిక్షణం వరకు పోరాడే మొండితనంతో ఆక్రోశిస్తోంది.

'సంకబిడ్డకు వొళ్ళు బాగాలే, కొంచెం దారి యియ్యండన్నా' – బిడ్డకు దెబ్బ తగల నీకుండా సుభద్ర శతథా ప్రయత్నిస్తోంది. వెంకటపతి ఆమె వెనుకే కంచు కవచంలా నిలబడి వున్నాడు. అతడు జనం జలధిలో సుభద్రతో జలకాలాడుతున్నట్టుగా ఆనందపడి పోతున్నాడు. వసంతనాయనివారికి తన చేతి సంచీ నాడా తెగిపోయినట్టుగా వుంది. 'ఓరి లింగయ్యా' అంటూ ఆయన నూతిలో నుంచీ వేసినట్టున్న కేకకు పది మంది కవతల వున్న లింగయ్య 'ఏం దేవరా' అంటూ బదులిచ్చాడు. సీమేగౌడుకు పంచ ఊడిపోయే ప్రమాదం స్ఫురిస్తోంది. తన జుబ్బాలో వున్నది తన చెయ్యేనా అనే అనుమానం పట్టుకుంది

సంపంగి గౌడుకు. మరో బాటలు కల్లు తాగకుండా వచ్చినందుకు అత్తినీరాలుకు మధన ప్రారంభమైంది.

వెంకటసామి బలంగా వూపిరిపీల్చి వదిలి, కండలు విరుచుకుంటూ మళ్ళీ ముందుకు కదిలాడు. అంతవరకు కొంత పరధ్యానంగానూ, సాత్వికంగానూ వున్న జనం వెంకటసామికిప్పుడు పూర్తి ప్రతిఘటనను తెలియజేసారు. చేతికర్రలు తగిలి వెంకటసామి బొటనవ్రేలు చితికిపోయింది. మొలత్రాడు తెగింది. జుబ్బా వెనక భాగంలో పెద్ద చీలిక ఏర్పడింది. మరింత గట్టిగా నిశ్వసించి, కండలు వుబ్బించి వూగిపోతూ అతడు ముందుకు కదిలాడు. అడవి ఏనుగు తాకిడికి నుజ్జు నుజ్జయిన చెరుకు తోటలా జనం అతడి తాకిడికి దారుణంగా నలిగిపోతోంది. వెంకటసామి ద్వారం సమీపించాడు. అక్కడ బస్సు డోరు రేకులుగా చీలి మేకులుగా తయారై వుంది. వెంకటసామి మొరటుగా దానిమీద పడి భుజం మీద గాయం చేసుకున్నాడు. రక్తంతో అతడి ఎడమ భుజం మోచేతి వరకు తడిసింది.

వీరుడిలా ఉత్సాహంగా బస్సులోకి ప్రవేశించాడు వెంకటసామి. మూడు సీట్ల కవతల కెళ్ళి అక్కడ సీటుపైన పరవడానికి తనదగ్గర తువ్వాలు కన్పించకపోవడంతోనూ, కళ్ళు తిరిగినట్లు తోచడం చేతనూ అతడు సీటుమీద బొండమానులా పడిపోయాడు. అప్పటికే మల్లిసెండుగాడు బస్సులోకి వెనక కిటికీల గుండా కోతిలా పాకి వచ్చేశాడు. మరీ పొడుగరి కావడం వల్ల అతడు మెడవంచి చేతులు వూపుకుంటూ సీట్ల మధ్య చింపాంజీలా నడవసాగాడు.

కొల్లబోయిన చెరువులోకి చేపలకోసం పరుగెత్తే వారిలా, పొరిగిండ్లు కాలిపోతుండగా స్వంత యిండ్లలో నుంచీ సామాన్లు వెలుపలికి తెచ్చుకొంటున్నవారిలా జనాలందరూ గబగబా సీట్లు ఆక్రమించుకోసాగారు. కిటికీల గుండా పాకే చాకచక్యం గానీ, ద్వారం గుండా ప్రవేశించే కండబలంగానీ లేని బుద్ధి జీవులు కొందరు కిటికీల గుండా తమ సంచులూ, టవళ్ళూ సీట్లపైన వేసి తమ ప్రతినిధులుగా వాటికి పట్టాభిషేకం చేస్తున్నారు. "చూడండి సారు' యిదీ మా బతుకు, మీరు పక్కన నిలుసుకోండి. మీకు నేను సీటు పట్టిపెడతా?" అత్తినీరాలు జనం మధ్యలో పెనుగులాడుతున్న రమణమూర్తితో అంటున్నాడు. "నాకిదేం కొత్తకాదులెండి. అయినా యిదేం పెద్ద రద్దీ అండీ బాబూ! మా సిటీబస్సులకంటే యివే నయం అనుకోండి" – ప్రతిరోజూ దినచర్యగా బస్సులలో పడిగాపులు బడి ప్రయాణం చేస్తున్న అనుభవంతో ముందుకు సాగుతున్నాడు రమణమూర్తి. వీధి కుక్కలకు దొరికి పోయిన పిల్లికూనలా జనం మధ్యలో తిమ్మరాయప్ప బలహీనంగా అరుస్తున్నాడు.

సొన్నరసనపల్లె శాంతమ్మకు వెనకనున్న పోకిరీ మగవాళ్ళ చేతులు ఎక్కడెక్కడో తగిలి నివ్వెరపాటును కల్గిస్తున్నాయి. కానీ యిలాంటి అల్పమైన విషయాల్ని పట్టించుకుని బస్సులో స్థానం కల్పించుకునే తమ పూనికకు భంగం కల్గించుకునే స్థితిలో వారెవ్వరూ లేరు. నిజానికి వారేమంత వెర్రిబాగులవారు కాదు.

బస్సులో మొదటి విడతగా స్థానం సంపాదించుకున్న వారి జాబితాలో అప్పోజీ పేరు కూడా వుంది. ఇద్దరు కూర్చునే సీటుమీద పక్కసీటును పైసవకంతో రిజర్వు చేసి అతడు నింపాదిగా బీడీకట్ట కోసం జేబులు తడుముకోసాగాడు. సరిగ్గా అప్పుడే అతనికి నాలుగయిదు సీట్ల ముందు కూర్చొన్న భాగ్యమ్మ కన్పించింది. తాను ఎవరికోసమై కట్టుకున్న భార్యనే అనాదరం చేసి రాత్రింబగళ్ళూ ఆమె యింటిచుట్టూ పడిగాపులు పడుతున్నాడో, ఎవరికోసం తన బంధుమిత్రులాది స్వజనం, యింకా తన వూరి వారిచేత ఈసడింపులకూ, అవహేళనలకూ గురౌతున్నాడో, గత రెండు మూడు రోజులుగా ఎవతె వియోగం చేత నిద్రాహారాలు లేకుండా వేగిపోతున్నాడో, ఎవతె కోసం ఈ ఉదయం పదిగంటల నుంచీ కుప్పం పేటంతా కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడో, ఎవతె కోసం ఆరెమ్మెస్ బస్సును అరవై ప్రదక్షిణాలు చేశాడో, ఎవతె కోసం తాను అందరికంటే ముందు బస్సులోకి దూరి పక్కనున్న సీటును రిజర్వు చేసి పెట్టుకున్నాడో, ఎవతె తన సర్వం సహా ప్రణయ సీమకు అభిషిక్తురాలయి పరిధవిల్లుతున్న పట్టమహిషో – ఆ భాగ్యరేఖ యిప్పుడు తనకు ముందు అనతి దూరంలోనే కూర్చొని వుంది.

"హా భాగ్యమ్మా, యిక్కడున్నావా నువ్వు ప్రాణేశ్వరీ" అంటూ అతడు బిగ్గరగా పిలవబోయి అంతలోనే విద్యుద్ఘాతం తిన్నట్టుగా హతాశుడై పోయాడు. అతడి కళ్ళలో చీకటి పొరలు వ్యాపించాయి. పెదవులు విషాదంగా కిందికి వంపు తిరిగాయి. నుదురు ముడివడుతూ, విడివడుతూ వుంది. జేబులో బీడీలు వెదకడం కోసం పెట్టిన చేయి రాయిలా బిగుసుకు పోయింది. అప్పోజీకి ప్రత్యక్ష నరకయాతన అప్పుడే ప్రారంభమైంది.

భాగ్యమ్మకు ఒకవైపు వెంకటసామి, మరొకవైపు మల్లిసెండుగాడు కూర్చొని వున్నారు. వారి ముఖాలు చూస్తుంటే జిడ్డోడుతూ సినిమా కెళ్ళి ముఖాలు కడగకుండానే బస్సెక్కిన వారిలా వున్నారు. ఒక్క సినిమాకు మాత్రమే వెళ్ళి వచ్చారనే గ్యారంటీ ఏముంది? ఎక్కడెక్కడ తిరిగి వస్తున్నారో, ఏమో! అప్పోజీ హృదయం ఆక్రోశించసాగింది. భాగ్యమ్మ యింత తొందరగా తన్ను మరిచిపోయి మరొకని వెంట పడగలదా? మల్లి సెండుగాడు కూడా దీనికి వత్తాసు యిస్తున్నాడంటే యీ తతంగమంతా వాడి నిర్వాకమే అయివుండాలి. తానెంతగా వంచింపబడుతున్నదీ తెలుసుకున్న కొద్దీ అతడు కుతకుతా ఉడికిపోసాగాడు. ఈ నిర్వేదంలో అతడు తన పక్కనున్న సీటును డోలు నారాయణప్పకు దానం చేసేశాడు.

సీట్లన్నీ నిండిపోవడం వల్ల చాలామంది బస్సులో నిలబడిపోయారు. సీట్లు దొరకక మరికొంతమంది బయటే నిలబడి బస్సు బయల్దేరినప్పుడు లోపలికి తోసుకు వెళ్ళ వచ్చుననే నమ్మకంతో వున్నారు. లోపల జనాల మధ్య యిరుక్కుని ఉక్కలో ఉడికిపోవడం కన్నా బయటే నిలబడడం వల్ల హాయిగా గాలి వీస్తోందని వారిలో కొందరు ఊరట పడుతున్నారు. 'బస్సులో సీట్లు దొరకనివారి ఐక్యత వర్ధిల్లాలి' అనేట్లుగా వారు బీడీలకు అగ్గీ, తమలపాకులకు సున్నమూ అందించుకోసాగారు.

గుడుపల్లి సుందరేశవడియార్ కడు జాగరూకుడు. వ్రతము చెడకుండా ఫలితం దక్కించుకోవడం అతడికి తెలుసు. అతడు బస్సులో ఉడికిపోతున్న వాళ్ళందరూ అసూయపడేలా చొక్కా గుండీలు తీసేసి, కాలరు వెనక్కి తోసేసి బయటే నిలబడి మందానిలం ఆస్వాదిస్తున్నాడు. బస్సులో ఎక్కగానే తాను ముందు జాగ్రత్తతో తువ్వాలు వేసి స్వాధీనం చేసుకున్న సీటు తనకోసం ఎదురుచూస్తుంటుందని అనుకుంటున్న కొద్దీ అతడు ఆ ఆనందాన్ని అనేకరకాలుగా సెలబ్రేట్ చేసుకోసాగాడు. నోటినిండా తాంబూలం బిగించాడు. పక్కనున్న ముసలావిడనుంచీ నస్యం తీసుకుని నాసికా రంధ్రాలకు దట్టించాడు. నెంబరు నూట నాలుగు జాడీ బీడీని ముట్టించి పాయిఖానా గోడమీది చలనచిత్ర సుందరిని ఓరకంట గమనించాడు. దారినబోతున్న తలమాసిన వాడినొకణ్ణి పట్టుకుని వాడితో రోజురోజుకూ ఆంధ్రదేశంలో చప్పబడిబోతున్న రాజకీయాల గురించీ, తమిళనాడులో వర్ధిల్లుతున్న రాజకీయ సంస్కృతి గురించీ అనర్గళంగా అరచి అరవంలో మాట్లాడసాగాడు.

వందలాది చేతులతో, కాళ్ళతో యిప్పుడు బస్సు కదులుతున్న బండ రోకలిలా వుంది. నిలుచున్న భంగిమ మార్చడం కోసం ఎవరైనా కాలు పైకెత్తితే మరుక్షణానికల్లా ఆ ప్రాంతంలో మరొక కాలు ఊనుతోంది. ఒకసారి రైలింగు మీదినుంచి చెయ్యి తీసివేస్తే మళ్ళీ పట్టు దొరకటం లేదు. పట్టుదప్పి పక్కవారి మీద పడిపోవడమూ, తమ మీద పడిపోతున్న వారిని ఆవలికి నెట్టడమూ – తామరాకు మీద తత్తళించిపోతున్న నీటిలా జనం అవస్థ పడుతున్నారు. బస్సంతా సజీవ మానవ మాంసం వేసిన గోడౌన్‌లా మారిపోతోంది. బస్సు పొడుగునా వున్న రైలింగును పట్టుకున్న చేతులు జంబుకు కూర్చిన చచ్చిన చేపల్లా వ్రేలాడుతున్నాయి. చిరకాలంగా చాకిరేవు ముఖం చూడని గుడ్డలు చెమటలో తడిసి దుర్వాసన వేస్తున్నాయి. నిరంతర తాంబూల చర్వణం వల్ల గారకట్టిన పండ్లు, తైల సంస్కారం లేక పేలు, చుండ్రుపాలైన జుట్టు, స్నానం భాగ్యం అరుదుగా మాత్రం చవిచూసే శరీరాలు – బస్సు మురికి మురికిగా నరక కూపానికొక నమూనాలా వుంది. రమణమూర్తి ముఖాన్ని కర్చీఫ్‌తో కప్పుకుని కిటికీ కవతల ముఖం పెట్టి కూర్చొన్నాడు. భరింపరాని దుర్వాసనవల్ల అతడికి వాంతి అయ్యే పర్యంతంగా వుంది.

బస్సు కదిలితే కాస్తా వూపిరి సలపొచ్చు. కానీ బస్సు కదిలే ఆ మధుర క్షణం ఎప్పుడో? చోదకుని ఆచూకీ గురించి బస్సులో ఊహాగానాలు మొదలయ్యాయి. డ్రైవర్‌ను ఆకర్షించడానికి కొంతమంది బస్సు హార్న్‌ను మోగించి చూశారు. మరికొంతమంది ఊడిపోవడానికి సిద్ధంగావున్న బస్సు డబ్బా రేకులను దబదబలాడించారు. ఎవరైనా స్వచ్ఛంద సేవకులు వెళ్ళి డ్రైవరు జాడ కనుక్కొని రావలసిందిగా కొన్ని విజ్ఞప్తులు చేయబడ్డాయి. కిటికీలంతా కళ్ళు చేసుకుని బస్సు డ్రైవరు కోసం వెదకుతోంది.

డ్రైవరు టిఫిన్ చెయ్యడం కోసం రామవిలాస్‌కు వెళ్ళాడనీ, వరుసగా డజను మసాలా దోసెలు, యిరవై సెట్ల పూరీలు, పెద్ద జారు కాఫీ సేవించిగానీ అతడు రాడని మరికొంతమంది తేల్చేశారు. అంతేగాక డ్రైవరుకిద్దరు భార్యలనీ, అతడి జీతం అతడి తిండికే చాలకపోవడంతో భార్యలిద్దరూ అతడ్ని వేపుకు తింటున్నారని మరికొంతమంది తెలియజెప్పారు. ఇంకొందరు డ్రైవరు పేరు సత్తార్ సాహెబ్ కాబట్టి, ఈ రోజు శుక్రవారం గనుక, అతడు దగ్గరగావున్న మసీదుకు వెళ్ళి వుండవచ్చునని ఊహించారు. మరికొంతమంది డ్రైవరు వ్యక్తిగత విషయాలతో తమకు నిమిత్తం లేదనీ, అతడు సకాలంలో వచ్చి బస్సు నడిపించడమే తమ యొక్క సంయుక్త అభిలాష కావాలనీ నొక్కి వక్కాణించారు.

డ్రైవరు పదిహేను నిమిషాల తర్వాత బస్సు దగ్గిరికి వచ్చేశాడు. అతడు వస్తూనే బస్సు ఎక్కడానికి రెండు మూడుసార్లు ఉద్యుక్తుడై తర్వాత మరేదో మథనలో పడి వెనుదిరిగి, మళ్లీ ఎంక్వయిరీ వెనకకు నడిచాడు.

చేతికందిన పండు జారిపోతున్నట్టుగా బస్సులోని వాళ్ళలో కొందరు ఏకకంఠంతో డ్రైవరు నాపబోయారు. అయితే ప్రస్తుతం సత్తార్ సాహెబ్‌కు ఆరోగ్యం అట్టే బాగులేదనీ, వొళ్ళు వేడి చెయ్యడం వల్ల అతడు అస్వస్థతకు గురైవున్నాడనీ చెప్పి వారిని మరికొందరు ఊరడించారు. అయితే అలాంటి శంకలు ఏమైనా తీర్చుకోవాలంటే దగ్గరిలో వున్న పాయఖానాల నుపయోగించుకోకుండా డ్రైవరు ఎంక్వయిరీ వెనక్కు ఎందుకు వెళ్ళాడని ఒక శంకాగ్రస్తుడు నిలదీశాడు. బస్టాండులోని పాయిఖానా మరెందుకు వుపయోగపడినా యిలాంటి వాటికి పనికిరాదనే సాధారణ విషయం తెలియనందుకు ఆ ప్రశ్న అడిగినవాడిని అనేకరకాలుగా తిట్టి, చివరకు ఆ ప్రశ్న అడిగినందుకు శిక్షగా అతన్నే ఒకసారి అందులోకి వెళ్ళి రమ్మని మరొక పెద్దమనిషి ఆదేశించాడు.

ఎంక్వయిరీ వెనకకు వెళ్ళిన డ్రైవరు ఎంతసేపటికీ ఈవలికి రావడం లేదు. అక్కడేమీ రహస్య సొరంగం వున్నట్టు లేదు. అయితే డ్రైవరక్కడ ఎలాంటి తంటాలు పడుతున్నాడో తెలియని జనం అతడి ఆరోగ్యం తొందరగా కుదుటబడాలని భగవంతున్ని ప్రార్థించడం మొదలుపెట్టారు.

చిట్టచివరకు డ్రైవరు తలవంచుకుని మెల్లగా బస్సు దగ్గరికి వచ్చేశాడు. అతడు తీవ్రమైన అవమానాలకు గురైనవాడిలా అంతర్ముఖుడై వున్నాడు. క్యాబిన్‌లోకి ప్రవేశిస్తూనే అతడు తన సీటుచుట్టూ, బస్సు ముందున్న కిటికీల పక్కన పరివేష్టితులై వున్న ప్రయాణీకుల్ని నిరాసక్తంగా చూశాడు. ప్రయాణీకులందరూ డ్రైవరుకు కోపం రాకూడదనే ఉద్దేశంతో ఒకరిలో ఒకరు వొదిగిపోయి నిలుచున్నారు. మరికొంతమంది మరింత చనువు తీసుకుని పళ్ళు యికిలించి తమ సౌజన్యాన్ని ప్రకటించుకున్నారు. బ్యానెట్‌పై కూర్చొనరాదు అనే అక్షరాలు కన్పించకుండా మరికొందరు దానిపైన్నే బైఠాయించి వున్నారు.

క్యాబిన్‌లో లగేజీ వేయరాదు, అన్న ప్రకటనను దాటుకుని జనం క్యాబిన్ అంతా కూరుకుపోయి వున్నారు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌కు యిప్పుడు మూతపోవడంతో అదిప్పుడు నించుని వున్న ప్రయాణీకులకు యాష్ ట్రేగా ఉపయోగపడుతోంది. డ్రైవరు స్టీరింగుపైన చెయ్యి వేస్తూ గేర్ రాడ్ అందుకోబోయి అది మనుషుల మధ్య యిరుక్కుపోయి కన్పించకపోవడంతో మళ్ళీ అలిగి, బస్సు నుంచి దూకి ఎంక్వయిరీ వెనుకకు పోవడానికి ఉద్యుక్తుడయ్యాడు.

జనం అంతపనీ జరక్కముందే ఎక్కడో మూలపడిపోయి వున్న గేర్‌ను పైకిలాగి డ్రైవరు చేతికందించి బుజ్జగించి సీట్లో కూచోబెట్టారు. అతి ప్రయాసమీద గానీ పడని గేరు, అప్పుడప్పుడు తన అదుపులో వుండే బ్రేకులు, అవలీలగా పైకొచ్చేసే స్టీరింగు, అత్యంత బలహీనంగా పలికే హార్న్, అన్నీ సరిగా వున్నాయో లేదో చూసుకుని డ్రైవరు బస్సును స్టార్టు చేయబోయాడు.

అది స్టార్టు అయి అంతలోనే ఆగిపోయింది. దాంతో డ్రైవరు గబగబా జేబులు తడుముకుంటూ పక్కవాడి దగ్గర నుంచీ అగ్గిపెట్టె అడిగి తీసుకున్నాడు. బీడీకోసం వెదుకుతూ అతడు మరికొంత కాలహరణం చేస్తాడేమోనన్న భయంతో ఒక ప్రాప్తకాలజ్ఞుడు బీడీ సైతం యిచ్చుకున్నాడు. వెరశీ అగ్గిపెట్టె దాత, బీడీ ప్రదాత, భోక్త ముగ్గురూ కలసి 'బస్సులో పొగ త్రాగవచ్చును' అనేట్టుగా తాపీగా పొగ వదలసాగారు.

"అలమతి విస్తరేణ...", "యింకా ఏమిటి ఆలస్యం?", "ఏమయ్యా! ఈ బస్సు కదిలేదుందా? లేదా?", "గాలి కదలక ఉక్కబోసి చస్తా వుండామయ్యా స్వామీ?", "ప్రాణాలు బొయ్యేట్టుగా వుండాదే, యింకా మాపైన దయలేదా?" – బస్సు లోపల్నుంచీ ఆక్రోశాలు వెలువడ్డాయి.

"మరేం లేదు, బస్సుకు పికప్ లేదు. కొందరు దిగి బస్సును తొయ్యాల" సాఫీగా చెప్పాడు డ్రైవర్. బస్సంతా భయవీచికలు పాకాయి. డ్రైవరు చెబుతున్నది తమను కాదన్నట్టు,

అతడి మాటలు తమకేమీ అర్థం కాలేదన్నట్టు, అసలు అతడేమి చెబుతున్నాడో తమకు వినబడనట్టు కొంతమంది అనేక పోకణాలు పోసాగారు.

"దిగండయ్యా, బస్సు తొయ్యాలంట" బస్సు ఎక్కలేకపోవడం వల్ల బస్సు చుట్టూ నిలుచున్నవాళ్ళు లోపలి కూచున్నవాళ్ళవేపు క్రూరంగా చూస్తూ గద్దించసాగారు.

"ఎట్లాగూ క్రిందనే వుండారు గదప్పా, మీరే కొంచెం తొయ్యండప్పా" – లోపలున్నవారు ఎట్టకేలకు వేడికోళ్ళకే దిగారు. తర్వాత కింద నున్నవారు బస్సును తొయ్యడానికి ఒక కుహనా ప్రయత్నం చేసి, అది తేలికగా కదిలేటట్టు కన్పించడంతో మరికొంత బలాన్ని తగ్గించి చివరకు బస్సు కదలడం లేదనీ, యింక బస్సులో సీట్లపై దర్జాగా కూర్చొన్న వాళ్ళు దిగి రాక తప్పదనీ డిమాండు చేస్తున్నట్టుగా యథాస్థానాలలోకొచ్చి నిలుచున్నారు.

దేవ దానవుల మధ్య సంక్షోభ క్షీరసాగరంలా బస్సు అతలాకుతలం కాసాగింది. జగన్మోహినిలా డ్రైవరు మళ్ళీ బస్సు దిగి ఎంక్వయిరీ వెనుకకు వెళ్ళడానికి ఉటంకించడంతో దేవదానవుల మధ్య తాత్కాలిక సయోధ్య కుదిరింది. బస్సులో నుంచీ కొందరు త్యాగశీలురు దిగి బస్సు కదిలించడంలో తలావొక చెయ్యి వేశారు. బస్సు స్టార్టయింది. బస్సు కదులుతూనే బస్సును తొయ్యడానికి కిందికి దిగినవారితో బాటుగా, అందాకా వెలుపలే నిలుచున్నవారు కూడా పోటీబడి బస్సులోని కొన్ని సీట్లను ఆక్రమించగలిగారు. బస్సును తోయడానికి మాత్రమే కిందకు దిగిన తమయొక్క అంతకు క్రితం అరగంటగా కూచోవడం వల్ల స్వంతమయిన సీట్లను కొత్తవాళ్ళు దురాక్రమణ చేయడంపట్ల స్థానభ్రంశం పొందిన వాళ్ళు ఆగ్రహోదగ్రులయిపోయారు. అయితే బస్సును తొయ్యకుండా లోపల కూర్చున్నవారిలో కొంతమందికి కొత్తగా సీట్లు దురాక్రమణలు చేసినవారితో సాన్నిహిత్యం వుండడం వల్ల అక్కడ జరిగిన విద్రోహానికి సాక్ష్యం కరువైంది. అలాకాని మరికొన్ని చోట్ల కేవలం తన ధర్మ నిరతితో తమ స్వంత సీట్లను సైతం తాత్కాలికంగా తృణప్రాయంగా త్యజించి బస్సు త్రోయడంలో పాలు పంచుకున్న తమ సన్నిహితులకు సీట్లు పోవడం వల్ల తీవ్ర నిరసన వ్యక్తమయింది.

సరిగ్గా ఆ సమయంలోనే కండక్టరు సాగర మథనంలో హాలాహలంలా పుట్టుకొచ్చాడు. అతడు సీట్లకోసం జనం యిలాగే పోట్లాడుకునే పక్షంలో తాను టికెట్లు కొట్టనని, మీదుమిక్కిలి బస్సును ఎక్కను కూడా ఎక్కనని భీషణ ప్రతిజ్ఞ చేశాడు. అంతటితో బస్సులోని వాళ్ళందరూ తమ ఆవేశకావేషాలను పెదవుల బలవంతంమీద, బిగిసిన పిడికిళ్ళమీద, వూగిపోతున్న తనువుల కింద అదుపులో పెట్టుకున్నారు. కండక్టరుకు కన్పించకుండా వాళ్ళు ఒకరిపై ఒకరు కళ్ళతోనే కారాలు, మిరియాలు నూరుకోసాగారు.

చూపులతో బూతులు తిట్టుకో సాగారు. ఈ సంక్షోభంలో సుంచీ కండక్టరు కొమ్మలమీద దాటుకునే కోతిలా, బొరియల్లో దూరే సర్పంలా, గాలిలో పలయాలు తిరిగే తూనీగలా బస్సులోకి ప్రవేశించాడు. వాహనాన్ని కదిలించవలసిందిగా విజిల్ ఊదబోతూ, అంతలోనే ముందు జాగ్రత్తగా డోరు దగ్గర వేలాడుతున్న జనం బస్సులోకి సర్దుకుని డోర్ వేసుకోవలసిందిగా అరచి చెప్పాడు.

బస్సు పూర్తిగా జనంతో కూరుకుపోవడం వల్ల పది పన్నెండుమంది డోరు దగ్గర రైలింగు పట్టుకుని వేలాడుతున్నారు. వాళ్ళకేదైనా ప్రమాదం సంభవిస్తే, అది తన ఉద్యోగానికే ముప్పు అన్న సంగతి కండక్టరుకు తెలుసు. 'ఏముందిలే రెండు మైళ్ళలో దిగేస్తాం, పోనీప్పా' వేలాడుతున్న వాళ్ళు డ్రైవరును ఒప్పించజూశారు. 'మీకేం రెండు మైళ్ళే, నాకు బతుకంతా యిదే బాధ! లోపలికి రండన్నా. జరుక్కోండప్పా, 'కదులు గురూ' కండక్టరు గొంతు రాచుకుబొయ్యేట్టుగా అరవసాగాడు.

బస్సులో గానీ, డోరు దగ్గరగానీ ఏమీ చలనం లేకపోవడంతో కొంతమంది చతురులు బస్సు రేకులమీద డోరు మూసిన శబ్దాన్ని మిమిక్రీ చేసి చూశారు. దానికి లయగా కొంతమంది 'రైట్ రైట్' అంటూ కండక్టరు గొంతును అనుకరించజూశారు. మరికొంత మంది డ్రైవరునుత్సాహపరచడానికి ఊళలు కూడా వేశారు. కానీ బస్సు చేసే అనేకానేక శబ్దాల రహస్యాలు తెలిసిన కండక్టరు, కండక్టరు సహజసిద్ధ బలహీన స్వరం పసిగట్టగల డ్రైవరు ఈ ప్రయత్నాలన్నీ వమ్ముజేశారు.

గేటు దగ్గర జనం యింకా వేలాడుతూనే వున్నారు. చాలనిదానికి డోరు దగ్గర మరి కొంతమంది కొత్తవాళ్ళు చేరి ఊగుతున్నవాళ్ళు లోపలికి పోయి తమకు ఊగే అవకాశం యివ్వవలసిందిగా వేలాడుతున్న వాళ్ళను లోనికి నెట్టసాగారు.

బస్సులోని వాళ్ళు యింకా లోపలికి జరిగి ఒకర్నొకరు మరింత గాఢంగా కౌగిలించుకొని మరీ నిలబడవలసిందిగా గొంతు చించుకుని అరుస్తూ టికెట్లు కొట్టసాగాడు కండక్టరు.

కండక్టరుతో విసిగిపోయిన జనం డ్రైవరునైనా తమకనుకూలంగా తిప్పుకోవడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఒకడు ఏమీ తెలియని నంగనాచిలా కండక్టరు చెప్పకపోతే డ్రైవరు బండి కదిలించకూడదా అని డ్రైవరు అహాన్ని దెబ్బ తియ్యజూశాడు. మరొకడు తాను గతంలో చూసిన కొంతమంది డ్రైవర్ల అద్భుత డ్రైవింగ్ పరాక్రమాలను కథలు కథలుగా చెప్పసాగాడు. ఎందుకైనా మంచిదని మరికొందరు ఈ కండక్టరంత నచ్చు, నిదానం మనిషి మరొకడు లేడని జరుగుతున్న కాలయాపనలో డ్రైవరు పొరబాటు ఆవగింజంతయినా కూడా లేదని వక్కాణించారు.

అయితే డ్రైవరు తన అంతర్ముఖత్వం నుంచీ యిప్పుడిప్పుడే బయటపడే సూచన ఏమీ పొడసూపడం లేదు. కండక్టరు గనుక రైట్ చెబితే మరో పదినిమిషాల్లో బస్సును పూరి శివార్లలో ఆపి, అతడి టికెట్లు కొట్టే కార్యక్రమం పూర్తి అయ్యేలోపు తన శంక తీర్చుకోవచ్చుననే ధ్యాసతో అతడు చాలాసేపట్నుంచీ వేచి చూస్తున్నాడు. కండక్టరు నుంచీ ఎంతకీ గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో అతడు భారంగా నిశ్వసించి క్యాబిన్‌లో నుంచీ దూకేయడం కోసం పైకి లేవబోయాడు. అప్పటికి ప్రయాణీకుల కందరికీ చావు తెలివి వచ్చినట్టయింది. గొర్రెను మింగి కళ్ళు మూసుకున్న కొండచిలువలా బస్సు డోరు మూసుకుంది. పెద్దిపర్తిగుంట బస్సు సాహసోపేతంగా బయల్దేరింది.

7. ఇతి మనుష్యాణాం

గోతులుపడ్డ బస్టాండులో బస్సు కుంటి కుక్కలా పడుతూ లేస్తూ కదిలింది. ఊగిపోతూ ఊడిపోయేటట్టున్న బాడీని అదరగొట్టుకుంటూ డబ్బారేకుల రాక్షసుడిలా కదిలింది. ఒక్కసారిగా పేలిపోతుందేమోనన్నట్టుగా భీకర ధ్వనులు చేస్తూ పరిసరాలనంతా నల్లటి ధూమంతో నింపింది.

సన్నగా, యిరుకుగా, పొడవుగా వున్న రోడ్డుపై సంత జనాన్ని గొర్రెలు దోలుకునే కాపరిలా అదిలించుకుంటూ సాగబారింది. రోడ్డంతా ఎద్దుల బండ్లు, సైకిళ్ళు, లారీలు నడుస్తుండడం వల్ల అడుగడుగునా అడ్డంకుల నెదుర్కొంటూ నడుస్తోంది.

అలా ఒకింతదూరం సాగిన తరువాత బస్సు ఊరి మధ్యగానున్న బ్రిడ్జీమీద ఎదురుగా వస్తున్న లారీని సరిగ్గా పెదవులపైన ముద్దు పెట్టుకున్నంత పనిజేసి ఆగిపోయింది. ఉభయ వాహనాల డ్రైవర్లూ శ్రీ రామాంజనేయ యుద్ధనాటకంలో రామాంజనేయులవలే అంతూ పొంతూ లేని వివాదంలోకి దిగేశారు.

తాను ముందుగానే సిగ్నల్ లైటు వేసి బ్రిడ్జి పైకి వచ్చాననీ, తాను బ్రిడ్జి దాటేవరకూ బస్సు వెయిట్ చేసి వుండవలసిందనీ లారీడ్రైవరు అభియోగం. తనతో రోడ్ సిగ్నల్స్ గురించి అతిగా చర్చించి లాభంలేదనీ లారీడ్రైవర్ వయసంతా తన సర్వీసంత వుండదనీ, ప్యాసింజర్లకు యిబ్బంది కల్గించకుండా వెంటనే లారీని వెనక్కి తీసి తనకు దారి యివ్వమనీ, అందులోనూ తనకు ఆరోగ్యం అట్టే బాగుండకపోవడం వల్ల తన ఉపన్యాసాన్ని యింతకంటే పొడిగించజాలననీ బస్సు డ్రైవర్ సత్తార్‌సాహెబ్ ప్రతివాదం.

దొమ్మరివాళ్ళ సర్కస్సు జూస్తున్నట్టుగా జనం డ్రైవర్ల వాగ్యుద్ధాన్ని చోద్యంగా తిలకించ సాగారు. బ్రిడ్జికిరువైపులా బస్సులు, లారీలు, ఎద్దుల బండ్లు నిలిచిపోయాయి. అటువైపు నుంచీ యిటువైపునుంచీ వచ్చిన వాహనాల అఖిలపక్ష డ్రైవర్ల క్లీనర్ల మహాసభ ప్రారంభ

మైంది. ఇంత జరిగాక, న్యాయం కూడా తన పక్షంలోనే వున్నాక తాను యింక బండిని వెనక్కి తీసే ప్రసక్తే లేదని లారీడ్రైవరు నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. తన నిర్ణయాన్ని మార్చుకునే ఉద్దేశం లేశమాత్రంగా కూడా లేనట్టు సత్తార్ సాహెబ్ గుంపులోనుంచీ మాయమై బ్రిడ్జి క్రిందివైపున ప్రత్యక్షమైపోయాడు. ఆరు నూరు గానీ, అగ్రహారం బుగ్గిగానీ టికెట్లు కొట్టుకుంటూ పచ్చినీళ్ళు కూడా ముట్టనుగాక ముట్టనని ఒట్టు పెట్టుకున్నట్టుగా కండక్టరు వెలుపల జరుగుతున్న సంఘర్షణను పట్టించుకోకుండా టికెట్లు కొట్టుకోసాగాడు.

అఖిలపక్ష డ్రైవర్ల, క్లీనర్ల మహాసభ కన్వీనర్లు తమకు మిగిలిన ఒకే ఒక కక్షిదారైన లారీడ్రైవరును సమాధానపరచడానికి మళ్లీ రెండో రౌండు చర్చలు మొదలుపెట్టారు. న్యాయంగా పోయేవాడికి ఎప్పటికైనా మేలు జరుగుతుందని వాళ్ళు అతడిని సముదాయింపజూచారు. ఇది న్యాయాన్యాయ విచారం చేయవలసిన సమయం కాదనీ, జరిగిన ట్రాఫిక్‌జామ్ నుంచీ వాహనాల గమనాన్ని పునరుద్ధరించవలసిన గురుతర బాధ్యతను గుర్తించి తన ఉచితజ్ఞతను నిలుపుకోవలసిందనీ మరికొందరు నచ్చజెప్పారు. చివరకు సభవారు లారీడ్రైవరుకు శ్రవణ సుభగంగా సత్తార్ సాహెబ్‌ను సామూహికంగా నిందించే ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. 'రైట్', 'రైట్', లెఫ్టుకు, రైట్‌కు, హోల్డన్' అంటూ వాహనాలు ముందుకూ వెనుకకూ కదిలాయి. ఎలాగైతేనేం లారీడ్రైవర్‌పైన విజయం సాధించిన సత్తార్ సాహెబ్ శంకారహితుడై వాహనారోహణం జేసి తన రబ్బరు శంఖాన్ని గంభీరంగా పూరించాడు. పెద్దపర్తిగుంట బస్సు ప్రయాణం పునఃప్రారంభమైంది.

యిరుకుగా వున్న వీధిలో అంగళ్ళు, అంగళ్ళ తాలూకు టార్పాల్ గుడారాలు మరింత ప్రదేశం ఆక్రమించి వీధిని మరింత యిరుకుగా జేస్తున్నాయి. ఈ దురాక్రమణలను అవరోధించి దారిని విశాలం చేసే ప్రయత్నం ఒకటి చాలా రోజులనుంచీ ప్రభుత్వం వారి ఆలోచనలో వున్నట్టు, అలా కుదరని పక్షంలో ఊరికవతల బైపాస్ రోడ్డు వేయక తప్పదని బస్సులో ఎవరో చెప్పుకుంటున్నారు. అలా బైపాస్‌రోడ్డు గనక వేయవలసి వస్తే అంగళ్ళవాళ్ల కందరికీ పూర్తి నష్టం రావచ్చుననీ, రోడ్డు యిలాగే విశాలం జేస్తే మహా అయితే సగం వంతు అంగళ్ళ వాళ్ళ జాగాలు మాత్రమే పోతాయనీ, అయితే వ్యాపారులందరూ సగం మంది లాభాలకంటే సామూహిక నష్టానికే యిష్టపడుతున్నట్టు కబుర్లలో తేలింది.

బస్సు మెయిన్ రోడ్డు దిగి, పెద్దపర్తిగుంట మట్టిబాటలోకి మళ్ళే లంబకోణపు మలుపులో తిరగడానికి నానా యాతనలు పడుతోంది. ఈ కార్యక్రమంలో యథాప్రకారం పెంకుటింటి తాలూకు మరో రెండు పెంకులు జారిపడ్డాయి. ఇంటిగల్లవాళ్ళు వెలుపలికొచ్చి ఈ

బస్సులకెప్పుడు పోయే కాలం దాపురిస్తుందోగానీ, తమ కొంప కూల్చకుండా అవి నిద్రోయేట్టు లేదని, పాపాల భైరవుడు సత్తార్ సాహెబ్‌ను అతడి సకల స్త్రీ జనాల శీలాలను శంకిస్తూ బూతులు తిట్టసాగారు. బస్సు విఘ్నేశ్వరుడి గుడి దగ్గర మరో మలుపు తిరిగి, ఊరి పక్కగా ప్రవహిస్తున్న చిన్నవాగుపైన కట్టిన కల్వర్టును దాటుకుని చింతతోపును సమీపిస్తోంది.

కండక్టరు టిక్కెట్లు కొట్టే యజ్ఞం సగం పూర్తయింది. అతడు మనుషుల శరీరాల మధ్య పాతిపెట్టినట్టుగా యిరుక్కుపోయి, కండరాల మధ్య రక్తనాళంలా కదులుతున్నాడు. అత్యుష్ణపూరితమైన పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడిలా, మండుటెండలో పొలం దున్నుతున్న కర్షకుడిలా, అతడి శరీరం చెమటతో దొప్ప దోగుతోంది. అతడు మనుషుల్ని రెండు చేతుల్తోనూ వెనక్కి త్రోసుకుంటూ జనం జలధిని ఈదుకుంటూ ముందుకి వస్తున్నాడు. ఒక చేత్తో క్రెడిల్ నుంచీ టికెట్లను చింపుతున్నాడు. ఒక చేత్తో నోట్లు లెక్క పెడుతున్నాడు. ఒక చేత్తో టికెట్లను పంచ్ చేస్తున్నాడు. ఒక చేత్తో తోలు సంచీ లోంచీ చిల్లర గలగరించి తీస్తున్నాడు. ఒక చేతివేళ్ళ మధ్య నోట్లను దొంతరగా బిగించాడు. ఒక చేత్తో హఠం వేసుకున్నట్టుగా స్వస్థలాల్లో బిగుసుకుపోయిన మనుషుల్ని వెనక్కి నెడుతున్నాడు. ఒక చేత్తో నిద్రపోతున్నట్టుగా జోగుతూ టికెట్లు కొనకుండా, ఎగవేయజూస్తున్న వాళ్ళను తట్టి లేపుతున్నాడు. కండక్టరు అనేక హస్తాలతో విశ్వరూపం ధరించిన కార్తవీర్యార్జునుడిలా వున్నాడు.

"ఏవయ్యో, ముసలాయనా! నువ్వు మీ వూరికే టికెట్టు తీసుకుంటావో, అంతకంటే ముందు పైలోకానికే టికెట్టు తీసుకుంటావో తెలీటం లేదే" కండక్టరు తిమ్మరాయప్పపైకి లంఘించి అతడిని పట్టికుదేశాడు.

తిమ్మరాయప్ప ఒకానొక సీటు వెనక కమ్మీని పొదివి పట్టుకుని దాదాపు దానిమీదే వొరిగిపోతున్నట్టుగా నిలబడి వున్నాడు. అతడి వూతకర్ర కూడా ఆ క్షణంలో అతడిని దగాజేసి ఏదో మూలకు జారుకున్నట్టుంది. అప్పటి కతను తిండి తిని యిరవై నాలుగు గంటలు పూర్తికావస్తోంది. ఆజన్మాదిగా అనుభవిస్తున్నదే అవటం వల్ల ఆకలి అతడిని ఏమంత ఎక్కువగా బాధించే అవకాశం లేదు. కానీ నిజమైన యాతన ఏమంటే జనం అతడిని నల్లిని నలిపినట్టుగా నలిపేస్తున్నారు. ఫుట్ బోర్డు మీద నిలుచుకోవడానికి అతడి పాదాలకు పట్టు దొరకడం లేదు. మోకాళ్లతో, మోచేతులతో కుమ్మబడి అతడి పక్కటెముకలన్నీ నుగ్గు నూచం అయిపోతున్నాయి. కండక్టరు పరాచికంతో అతడు తేరుకుని టికెట్టు కొనడానికి వుద్యుక్తుడయ్యాడు. అతడి మనస్సులో ఉద్దేశమైతే తొందరగానే కలిగింది

గానీ, శరీరంలో చలనం కల్గడానికి యింకా కొంత వ్యవధి కావలసి వుంది. మనుషుల మధ్యలో యిరుక్కుపోయిన అతడి చేయి ఎలాగో పైకి లేచింది. అది చుట్టుపక్కలనున్న యిద్దరి ముగ్గుర్ని తోసుకుని అతడి నడుము దగ్గరికి రావాలి. నడుముకు కట్టుకున్న రొండిని విప్పాలి. అందులో అతడి ఆస్తి తాలూకు పత్రాలున్నాయి. ఆ ఆస్తిని అనుభవించేందుకు ప్రభుత్వానికి చెల్లిస్తున్న కిస్తీ రశీదులున్నాయి .టికెట్టుకు సరిపడేటంత చిల్లరుంది. అతడు కట్టెపుల్లల్లాంటి తన చేతి వేళ్ళతో చిల్లర తడుముకోసాగాడు.

ముసలివాడి అవస్థను కొన్ని సెకండ్లపాటు సానుభూతితోనే చూశాడు కండక్టరు. మరికొంత వ్యవధి కూడా అతడికిచ్చే ఉద్దేశంతో బలంగా నిశ్వసిస్తూ జనాన్ని ప్రక్కకు తోసి కిటికీగుండా బస్సు ఎక్కడికొచ్చిందో చూశాడు. ఇంకేముంది? నెక్ట్స్ స్టేజీ రాబోతోంది. ఇంకా సగం బస్సుకు టిక్కెట్లు కొట్టవలసి వుంది. షాక్ కొట్టినట్టుగా 'హోల్డాన్' అని గావుకేక పెట్టి, 'కొంచెం నిలుపుకో గురూ' అంటూ డ్రైవరుకు అరిచి చెప్పి, తిమ్మరాయప్ప కేసి అసహనంగా చూస్తూ 'ఈ సచ్చేకాలానికి నువ్వు ఈ బస్సుల్లో రాకపోతే ఏమి పెద్దాయనా? యింట్లోనే బడి సావరాదా? నువ్వు టికెట్టు తీసేకాడికి నాకు ఈడనే తెల్లారిపోయేట్టు ఉందే' అన్నాడు. అప్పటికి అతడు వైరాగ్యంతో ముక్కు మూసుకోవాల్సిన వయస్సులో విషయలోలువుడై పడుచు పెళ్లాల్ని తీసుకుని హనీమూన్ వచ్చినంత హీనమైన పనిజేసినట్టుగా చుట్టూ వున్న జనం తిమ్మరాయప్ప కేసి విసుగ్గా జూశారు.

తిమ్మరాయప్ప గుప్పిటితో చిల్లర తీసి కండక్టరు చేతిలో పోస్తూ "పెద్దపర్తిగుంటకు ఒక టిక్కెట్టు యియ్యి సార్" అన్నాడు.

"బస్సు పెద్దపర్తిగుంటకు పోదు. సంగనపల్లి దాకా పోతాది. టిక్కెట్టు యింద" కండక్టరు తిమ్మరాయప్ప చేతిలో టిక్కెట్టు కుక్కి ముందుకు కదిలాడు.

"అదేవిటండీ, నేమ్‌బోర్డు మీద పెద్దపర్తిగుంట అనేగా రాసుంది! మళ్ళీ అక్కడికి వెళ్ళదంటాడేవిటి" రమణమూర్తి ఆదుర్దాగా అడిగాడు.

"అదేమోసామీ, బస్సిప్పుడు సంగనపల్లి దాకానే పోయేది" ప్రశ్నకు ప్రశ్నే జవాబుగా బదులిచ్చాడు అత్తినీరాలు.

"ఆడికి మేలే గదా! అంతకుముందు కేంపు కాడికే వచ్చిపోతా వుండింది" మరొక ప్రయాణికుడు తాము ఇందుకే సంతోషించవలసి వున్నట్టుగా తేల్చేశాడు. కండక్టరు నలుగురయిదుగురు మనుషుల్ని దాటుకున్న తర్వాత తిమ్మరాయప్ప తనకు అతడి దగ్గర్నుంచీ చిల్లర డబ్బులు రావలసి వుందని గ్రహించాడు. తననేమాత్రం పట్టించుకోని జనాలతో అతడు తనకు రావలసిన చిల్లరను కండక్టరు దగ్గర్నుంచీ యిప్పించవలసిందిగా ప్రాధేయ పడసాగాడు.

టికెట్టు కొట్టడం కోసం బస్సు మళ్ళీ నిలిచిపోవడంతో లోపల ఉక్కపోత మళ్ళీ ప్రారంభమైంది. బిడ్డను చంక మార్చుకుంటే బావుంటుందనే చిన్న కోరిక తీరకపోవడం వల్ల సుభద్ర నడుమునొప్పితో బాధ పడుతోంది. ఒంటిపల్లె కోమలమ్మ తన పక్కసీట్లో కూచొని వున్న లచ్చిగానిపల్లి జగదాంబతో కొంచెం సర్దుకుని తనకు కూడా కొన్ని అంగుళాల సీటు యిప్పించి మానవత్వాన్ని నిరూపించుకోవలసిందిగా నిలదీస్తోంది. 'మనం మనం ఆడోళ్ళే ఆమాత్తరం సర్దుకోకపోతే ఎట్లక్కా' అంటూ ఆమె అప్పటికే తనకు సీటు లభించినట్టుగా వంగివంగి లేస్తోంది.

సీట్లో కూరుకుపోయిన పోస్టయ్యవారు అప్పటికే తనకు నచ్చిన కీర్తనలన్నింటినీ కూనిరాగాలుగా తీసేసి, తిమ్మిరెక్కిన కాళ్ళను అదుపులోకి తెచ్చుకోవడానికి పైకి లేచాడు. వసంతనాయని వారికది ఆయన తనకు అర్ధాసనం యిచ్చి గౌరవిస్తున్నట్టుగా అన్పించడంతో ఆనందంగా ఆ జాగాలో కూలబడిపోతూ చాలని దానికి సీటు యిచ్చి తన విధేయతను తెలుపుకున్న ఆశ్రితుడిని మన్నన జేస్తున్నట్టుగా పోస్టయ్యవార్ని మధ్యలోకి లాక్కున్నాడు. ఇద్దరి భారీకాయాలు రాపిడికి గురి అవడంతో సీటుమీద అవతల కూచొన్న మరియిద్దరి పరిస్థితి కూడా గడ్డుగా తయారైంది. వసంతనాయని వారు కొలువు దీరుతూనే తన ప్రసంగానికి ముందుమాటగా "మనం ఒకరికి మేలు చేస్తే మనకు ఆ పరమాత్ముడే మేలు చేస్తాడు గదన్నా" అని, ఆ తర్వాత "సుఖమా, మన రాజ్యమెల్లా" అనేట్టుగా తన నర్మసచివుడు లింగయ్యతో లోక వ్యవహారాల చర్చ ప్రారంభించాడు. పోస్టయ్య వారికిప్పుడు ముఖారిలో విలపించాలన్నా వీలు అయ్యేట్టు కన్పించడం లేదు.

ఇంతలో ఒక స్త్రీ బస్సెక్కితే తనకు వాంతులు అవుతాయని, తక్షణమే సీటు యివ్వని పక్షంలో తాను ఏ క్షణమైనా, ఎవరిపైనయినా వాంతి చేసుకోవచ్చునని తన చుట్టూవున్న వారిని భయపెట్టసాగింది. కేవలం సీటు సంపాదించుకోడానికే ఆమె యిల్లా దొంగెత్తు వేసిందని కొంతమంది ఆమె ప్రతిపాదనను వీటో జేయజూసినా, మరీ ఆమెకు దగ్గరగా కూర్చొన్నవారు అతిజాగ్రత్తగా ఆమె ముఖంలో మారుతున్న రంగులకేసి చూడసాగారు. ఆమె ముఖ కవళికలు రానురానూ మారుతున్నాయి. ఆమె రాబోతున్న వాంతిని ఆపుజేసుకోవడానికి ప్రయత్నిస్తోందో, రాని వాంతి వస్తున్నట్టు అభినయిస్తోందో తెలియక ఆమె చుట్టూ వున్న ప్రయాణీకులు గాభరా పడసాగారు. ఆ ఏడుకొండలవాడి దయవల్లే తనకీదినం బస్సులో సీటు కూడా లభించిందన్న ఆనందంతో సీమేగౌడు మునివెంకటప్పతో తిరమలకొండ యాత్రావిశేషాలు చెబుతున్నాడు. లీడరు సీమేగౌడ్ కొండమీద నుంచీ తెచ్చిన ప్రసాదపు సంచిని తన దగ్గరకు లాక్కుని, వాగులో బండల కింద కొరదలు

పడుతున్నవాడిలా, సంచినంతా తడుముతూ సంభ్రమాశ్చర్య విభ్రమాలతో గుడ్లు మిటకరించసాగాడు.

కండక్టరు టికెట్లు కొట్టే కార్యక్రమం పూర్తికావస్తోంది. కేవలం టికెట్టు కొట్టడం మట్టుకే అయితే పది నిమిషాల్లోనే ఎంతటి రద్దీగా వున్న బస్సులోనైనా ఆ పని పూర్తిచేయగలడు. కానీ అతడు అడుగడుక్కు అనేక ఆటంకాలను ఎదుర్కొంటున్నాడు.

లగేజీ విషయమై అతడు అప్పుడే ఒకరితో పేచీబడి, యిప్పుడు మరోకొత్త సమస్యను ఎదుర్కొంటున్నాడు. ఒకావిడ తన పిల్లల్నందర్నీ సీట్లకింద దాచేసి కేవలం తాను ఒక్కతె మాత్రం టిక్కెట్టు కొనుక్కునే ప్రయత్నంలో వుంది. అప్పటికీ కండక్టరు తనకు కన్పించని వారినందరినీ వదిలేశాడు. ప్రస్తుతం అతడి బాధంతా ఒక పూర్తి సీటు ఆక్రమించుకు కూర్చున్న ఆమె పెద్ద కూతురి గురించి.

"ఇంకా ఆ బిడ్డకు అర్ధటికెట్టంటే ఎట్లమ్మా? పెండ్లయ్యి ఆ బిడ్డకు యింకొక బిడ్డ పుడ్తేగానీ పూర్తి టికెట్టు కొనవా, ఎట్లా?" కండక్టరు ఆక్రోశించసాగాడు.

టికెట్టు ఎలా కొనకుండా పోవడమా అని ఆలోచిస్తున్న ఆవిడకు దైవకృప వల్ల తగిన కారణమే దొరికింది. అప్పటికి కండక్టరు ఏదో అశ్లీల పదజాలంతో తన గౌరవ మర్యాదలను కాలరాచేస్తున్నట్టు ఆవిడ మండిపడిపోతూ "ఏమి కండక్టరవయ్యా నువ్వు! ముందు ఆడోళ్ళతో మాట్లాడ్డం నేర్చుకో" అంటూ రెచ్చిపోసాగింది.

కండక్టరు తాను కొట్టదలచుకున్న టికెట్లను కొట్టి, చిల్లరతో సహా వాటిని ఆమెమీదికి గిరవాటు పెట్టి, ద్వారంలో నుంచీ ఈవలపడి, టాపుమీద ముషాయిరా ప్రారంభించబోతున్న వారికి టికెట్లు కొట్టడం కోసం నిచ్చెన ఎక్కసాగాడు.

పది పదిహేను నిమిషాల తర్వాత పెద్దపర్తిగుంట బస్సు మళ్ళీ బయల్దేరింది. సువిశాలంగా పరుచుకున్న బండరాళ్ళ మైదానాల మధ్య నుంచీ వంపులు తిరిగి సాగుతున్న మట్టి బాటమీద బస్సు నెమ్మదిగా ప్రయాణం చేస్తోంది.

పడమటి కొండలపైన బంగారం కుమ్మరిస్తున్నట్టుగా సూర్యుడి పసిమి కాంతులు వ్యాపిస్తున్నాయి. బస్సు వెళ్తున్నంత మేరా ఎర్రటి దుమ్ము ఆకాశంలోకి లేస్తోంది. అది బాటకిరువైపులా వున్న కళ్ళి చెట్లమీద దళసరిగా పేరుకుపోతోంది. కళ్ళలో దుమ్ము పడ్డం చేత అరిచేతితో బాగా నులుముకుని ఎర్రగా చేసుకున్నాడు రమణమూర్తి. గొంతంతా దుమ్ము వ్యాపించడంతో అతడు దగ్గుతో ఊపిరాడక సతమతమవసాగాడు. బస్సు టాపుమీద కూర్చున్నవాళ్ళు దిట్టంగా తలగుడ్డలు బిగించి పైకి లేస్తున్న ఎర్రటి ధూమంలో హోమం చేస్తున్న మంత్రవేత్తల వలె ఊగిపోతూ మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ మాటలు బలంగా

ప్రారంభమై గాలిలో తేలి చివరకు బలహీనంగా ముగుస్తున్నాయి. ఒకరి మాటలు ఒకిరికి విన్పించకపోవడం వల్ల వాళ్ళు ఒకే విషయాన్ని పలుమార్లు తిరగ జెప్పుకుంటున్నారు.

సాలచింతనపల్లె సింగిల్ టీచర్ కందసామి దాదాపు అరగంట సేపటినుంచీ కాళ్ళ కిందకు ఫుట్‌బోర్డు దొరక్క, చేతులకు రైలింగ్ దొరక్క నడుము ఆనించడానికి బలమైన శరీరం దొరక్క వెదురుబుట్టలో వరిగడ్డి వేసి మాగబెట్టిన మామిడి పండులా మగ్గిబోతున్నాడు. ఉన్నట్టుండి తలవని తలంపుగా అతడికి నడుముకు ఆధారంగా ఒక మూట దొరికింది. అది రెండు సీట్లకు మధ్యగా మనుషులు నడిచే దారి కడ్డంగా వేసిన యూరియా మూట. ఘాటైన దాని వాసన గుండెల్లో వికారం పుట్టిస్తుండడంతో కందసామి భుజం మీది సవకందీసి ముఖం చుట్టూ కప్పుకున్నాడు. ఇలా పరిసరాల రంగు, వాసన, గాలి, వాతావరణం లాంటి ఈతిబాధల్ని గురించి ఆలోచిస్తూ కూచొంటే దారి జరిగినట్టే. ఇట్లాంటి సమయాల్లో పక్కనున్న వాడినెవడినైనా బొట్టుపెట్టి చర్చలోకి లాక్కురావడమొకటే గత్యంతరం. అతడు తన పక్కనున్న ముని వెంకటప్ప పైకి మొదటి అస్త్రాన్ని సంధించాడు.

"ఏమి వెంకటప్పో, సంత సంతంతా నీ సంచిలోనే వేసుకుని వచ్చేస్తుండావే!"

"ఎందుకు జెప్తావులే అయ్యోరా, ఆ మాట! సంతలో ఏది పట్టుకున్నా అగ్గిమాదిరి ఉండాది. కిరసనాయిలు, సెనిగనూనె, సింతపొండు, బేళ్ళు, బీడీలు, వక్కపేళ్ళు, దుగ్గు... ఏది కొనేట్టుగా వుంది జెప్పు. అయినా ఈ కొప్పం సంతంత మిడిమేలపు సంత ఈ భూపెపంచకం మీద యింకొకటుండదు. ఈడుండే రేటు వోల్ యిండియాలో యాడా వుండదు. ఫలాతన్ బిడ్లనుకో - సాగేటట్టుగా వుంటే నీ తలను దమ్మిడీ కడగుతారు. ఏమారినావనుకో నీ దగ్గరుండే గుర్రాన్ని గాడిద యెలకు కొనేస్తారు. వాడు కొనిన గాడిదనే గుర్రంగా మార్చేసి నీకే అమ్మేస్తారు. బూమ్మీద పడిన కాడ్నించీ గుంతలోకి పొయ్యేదాకా మట్టి పిసికి, రాళ్ళు కొట్టి, సేద్యాలు జేసి మేము సంపాదించే వొరవంతా ఈ సంతలోనే బడి బస్మమైపోతావుండాది. కండ్ల ముందరే కనుకట్టు జేసేస్తారు. మసి బూసి మారేడుకాయ జేసేస్తారు. నా కొడుకులు, మట్టిని మంత్రించి బంగారం చేసిచ్చేస్తారు. ఆడదాన్ని సూపించి నీ దగ్గర రాయికి బొట్టు కట్టిచ్చేస్తారు. యిట్టా యిపరీతమయిన సంత ఈరేడులోకాల్లో ఎదికి సూసినా వుండదు" ముని వెంకటప్ప ఏవగింపుతో నోటిలో కొచ్చేస్తున్న దుమ్మును కేకరించి కిటికీగుండా ఉమ్మేశాడు.

ఆ ఉమ్ము బస్సులో వెనుక కూర్చున్న వాళ్ళమీద పడడంతో వాళ్ళందరూ బస్సుముందు సీట్లలో కూర్చున్నవారికి వెనుక సీట్లలో కూర్చున్నవారిపై క్షణక్షణానికి పెరుగుతున్న అలక్ష్యం, అమర్యాద నశించాలని దుమారం లేవదీశారు. అయితే మధ్యలో కూర్చొన్నవారు తాము

ఎటు మొగ్గాలో తేల్చుకోలేకపోవడం వల్ల దుమారం అంతలోనే చప్పబడిపోయింది. ఎదురుగాలికి మిట్టనెక్కలేక బస్సు చేస్తున్న భీకర శబ్ద పోరాటం వల్ల సంభాషణలకు అంతరాయం కల్గుతోంది.

ముని వెంకటప్ప మాటలకు చకితులైపోయినట్టుగా అతడి చుట్టూ వున్న జనం కొంతసేపు స్తబ్ధులై పోయారు.

"నాయినా, కొన్ని ఏండ్లుగా నేను సంతలు జూస్తానే వుండా! పలమనేరు సంత జూస్తి. పుంగనూరు సంత జూస్తి. వీకోట సంత జూస్తి. బైరెడ్డిపల్లి సంత జూస్తి. మాలూరు జూస్తి, కామసముద్రం జూస్తి. తిరపత్తూరు జూస్తి. వరప్పం జూస్తి. కృష్ణగిరి జూస్తి. ఒకటనేమి, ఈ పక్కుండే సంతలన్నీ దిరిగి దిరిగి జూస్తి. ఒక సంతలో వుండే వెల ఒక సంతలో లే. ఒక సంతలోనే ఒక తావునుండే రేటు ఒక తావున లే. ఒకే తావున ఒకప్పుడుండే రేటు ఇంకొకప్పుడు లే. సంత యాపారం చేసి కొంతమంది కోటీశ్వరులై పోయుండారు. కొత్తపేటలో పాచ్చా సాయిబు తెల్సునా? ఒకప్పుడు వాడు నాతో కూడా సంతల్లో సత్తు సామాన్ల యాపారం జేస్తా వున్నోడే! వాడు తొలితొలీగ గంపలో ఉప్పుచేపలు పెట్టుకోని పల్లెలమీద పోయి అమ్ముకుంటూ వుండె. మరికొన్నాళ్ళు తలమీద సవకాలు, పంచలు పెట్టుకొని తిరగతా వుండె. మళ్ళ కొన్నాళ్ళకు సైకిలు మీద సత్తు సామాన్లు, స్టీలు బోకులు వేసుకొని పోతావుండె. వాడికి ముందునుంచీ యాపారం జేస్తావుండే నేను యింకా ఈ సత్తు సామాన్లలోనే బడి అల్లాడతా వుండా – యిప్పుడు వాడికి తిరుపత్తూరులో వుండే జవుళంగడి ఎవుడికుండాది? తిరుపత్తూర్లో గానీ, కృష్ణగిరిలోగానీ యిప్పుడు వాణ్ని కొట్టేవాడెవడు? అదంతా వాని రాతప్పా–" కోటపల్లె వీరభద్రస్వామి తన తలపోరాతనంతా బహిరంగంగా వెళ్ళబోసుకున్నాడు.

"అది వాని రాత! మన రాత సూడు. మనకు పంట పండినపుడు యెలవుండేది లే. యెల వుండేటప్పుడు పంట పండేది లే. సమ్మత్సరానికి సమ్మత్సరానికీ జమీన్లు గొడ్లు అన్నీ అమ్ముకోని బోతావుండాము. ఇంక మనం మిగిలి మిట్టన బడేదెప్పుడు?" మరొక ఆసామి నిట్టూర్చాడు. నెగడులో పడి చిట్లుతున్న సమిధల్లా అతడి చుట్టూ మరికొన్ని నిట్టూర్పులు రేగాయి.

"నీతిగా పొయ్యేవానికి ఏ యాపారమూ అచ్చిరాదు. ఏదైనా పక్కనున్నోణ్ణి ముంచేవాడికే లాయకీ. పాచ్చాసాయిబొకడు పెద్దోడైనాడంటే ఎంతమంది పకీరు సాయుబులైపోయిండారో, ఏమో! పాపం, పుణ్యం ఎవురు దలస్తా వుండారు? ఎవరికి దొరికింది వాడు యింకొకని కంట్లో పడనీటంలే! జవురుకోని పోతా వుండారు. ఏందో ఈ ప్రపంచమే స్థిరమైనట్టు

ఎవురూ యిహంపరం సూడటంలే. ఆడికి ఏమో ఈ బూమ్మీదే యెల్లకాలం గుణాతం దీసుకోని వుండేటట్టు వుండారు గదప్పా –" అని ముక్తాయించి బస్టాండులో అరివీర భయంకరంగా పోరాడి గెలుచుకున్న తన సీటును తృణప్రాయంగా త్యజించేస్తూ కోటపల్లె దగ్గర దిగడానికి లేచి నిలబడ్డాడు వీరభద్రస్వామి. కూర్చున్న సీటు దగ్గర్నుంచీ బస్సు డోరువరకూ వున్న మనుషుల్నందర్నీ తోసుకుని పోయే లోపల స్టేజి వచ్చేయాలి. అదీ వీరభద్రస్వామి పాలసీ. బస్సు నిలిచాక అడ్డొచ్చే ముసలీ ముతకా, పిల్లా, జెల్లా మూట ముల్లే – యిన్నీ అడ్డంకుల్ని దాటుకుని ఆలస్యంగా బస్సు దిగడమంటే అతడికి నచ్చదు.

వీరభద్రస్వామి లేవడంతో ఏర్పడిన ఖాళీజాగా వల్ల ఒంటిపల్లె కోమలమ్మకు, జబ్బిగానిపల్లె జగదాంబకు మరింత విశాలంగా యిరుక్కొని కూర్చోవడానికి తగినంత స్థలం లభించింది. దిగిపోతూ వీరభద్రస్వామి వెల్లడించిపోయిన మాటల్లోని అంతరార్థాన్ని వాళ్ళు అంది పుచ్చుకున్నారు. అతడి తాత్విక దృష్టికి మరింత పదును బెడుతూ వారు కొత్త కొత్త సిద్ధాంతాలు, సారాంశాలు వెలికిదీయసాగారు.

"అందుకే గదక్కా సినుకు నేల రాలటంలే. అందుకే గదక్కా రాను రాను తాగను నీళ్ళు దొరకడంలే. బగమంతుడు ఒకడుండాడు గదా! వాడు ఎన్నని ఓరస్తాడు జెప్పు. పాతకం పెరిగిపోతా వుండాది. ఇంక జనాలు, వంశాలు అంతా నశించిపోతాయి. ఊళ్ళు మశానాలు అయిపోతాయి."

భయంకరమైన భవిష్యద్దర్శనంతో వాళ్ళ చుట్టూ వున్న వాళ్ళందరూ నిశ్చేష్టులై చూపుల్ని దిగంతాలకు సారించి, చిగురు గుంట బంగారు గనులపైన అస్తమిస్తున్న పసిడి కాంతుల వంక తదేకంగా చూడసాగారు. గోధూళి వేళ, కోటపల్లె ముందరి మర్రిచెట్టు కిందకు నలువైపుల్నుండీ గొర్రెల మందలు వచ్చి ఆగుతున్నాయి. బస్సింకా స్టేజి దగ్గరకు రాకముందే అక్కడక్కడ కొంతమంది పైకి లేచి కిటికీల గుండా తలలు వెలుపలికి పెట్టి "ఏమప్పా, నంబ కురిగళు మణికి బందిదా?" అంటూ వారి వారి గొర్రెలకై తాపత్రయపడసాగారు. చింపిరి తలలతోనూ, మట్టిగొట్టుకుపోయిన శరీరాలతోనూ కొంతమంది పిల్లలు నగ్నంగానూ, అర్ధనగ్నంగానూ చెట్టు కింద నిలబడి బస్సు వస్తున్న దిశ కేసి చూస్తూ చప్పట్లు కొడుతున్నారు.

వీరభద్రస్వామి డోరు సమీపిస్తున్నాడు. అతడు బండరాళ్ళ మధ్య కొండవాగులా సాగుతున్నాడు. కొండనెరియల్లో నలికిరిలా కదులుతున్నాడు. పద్మవ్యూహాన్ని ఛేదిస్తున్న అభిమన్యుడిలా ముందుకు దూసుకుపోతున్నాడు. కోటపల్లెలో దిగే జనం అక్కడక్కడ పైకి లేస్తున్నారు. ఇంకొద్ది క్షణాల్లో కొన్ని సీట్లు ఖాళీ అయ్యే సూచనలు కన్పిస్తున్నాయి.

బస్సు టాపుమీద పడిగాపులు బడుతున్నవాళ్ళు కొంతమంది లోపలికి రావచ్చు. బస్సులో మరీ యిరుక్కొని నిలుచున్నవాళ్ళు కొంత విశ్రాయంగా నిలబడవచ్చు. నిలబడి, నిలబడీ కాళ్ళు పీకుతున్న వాళ్ళు యించుక సేపు కూచోవచ్చు. మనుషులు దిగడానికి సన్నద్ధులౌతున్న ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి ఏర్పడుతోంది. ఖాళీ కాబోతున్న సీట్ల చుట్టూ జనం కుదించుకుబోతున్నారు. కొంతమంది సీట్ల వెనుకభాగంలో చేతులేస్తున్నారు. కొంతమంది దూరం నుంచి సీట్లపైకి తువ్వాళ్ళు విసిరేస్తున్నారు. ఇంకొంతమంది వారి సీట్లు తమకు అట్టిపెట్టవలసిందిగా దిగబోతున్న ప్రయాణీకులకు అరచి చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత అభ్యర్థుల అకాల మరణం వల్ల ఖాళీ అయిన విధాన సభలకు జరిగే ఉప ఎన్నికల సంరంభం చెలరేగింది.

కోటపల్లెలో బస్సు ఆగింది. అప్పటికే ఒంటికాలుతో ఫుట్‌బోర్డు మీదినుంచీ నేల మీదకు దిగడానికి విమానంలా ఆయత్తమైన వీరభద్రస్వామి చివాలున కిందికి దూకి తువ్వాలును దులిపి భుజంమీద వేసుకున్నాడు. ఏరు దాటుతూనే తెప్ప తగలేసే వాడిలా చరాలున బీడి ముట్టించి అగ్గిపుల్లను రోడ్డుమీదకు విసిరేశాడు. అంతలో ఒకావిడ కండక్టరు తనకివ్వవలసిన పదిపైసల కోసం డోరు దగ్గర ఘెరావో చేస్తోంది. కేవలం పది పైసలకు పాలు మారేటంతటి నీచుడ్ని గాదని కండక్టరు ఆమెను దబాయిస్తున్నాడు. తనకు యివ్వ వలసిన పది పైసలు తనకు యిచ్చేస్తేనేగానీ ఆ మాటను తాను నమ్మజాలనని ఆమె సవాలు చేస్తోంది. ఆసరికే కొంతమంది ప్రయాణీకులకు కండక్టరు పట్ల సదభిప్రాయం సన్నగిల్లింది. చిల్లరకు బదులుగా టికెట్ల వెనుక చిల్లర మొత్తాలను రాసి పుచ్చుకున్న వాళ్ళు తమ టికెట్లను గాలిలోకి జెండాల్లా వూపుతూ చిల్లర యివ్వని కండక్టరు అవినీతి నశించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు.

టికెట్టుకు సరిగా చిల్లర తెచ్చుకోవలసిన బాధ్యత ప్రయాణీకులదేనని, తననేమి దేవుడు చిల్లర కాసే వృక్షంగా సృష్టించలేదనీ, యింతకంటే తనను బలవంతపెట్టిన పక్షంలో తాను బస్సు దిగి సత్యాగ్రహం పాటించవలసి వస్తుందనీ బస్సులోని వారిని భయపెట్ట జూశాడు. చిల్లర యివ్వబడని ప్రయాణీకుల సంఘానికి తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎన్నికైన ఆవిడ తన కేసును తక్షణమే పరిష్కరించకపోయినట్టయితే కండక్టరు తీవ్రమైన పరిస్థితులు ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించింది.

పది పైసల కోసం దాదాపు అయిదు నిమిషాలు రగడ సాగింది. అయితే కేవలం యిది పది పైసలకు మాత్రమే సంబంధించిన సమస్య కాదనీ, దేశం మొత్తంమీద వ్యాపించి పోయిన అవినీతి వృక్షాన్ని అమూలాగ్రంగా పెకలించడానికి యిది ప్రారంభమనీ లీడరు

చి.యి.ప్ర.సం.తా. అధ్యక్షురాల్ని అభినందించాడు. కండక్టరు దగ్గర నుంచీ చిల్లర లభించిన ప్రయాణీకులు మాత్రం ఈ చిల్లర వ్యవహారం పట్ల అమిత నిరాసక్తంగా వున్నారు. వారిలో కొంతమంది ఈ రగడ తొందరగా పరిష్కారమైతే యిళ్ళకు చేరుకోవచ్చుననే ఆతృతతో వున్నారు. ఇంక కొత్తగా తాను చెప్పవలసిందేమీ లేదన్నట్టు కండక్టర్ ఎస్.ఆర్. తీసుకుని దానిపై పెన్సిలుతో టికెట్టు నెంబర్లు నోట్ చేసుకోసాగాడు. కండక్టరుతో యిక మాట్లాడి ప్రయోజనం లేదని గమనించిన మధ్యవర్తులు కొందరు చి.యి.ప్ర.సం.తా. అధ్యక్షురాల్ని తమ అందరి సంక్షేమంకోసం తన పది పైసలను త్యాగం చెయ్యవలసిన అగత్యం గురించి సవరింప జూశారు. వ్యవహారం యింకా పొడిగింపబడిన పక్షంలో తమ యిండ్లదగ్గర తాము ఎదుర్కొనవలసివచ్చే విపత్కర పరిస్థితులను కూడా వాళ్ళు ఆమె దృష్టికి తీసుకుని వచ్చారు. జటిలమైన యిట్టి సమస్యలకు బలప్రయోగమొక్కటే గత్యంతరమని నమ్మిన తీవ్రవాదులు కొందరు తమ వామపక్షాలతో ఆమెను ఈడ్చి బస్సు కిందికి లాగేశారు. బస్సు కదలింది. చిల్లర యివ్వబడని ప్రయాణీకుల సంఘం మాజీ తాత్కాలిక అధ్యక్షురాలు బాట మధ్యలో నిలబడి కండక్టరు సహితంగా బస్సులోని యావన్మందినీ వారి పూర్వుల్నీ బంధుమిత్రుల్నీ సమస్త పరివారాన్నీ శాపనార్థాలు పెడుతూ రెండు చేతుల్తోనూ దుమ్మెత్తి పోయసాగింది.

తిట్టినంతసేపు తిట్టి ఆమె కోటపల్లె దాటుకొని చింతగుంటపల్లె వైపు నడవసాగింది. చీకట్లు ముసురుతున్నవేళ ఒంటరిగా వెళుతున్న ఆడదాన్ని చూస్తూనే వీరభద్రస్వామి కళ్ళు గుడ్లగూబ కళ్ళలా వెలిగాయి. బస్సులో ఈ రోజు ఆవిడకు జరిగిన అవమానం కేవలం ఆవిడ కొక్కదానిదే కాదని, కండక్టరు దగ్గర్నుంచీ చిల్లర సక్రమంగా తీసుకోలేని ప్రయాణీకుల కందరికీ యిది తీరని అవమానమనీ అతడు ఆమెను సముదాయింప జూశాడు. తర్వాత మరొక్క మెట్టుకూడా దిగి కేవలం పది పైసల కోసం కండక్టరుతో యింతసేపు వాదించడం అనవసరమనీ, తన దగ్గర కనీసం అయిదు రూపాయలకు చిల్లర వుందనీ, చింతగుంటపల్లె వెళ్ళే దారి చిమ్మచీకటిగా వుంటుందనీ, మనిషితోడు ఆమె కెంతైనా వాంఛనీయమని చెబుతూ – వీరభద్రస్వామి మిడికాళ్ళు తొక్కుతున్నట్టుగా ఆమె వెనకనే నడవసాగాడు.

8. తోలు డోలు - తోలు చెప్పులు అను మరికొన్ని తోలుబొమ్మల కథ

వెంకటసామి, మల్లిసెండుగాడు భాగ్యమ్మకు చెరోవైపు కూర్చొని బీడీ తాగుతున్నారు. బీడీపొగ ఆమె ముఖం మీదకు వలయాలు వలయాలుగా పోతోంది.

తాను ఎప్పుడూ బీడీలు తాగకపోయినా భాగ్యమ్మకు బీడీల వాసనేమీ కొత్తకాదు. కానీ ఒకటి రెండు రోజులుగా పెండ్లింట్లలో రకరకాల నూనె పదార్థాలు తినడం వల్ల, అనేక బస్సులు ఎక్కి దిగి డస్సిపోవడం వల్ల పొగవాసన యిప్పుడామెకు కడుపులో వికారం పుట్టిస్తోంది.

వెంకటసామి పశు శృంగారం మాటిమాటికీ హద్దులు మీరుతోంది. బస్సు ఏమాత్రం అటూ యిటూ కదిలినా అతడు పూర్తిగా ఆమెమీదకు ఒరిగిపోతున్నాడు. అడుగడుక్కో గుంతలు, గతుకులు, అడ్డంకుల వున్న దారిలో, యింజనులోని ఏ భాగమూ డ్రైవర్‌కు పూర్తిగా అదుపులో లేని బస్సులో, ప్రయాణం చెయ్యడం మిగిలిన ప్రయాణీకులకు బాధాకరంగా వుండవచ్చును గాక, కానీ వెంకటసామికది అత్యద్భుత శృంగార రాసలీలగా వుంది. అతడు భాగ్యమ్మ సహితంగా బస్సులో జరుగుతున్న బృంద నృత్యానికి నాయకత్వం వహించినట్టుగా సంబరపడిపోతున్నాడు. బడలిపోయి వున్న భాగ్యమ్మ శరీరం అతడి కిందబడి నలిగిపోతూ వుంది. కడుపులో మొదలైన వికారం ఆమె ముఖంలో స్పష్టంగా కన్పిస్తోంది. ఆమె తిరస్కారం అతడిలో వికారాన్ని ప్రకోపింపజేస్తోంది. అతడు మల్లి సెండు గాడితో పచ్చిబూతుల హాస్య సంభాషణలు చేస్తున్నాడు. భాగ్యమ్మ విదిలింపులు అతడిమీద ఎనుబోతు మీద పడ్డ వర్షంలా వెలవెలబోతున్నాయి.

బస్సు ఎక్కినప్పటినుంచీ అప్పోజీ కళ్ళు వెంకటసామి, భాగ్యమ్మల మీదనే కేంద్రీకృతమై వున్నాయి. అతడు సమస్తమయిన తన తెలివిని, శక్తియుక్తుల్ని, లోకజ్ఞానాన్ని వెచ్చించి భాగ్యమ్మపట్ల తనకుండిన వ్యామోహాన్ని పటాపంచలు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. తన పక్కనే కూర్చున్న డోలు నారాయణప్పతో ఆడవారి అకృత్యాలను చెబుతున్నట్టుగా అతడు తనను తానే సమాధాన పరచుకోజూస్తున్నాడు.

డోలు నారాయణప్ప నల్లగా పోతపోసిన కంచు విగ్రహంలా వున్నాడు. అతడి జుత్తులోని వెంట్రుకలు అడవిపంది ముండ్లలా నిక్కబొడుచుకుని వున్నాయి. అతడి నుదుటిపైన నిలువునా ఎర్రటి సాదుబొట్టు వుంది. ముతక చొక్కాకు బొత్తాలన్నీ వూడిపోయి వున్నాయి. అతడు తన రెండుకాళ్ళ మధ్య డోలును యిరికించుకుని వున్నాడు. తాను దూరలేక పోయినంత మాత్రాన డోలును వదిలేవాడు గాదు నారాయణప్ప. అతడిది అయిదారుగురు అన్నదమ్ములు, ఏడెనిమిది అక్కచెల్లెళ్ళు గల భారీ కుటుంబం. రెక్కల కష్టమే వాళ్ళ జీవనాధారం. స్వప్రయోజకత్వాల వల్ల ఆ కుటుంబంలో ఒకరిద్దరు మగవాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోగలిగారు. ఆడవాళ్ళలో కనీసం యిద్దరు ఊరు వదిలిపోయారు. ఒకరిద్దరు యిరుగుపొరుగు గ్రామాల్లోని కామందుల ప్రాపకంలోకి చేరిపోయారు. నారాయణప్పకు పెళ్ళి చేసుకోవాలన్న కోరిక రాతిమధ్య మర్రిమొక్కలా మొలిచి మానై వూడలు విడిచింది. అతడు పిల్లకోసం కాలికి బలపం కట్టుకుని మూడు స్టేట్లూ ముప్పై పల్లెలూ గాలించాడు. అతడికి పిల్లనిచ్చేవాడు భూప్రపంచకం మీద వుండడని కొంతమంది ఎగతాళి చేశారు. చివరకు పిల్లను సంపాదించడం తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్నాడు నారాయణప్ప. ఎలాగైతేనేమి, కుందనపు బొమ్మనే సంపాదించాడు. కొత్త పెండ్లికూతురుతో నారాయణప్ప గుడుపల్లెస్టేషన్లో రైలు దిగినప్పుడు ఊరు ఊరంతా ముక్కున వేలేసుకుంది.

కానీ నారాయణప్ప కాపురం మూణ్ణాళ్ళ ముచ్చట కావడం విధి వైపరీత్యం. ఊళ్ళోని కోణంగి పిల్లగాళ్ళ చూపులన్నీ అతడి భార్యమీద పడ్డాయి. వారు ఆమెమీద నారాయణప్పతో అనేకరకాలుగా చాడీలు చెప్పి మనసు విరిచారు. ఫలితంగా ఒక శుభోదయాన ఆమె వూరు విడిచిపోయింది. జనాలు మళ్ళీ మొదటికొచ్చారు. పెండ్లాన్ని సంపాదించుకునే యోగ్యత లేని నారాయణప్పకు అదృష్టవశాత్తు మంచి భార్యే దొరికినా, అంత మంచి భార్యను అనవరించుకునే 'బగిసి' అతడికి లేకపోయిందని వారు అతడిని ఎద్దేవా చేశారు. దాంతో నారాయణప్పకు మళ్ళీ మనసు చలించింది. తన అమాయకత్వంతో ప్రజలు ఆడుకోడాన్ని పసిగట్టలేక డోలు భుజాన వేసుకుని మళ్ళీ దేశం మీద పడ్డాడు నారాయణప్ప. ఒక పిల్ల దాసేగానూరులో వుందని చెప్పినారు. ఒక పిల్ల ముళబాగల్లో వుందని చెప్పినారు. చెప్పినోళ్ళ మాటంతా విని అతడు డబ్బు ఖర్చు పెట్టుకుని వూరూరు తిరుగుతున్నాడు.

అప్పోజీ నారాయణప్పతో ఆడవారి నైజాన్ని పూసగుచ్చినట్టుగా బోధిస్తున్నాడు. అరటిపండు వొలిచి పెట్టినట్టుగా చెబుతున్నాడు. "నారాయణా, ఆడదంటే అగ్గిరా, అగ్గితో బీడి ముట్టించుకో, అన్నం చేసుకో. ఎలుతురే గదాని ముద్దు పెట్టుకుంటే మళ్ళేముండాది? ముక్కూ మీసాలు సీదా కాలిపోతాది. ఓరి ఎర్రోడా, ఆడదంటే మిత్తవరా! అది నిన్ను చిటికెన వేలు పట్టుకోని దోవంతా నడిపించి కడాకు మెట్లు లేని బావిలో తోసేస్తాది. ఆడదంటే ద్రౌపదమ్మరా. అది పగులంతా పంచపాండవుల్తో కాపురం జేస్తాది. రాత్రంతా సుడిగాట్లో పీనుగులు పెరక్కతింటాది" అప్పోజీ నారాయణప్పను భయపెట్టసాగాడు. నారాయణప్ప రాను రానూ బిర్ర బిగుసుకు పోతున్నాడు.

బస్సు కోటపల్లెను విడిచింది. గుత్తార్లపల్లె దాటింది. బాటకు రెండు వైపులా ముండ్లచెట్లు దట్టంగా బలిసివున్నాయి. బస్సు కిటికీలగుండా అవి ప్రయాణీకుల శరీరాలతో పరాచికాలాడుతున్నాయి. చెక్ డామ్‌లపైన తేలిన బండలపై బస్సు పల్లిటీలు కొడుతూ సాగుతోంది. పొగురుపల్లె క్రాసు రాబోతోంది. వెంకటసామిలో యిప్పుడు కొత్తగా ఒక విషాదం అలుముకుంటోంది. పొగురుపల్లె క్రాసు రావడం వల్ల అతడికి కలిగే నష్టం యింతా అంతా అని చెప్పనలవిగాదు.

పొగురుపల్లె క్రాసులో కనీసం యిరవై మందైనా దిగవచ్చు. ఇంతవరకు యిరుక్కుని కూర్చున్న జనాలు యింక విశాలంగా కూచోవచ్చు. వెంకటసామికి యింకొద్దిసేపట్లో తన ప్రాణాలకు తెగించి వీరోచితంగా సాధించిన సీటు డిమాండు, ఉత్కృష్టత ఎందుకూ కొరగాకుండా పోతాయి. భాగ్యమ్మ తన చేష్టకు రోసి ఒక్క ఉదుటున లేచి దూరంగా వెళ్ళి కూర్చోగలదు. అతడు భాగ్యమ్మను మంచి చేసుకునే ఉద్దేశంతో గత ఐదు నిమిషాలుగా బీడీ సంగతి తలపెట్టడమే మానేశాడు.

పొగురుపల్లె క్రాసు వచ్చింది. బిజిగానిపల్లెలోనూ, చీకటి పల్లెలోనూ ఇండ్ల పై కప్పుల నుంచీ పొగ లేస్తోంది. గొర్రెలు అక్కడక్కడ మందలు మందలుగా ఊరి ముఖం పడ్తున్నాయి. సంవత్సరానికి ఒకేమారు అంతంత మాత్రంగా పండే చేలన్నీ నిర్వేదంగా పడుకుని వున్నాయి. చీకట్లో కదులుతున్న నీడల్లా ఒకరిద్దరు రైతులు బాట పక్కన వున్న బావుల దగ్గర ఏతాలు తొక్కుతున్నారు. వేసవి తర్వాత వచ్చిన గాలికాలం వల్ల బావుల్లో నీళ్ళు అంతకంతకూ ఆవిరై పోతున్నాయి. జనాల కడుపుల్లో ఆకలిబాధ విసిరికొడ్తున్న ఈదురుగాలుల వల్ల ఇనుమడిస్తోంది.

ఆగిన బస్సునుంచీ జనం దిగుతున్నారు. బస్సులో ఖాళీ సీట్ల సంఖ్య బాగా పెరిగినకొద్దీ ప్రయాణీకుల్లో ఔదార్యం పెరగసాగింది. కొంతమంది దూరంగా బస్సులో నిలువుగాళ్ళతో

పడిగాపులు పడుతున్నవారిని పిలిచి మరీ ప్రక్కన కూర్చోబెట్టుకోసాగారు. మరికొంతమంది గంటసేపటినుంచీ చూస్తున్న బంధుమిత్రుల్ని తాము అప్పుడే చూశామనీ, ఒకవేళ తాము అంతకుముందే చూసి వున్నట్లయితే తమ సీట్లనైనా త్యాగం చేసి వారికి సీట్లు యిచ్చేవారమనీ అనేక విధాలుగా అతిథుల్ని మభ్య పెడుతున్నారు. అయితే కొత్తగా సీట్లు లభించిన వారిలో చాలామంది తమను ఆహ్వానిస్తున్న వారి మంచితనాన్నీ, ఔదార్యాన్ని, వితరణను అంత సులభంగా నమ్మడం లేదు. తమ దీర్ఘకాలిక సహనం వల్ల, లేక దైవకృపవల్ల లేక యాదృచ్ఛిక ఘటనవల్ల లభ్యమైన సీట్ల ద్వారా అంతవరకు ఆ సీట్లను అమిత కక్కుర్తిగా అనుభవిస్తున్నవారు మంచి పేరు సంపాదించుకోజూడడం వారికి ఏవగింపుగా వుంది.

బస్సులోనుంచీ ముందుగా దిగినవాడు చాకలి లింగయ్య. వెనుక దిగుతున్నది వసంతనాయనివారు. బస్సులో దారి పొడుగునా పరచిన సంచులవల్ల నాయనివారి గమనం మందకొడిగా వుంది. అయిన తన పూర్వుల కోట కుడ్యాల చంక్రమణ వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుని, ఆ ధైర్యసాహసాల ప్రౌఢిమతో మూటలు లంఘిస్తున్నాడు. వృద్ధాప్యం వల్ల, కరెంటులేని తన కొంపలో కిరసనాయిలు లాంతర్లకు అలవాటు పడ్డం వల్ల బస్సులోని గుడ్డిదీపాల కాంతికే ఆయన కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. నాయనవారి మందగమనం కండక్టరులో అసహన జ్వాలను ప్రదీప్తం చేస్తోంది. ప్రయాణీకులు సైతం ఆయన మందవేగాన్ని అవహేళన చేసి విసుక్కుంటున్నారు. తాము యిండ్లకు చేరడానికి పట్టే కనీస సమయం ఏమాత్రం పెరిగినా వారు సహించలేక పోతున్నారు. ప్రయాణీకులు వేగిరించడం వల్ల నాయనివారికి కోపం ముంచుకువస్తోంది. ఆయన తన సహజ గంభీర స్వరంతో వాగాడంబరంగా ఆ విసుక్కుంటున్న వారిని మందలింపజూచారు. కానీ పక్క పండ్లన్నీ రాలిపోయి లొక్కి దవడలు పడడం వల్ల ఆయన ఉచ్చారణ మరీ దిగజారిపోయి మాట్లాడదలచుకున్నప్పుడల్లా గస ముంచుకు వచ్చేస్తోంది. కుప్పం పార్కులో వున్న జమిందారుగారి విగ్రహానికి మల్లే తనదగ్గర ఒక పట్టాకత్తి వున్న పక్షంలో ఆయన కత్తి దూసి ప్రయాణీకుల అంతు జూసేవాడే! కానీ ఆ సవారిబండ్ల కాలం పోయి ఈ డొక్కుబస్సుల కాలం వచ్చింది గదా! కాలంతో బాటూ నీతులూ, పాలసీలు మారాలి. ఒకర్ని మనం తన్ని తగలేసినా, అవమానించినా ఓర్మి వహించే కాలం పోయి, మనం ఒకరికి మేలు జేస్తే వాళ్ళు మనకు మేలు చేస్తారు సుమా అనే ఒప్పందం దగ్గరికి వచ్చి ఆగిపోయింది సమకాలీన లౌకిక వ్యవహార సరళి. నాయనివారు ఉక్రోషం నుంచీ బయటపడి, తనలో తాను సమాధానపడి అడుగు ముందుకు వేసేలోపల బస్సులోని జనంలో అసహనం తారాస్థాయి నందుకుంది.

వెంకటస్వామి, మల్లిసెండుగాడు యిద్దరూ కలిసి చెరొక భుజాన్నీ అందిపుచ్చుకుని వారిని అలాగ్గా నేలమీదకు దిగవేశారు. బస్సు నల్లటి ధూమాన్ని వదులుతూ, డబ్బారేకుల బాడీని దబదబలాడించుకుంటూ సహజ సుందరంగా కదిలింది.

బస్సు కదులుతుండగా నాయనివారు 'అయ్యో నా బ్యాగు, నా బ్యాగు' అని గావుకేకలు పెడ్తూ బస్సు వెనుకనే పరుగెట్టసాగారు. అయ్యగారి బోషాణమేదో బస్సులోనే వుండిపోయిం దేమోనన్న స్పృహతో లింగయ్య మరింత గట్టిగా అరుస్తూ బస్సు వెనక బడ్డాడు. ఫలితంగా బస్సులోనుంచీ సంచిలాంటి వస్తువొకటి విసిరివేయబడింది. అందులో నుంచి రెండు వస్తువులు ఒకే రకమైనవి బయటపడ్డాయి. వాటిలో ఒకటి లింగయ్య మీద పడింది. రెండోది నాయనివారి మీద పడలేదు. బస్సులో నుంచీ ఎవరో ఫక్కుమని నవ్వినట్టు విన్పించింది నాయనివారికి. బహుశా అది ఆయన భ్రమ కూడా గావచ్చు. ఆయన ముఖం విషాదంతో చిన్నబోయింది. దేవుడి దయలాంటి చీకటివల్ల ఆయన తన ముఖాన్ని ఎక్కడా దాచాల్సిన అవసరం రాలేదు.

లింగయ్య అడగకూడదనుకుంటానే నాయనివార్ని అడిగేశాడు. "ఏం సామీ, కాళ్ళకు ఏసుకునేవాటిని సంచిలో ఎందుకు ఏసుకున్నారు?"

"రెండింటికీ ఉంగరాలు పోయినాయిరా లింగా! కొత్తవే, పారేద్దామంటే మనసు రాలే. ఎండలకాలం, కాలంతా ఆనెలు, దారంతా ముండ్లు, పుంతంతా గులక – అవి లేకపోతే అడుగు వెయ్యలేను. రేపు నారిగాడ్ని పిలసకరా కుట్టించాల" నాయనివారు కిందపడిన వాటిని రెంటినీ దీసి బ్యాగులో వేసుకుని నడవసాగారు. తన చెప్పులనైనా నాయనివారికిస్తే బావుండుననిపించింది లింగయ్యకు. కానీ ఏం లాభం? అవి ఆయనకు సరిపోవు. సరి పోయినా యింటికి వెళ్ళే లోపు అవి ఆయన పాదాలను కరవడం ఖాయం. లింగయ్య తన చెప్పులను కూడా తీసి చంకలో యిరికించుకుని నడవసాగాడు.

ముసురుకుంటున్న చీకట్లలో బస్సు పరుస్తున్న చిన్న వెలుగు మరక నుంచీ విడివడి ఆ రెండు నీడలు చీకటిలో కలిసిపోయాయి. కాళ్ళతో కొమ్మల్ని తన్ని ఆకాశంలోకి ఎగిరే పక్షిలా దుమ్మును యిరువైపులా రెక్కల్లా ఎగరగొడ్తూ పెద్దపర్తిగుంట బస్సు ముందుకు పోతోంది.

9. ధరణి శ్రీ వేములపల్లి దాముని సాక్షిగా...

అప్పటికి బస్సులోని వారందరూ విశాలంగా కూర్చోగలిగినంత వెసులుబాటు సమకూడింది. సర్దుకు కూర్చోడానికి కూడా వీలులేనంతగా, ఏమాత్రం కదిలినా ఆ స్థలం ఆక్రమింపబడుతుందేమోనన్న ఆదుర్దా పడాల్సిన హీనపరిస్థితి యిప్పుడిప్పుడే తొలగిపోయింది.

వాతావరణం చల్లబడి చల్లగాలి వీస్తోంది. ఎలాగయితేనేం హాయిగానే యిళ్ళకు చేరుకుంటున్నాముగా అనే భావం జనాల ముఖాలలో ఆనంద తరంగాలు రేపుతోంది. బస్సంతటా ఉల్లాస పవనాలు వీస్తున్నాయి.

అత్తినీరాలు కిప్పుడు కళ్ళు మూతపడే మత్తు తగ్గి అదుపులేకుండా నోరు జారే మత్తు ఆవహిస్తోంది. అతడు తన కత్తవరసయిన ఒక నడి వయస్సావిడతో బహిరంగ పరాచికాలు ప్రారంభించేశాడు. అతడి దగ్గర్నుంచీ వస్తున్న కల్లు వాసన వల్ల ఆమె పక్కకు జరిగి ముక్కు మూసుకొంటోంది. ఆమె పక్కకు ఒత్తిగిల్లుతోన్న కొద్దీ, అత్తినీరాలు ఆమెపైకి మరింత ఒరిగిపోతూ, చాలని దానికి "కల్లు తెమ్మంటిని గానీ, కమ్మాని వాసనా కల్లూ, కల్లు తాగీ కైపూచే మీరీ" అంటూ సుదీర్ఘ రాగం దీసి "కాంక్ష తీరా భోగింతమురావే, ఓ సైరంధ్రీ" అంటూ వెక్కిరింతగా పాడసాగాడు. వెనక సీట్లలో వున్న అయిదారు మంది 'ఓ సైరంధ్రీ, ఓ సైరంధ్రీ' అంటూ వెనక పాట పాడసాగారు. వీరోచిత ఉద్యోగ నిర్వహణ తర్వాత ఆయాచిత వినోదం కూడా ఒనగూడినట్టయి కండక్టరు కూడా వెనక పాట పాడుతున్న యువకులతో చేరిపోయి శృతి గలిపాడు. తన అస్థిత్వానికి ఒక గుర్తింపు వచ్చేయడంతో అత్తినీరాలు యిప్పుడు తన అనుభవాన్ని, పాండిత్యాన్ని ఉపయోగించి

చతురమైన నటన ప్రదర్శిస్తున్నాడు. అతనికిప్పుడు బస్సులోనూ, సీటుమీద గాకుండా అంతర్మథ్యంలోనే పోతున్నట్టుగా వుంది. ముందు సీటు రేకుపైన దరువు వేసే ప్రయత్నం చేసి అది కుదరక పోవడంతో అతడు తొడలమీదే బలంగా చరుచుకోసాగాడు.

బస్సు ఒక సంచార నాటక రంగంలా కదులుతోంది. లీడరు అత్తినీరాలు నాటక కళా ప్రావీణ్యాన్ని గమనించి ఆనందపడుతున్న వాడల్లా ఒక్కసారిగా నిటారుగా అయిపోయాడు. జరుగుతున్న యింతటి నాటక ప్రదర్శనానికి తానింతటివాడు యిక్కడే వుండగా పిలిచి అధ్యక్ష స్థానంగానీ, ముఖ్య అతిథి స్థానంగానీ యివ్వకపోవడం పట్ల అతడికి అత్తినీరాలుపై కోపం కట్టలు తెంచుకొంటోంది. అయితే అత్తినీరాలు యిప్పుడు చుట్టుపక్కల ఎవర్నీ గమనించే పరిస్థితిలో లేడు. అతడిప్పుడు యామగానిపల్లె మహాభారత యజ్ఞంలో వేములపల్లి విరాటపర్వ నాటకంలో కీచకుడిలా అటూ యిటూ గంభీరంగా తిరుగుతున్నాడు. అతడి ముందు కుప్పం వెస్ట్ ఫిర్కా పాటక జనం మ్రాన్పడి జూస్తూ వుంది. అత్తినీరాలు నాటకాభినయానికి ఆటంకం కల్గకుండా లీడరు ఒక పది నిమిషాల తర్వాతనే తన అభ్యంతరాన్ని లేవదీయాలనుకున్నాడు. అయితే పది నిమిషాల తర్వాత అత్తినీరాలు నూటమూడో నెంబరు రైల్వేగేటు దగ్గర బస్సు దిగేయడం ఖాయం. ఆపైన అతడు "నేనా, ఈ దినం కొప్పం పొయ్యి బస్సులో వచ్చినానా? ఏం మాట!" అంటూ నోరైనా చప్పరించేయ గలడు.

"ఒరే పెసిడెంటూ! కొంచెం ముందు ఎనకలు, మిట్టపల్లాలు సూసి పోరా! పేటకు పొయ్యేటప్పటికి నీకు క్రింద మీదలు తెలియటంలే! ఈ యరవదాకా మీ ఊరికంతా నువ్వొకడే జాతైన వాడనుకోనుంటి. ఈ దినంతో నువ్వు మిగిలినవాళ్ళతో జమైపోయినావు గదా!" – లీడరు అత్తినీరాల్ని ఎత్తిపొడిచాడు.

అత్తినీరాలు లీడరు హెచ్చరికతో ఒక్కసారిగా అప్రతిభుడై పోయాడు. బస్సంతా అత్తినీరాల్నే చూస్తోంది. అతడు అత్తిపత్తిలా ముడుచుకుబోతూ లీడరు ముందుకు పోయి అతడి కాళ్ళను రెంటినీ వాటేసుకున్నాడు. ఇంతవరకు అభినయించిన నాటక ధోరణిలోనే అతడు లీడరును అనేక రకాలుగా పొగడడం ప్రారంభించాడు.

"ఏం సామీ, నేను ఈ దినం ఈ సీటుమీద కూసోనుండా? ఈ సీటెవిరిది? యిది నీ బిచ్చం. నేను ఈ దినం ఈ గుడ్డ కట్టుకోనుండా. ఈ గుడ్డెవిరిది? నువ్విప్పి పారేసిందే! ఈ పొద్దు రెండు పూటలా నేనూ సద్దీ సంగటీ తింటావుండా! ఈకూడెవిరిది? ఇది నీ ఎంగిలి. నా ఒళ్ళును బిలేడ్డుతో కోసి సూడు. మా యమ్మ యిచ్చిన పాలు కారదు. మా యబ్బ నెత్తురు కారదు. మీటెంకాయ తోపుల్లో నేను తాగిన కల్లే కారతాది. నేను ఆ కల్లు తాగే

కోతట్టావోణ్ని. నేను సెట్టుమీద కూసోనుంటే ఏవిఁ ఆ మల్లప్ప కొండమీద కూసోనుంటే ఏవి? ఏడ కూసున్నా నేను నీ కాళ్ళుకాడ కూసున్నట్టే! ఈ మద్దిన ఎవురో కాటడు, బూటడు మా వూరికి అదేపనిగా వస్తా వుండారు, మీ వూరికి సరైన బాట ఎయ్యాల! పిలగాళ్ళకు సదుంకోను యిస్కూలు బెట్టాల' అని నన్ను ఒకటే ఊదరగొడ్తా వుండారు. నేను వాళ్ళతో ఒకే మాట చెపతావుండా. ఇద్దో! నేనుగానీ, యింగొకడు గానీ ఈ వూరికి పెసిరెంటుగా ఈ పొద్దుంటాడు. రేపు బోతాడు. ఈ వూరికి మొదిటోడు ఆయిన. ఆయిన, అయిన పూర్వీకులు ఓబికాలం నుంచీ ఈ వూరికి గౌడులు. వాళ్ళ మాట లేందే ఈడ ఎంటిక కూడా కదలదు అని జెప్పి పంపిస్తా వుండా! ఈ పోరంబోకు రోడ్లో, ఈ డొక్కు బస్సు వస్తావుంటానే మా వూర్లో వాళ్ళను పట్టను పగ్గాలు సాలడం లేదే! యిస్కూళ్ళు, యిట్టాంటివి బెడ్తే ఈళ్ళు సుక్కలు జూడరా" అత్తినీరాలు మాటలతో లీడరుకు స్వీయపాలన దిగ్విజయంగా జరిగిపోతున్నట్టు నమ్మకం ఏర్పడింది.

అతడు ఒకసారి నింపాదిగా బస్సునంతా కలియజూశాడు. వర్కుషాపుకు పూర్తి వోవరాయిలింగుకు వెళుతున్నట్టుగా బస్సు డొక్కు డొక్కుగా నడుస్తోంది. గంతకు తగిన బొంతలా రోడ్డు కూడా అందుకు తగినంత హీనాతి హీనంగానే వుంది. ఈ మాత్రం వైభవానికే కూలీలు తన మాట వినడం లేదు. ఈ పరిస్థితులు మరింత క్షీణించి పోవడమే వీరి పొగరు మోత్తనానికి శాస్తి. తాను గూడా అదే బస్సులో ప్రయాణం చేస్తున్న సంగతి మరిచిపోయి లీడరు మిగిలినవారి హీనపరిస్థితిని జూసి క్రూరంగా నవ్వుకున్నాడు.

బస్సు దూరంగా మెరుస్తున్న ట్రాఫిక్ సిగ్నల్స్‌ను సమీపిస్తోంది. రైల్వే లైను బస్సుబాటను క్రాసు చేస్తున్నచోట వున్న గేటు రైలు రాకను సూచిస్తున్నట్టుగా మూసి వుంది. మద్రాసు, బెంగళూరు నగరాలను కలుపుతున్న బ్రాడ్‌గేజి రైలుమార్గం బారలు సాచి దిక్కులు కొలుస్తున్నట్టు గంభీరంగా వుంది. నగరాలు రెండూ పంచతంత్ర గాథల్లోని బకద్వయంలా విపరీతమయిన వేగంతో నవనాగరికతా విహాయస వీధిలో పయనిస్తున్నాయి. కొంగలు రెండూ ముక్కున కరచుకున్న ఎండు పుల్లలా వుంది రైలు మార్గం. కట్టెపుల్లను నోటితో కరచుకుని వేలాడుతూ, ఏ క్షణాన్నైనా అగాధంలోకి కూలిపోవడానికి సిద్ధంగా వున్న తాబేలులా వుంది గుడిపల్లె. నాగరికతల్ని మోసుకుని రైళ్ళు అయోమార్గం మీద ప్రతి దినం పహారా చేస్తున్నా మధ్యనున్న గ్రామాలు, పల్లెలు యింకా జడంగానూ, నిస్తేజంగానూ, అనాగరికంగానూ వున్నాయి. దారి పొడవునా వ్యాపించిన వందల, వేల ఎకరాల బీడు భూములు బహుశా రైలులో ఏసీ కోచ్‌లోనూ, ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంట్లలోనూ పయనిస్తున్న గౌరవనీయుడైన ఏ రాజకీయనాయకుని కంటికీ, విద్యాధికుడయిన ఏ వున్నతాధికారి కంటికీ

ఆనినట్టు లేదు. ఇటు ఆసియాలోని రైళ్ళతోనూ, అటు ప్రపంచంలోని రైళ్ళతోనూ పోటీబడి పరిగెడుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు మార్గాల పక్కనే పూడిక పడిపోతున్న బావులున్నాయి. రాత్రింబవళ్ళు పనిచేసినా బావుల నుంచీ చాలినంత నీటిని పొలాలలోకి తోడలేని ఏతాలున్నాయి. అర్ధరాత్రి చలిలోనూ, మధ్యాహ్నపు టెండల్లోనూ అంతంత మాత్రం ఆచ్ఛాదనలతో ఏతాలు తొక్కుతున్న బక్క మనుషులున్నారు. రైలు దారి వెంబడి మేస్తూ పట్టాలు దాటబోయి అదాటున రైలు కిందబడి చచ్చిపోయే గొర్రెల మందలున్నాయి. ఒకనాడు నగరాల్లోనూ, పట్టణాల్లోనూ తిరిగి మంచి బ్రదుకే బదికి యిప్పుడు ముసలి వగ్గులై పోయినవీ, యిప్పుడు పూర్వజన్మ ప్రాప్త స్వీయదుష్కర్మ ఫలితాలను దారుణంగా అనుభవిస్తున్నవీ, రైళ్ళ రాక కోసం గంటల తరబడి లెవెల్ క్రాసింగుల దగ్గర పడిగాపులు బడుతున్నవీ అయిన బస్సులుంటాయి. మోయలేని బరువుల్ని లాగలేక లాగుతూ, ఎగుడు దిగుడు దారుల్లో పడుతూ లేస్తూ, బక్కెద్దులు లాగుతున్న ఎద్దుల బండ్లు అప్రతిహత ప్రచండ వేగంతో పరుగెత్తే రైళ్ళవంక బెంబేలు పడిపోయి చూస్తూ సాగుతుంటాయి. అయితే రైళ్ళలో సదా ప్రయాణం చేస్తున్న నాగరిక సమాజానికి యిట్టి అల్పమైన విషయాలను పట్టించుకునే వెసులుబాటు అట్టే వుండదు. వారికి కాలక్షేపానికి అనేక మార్గాలుంటాయి. జల్లు కురిసిన వుదయం దిబ్బలపై పుట్టగొడుగుల్లా లేచే సచిత్ర, దిన, వార, పక్ష మాసపత్రికలుంటాయి. దైనందిన రాజకీయాల గురించి, బహుభాషా చలన చిత్ర రాజాల్ని గురించిన అంతు తెగని చర్చలుంటాయి. జోలారుపేట, బంగారుపేట, వైట్‌ఫీల్డ్ మొదలైన స్టేషన్లలో లభించే పాప్‌కార్న్‌లు, బఠాణీలు, శీతల పానీయాలు వుంటాయి. కూచున్న సీట్ల నుంచీ లేచే అవసరం కూడా లేకుండా రైలులోనే సరఫరా అయ్యే అల్పాహార తేనీటి సౌకర్యాలుంటాయి. అపరిచిత వ్యక్తులతో తాత్కాలిక ప్రేమప్రహసనాలకిదే తగిన సమయం. పక్కనున్నవారు ఎవరైనా ఏమారితే వారి వస్తువుల్ని కాజేయడానికి యిదే సరైన అదను. రాజకీయ నాయ కులకు కొత్త పార్టీ ఏర్పాట్లకు యిది నిరపాయకరమైన చోటు. తత్వవేత్తలకిది తమ తత్వ జిజ్ఞాసను నిశితపరచుకోవడానికి అనువైన స్థలం. పేకాట ఆడడానికి యిది సర్వోత్తమ ప్రవేశం. పక్కనున్న వారికి అభ్యంతరకరంగా పొగ తాగడానికి యిక్కడ మాత్రమే వీలవుతుంది. పరమోత్సాహపూరిత కూపేల సంకలితం, యిరవై వొకటో శతాబ్ద నవనాగరికతా సమవాకారం, ఎక్స్‌ప్రెస్ రైలు బండి మద్రాసు నగరోన్ముఖమై యింకొద్దిసేపట్లో నెంబర్ వన్ నాట్ త్రీ గేట్‌ను దాటబోతోంది.

గేట్ తలుపులు అక్కడక్కడ తుప్పుపట్టి గాలికి కిర్రుమంటూ కదుల్తున్నాయి. గేట్ మేన్ మునసామి లాంతరు వత్తీలను సరిజేసుకుంటూ రైలు రాకకోసం ఎదురు చూస్తున్నాడు.

పంచకొనను చంకలో యిరికించుకుని, కాలుతున్న బీడీని పెదవుల చివరకు తోసుకుంటూ, అప్పోజీ సహితంగా లీడరు గేట్‌మేన్ మునసామితో రైలు రాకముందే గేటు తెరిపించి బస్సును దాటించేందుకు చర్చలు మొదలుపెట్టాడు.

రైలు గేటు కవతల పట్టాల వెంబడి గుడుపల్లె నిద్రాణంగా వుంది. నిద్రిస్తున్న వూరి గుండె చప్పుడులా ఊరి మధ్యనున్న బోరింగ్ మాత్రం యింకా కొట్టుకుంటూ వుంది. మక్కా నగరానికి ముల్లాల ఆజా, మాస్కోకు ఫ్యాక్టరీల సైరన్లలాగా, గుడుపల్లెకు బోరింగు కొట్టే శబ్దమే నేపథ్య సంగీతం. బోరింగు ఆగిపోతే పల్లెకు హార్ట్ ఎటాక్ వచ్చినట్టే. ఆ శబ్దం వింటూనే ఒంటిపల్లె కోమలమ్మకు రొమ్మునొప్పి ప్రారంభమయింది. పదిహేనుమంది గల తన కుటుంబానికి కావలసిన నాలుగయిదు పెద్ద తొట్టెలకు పట్టే నీటికోసం దాదాపు ఒక ఫర్లాంగు దూరంలో గల బోరింగు నుంచీ నీళ్ళు తేవడం కోమలమ్మ దైనందిన కార్యక్రమాల్లో ముఖ్యమైన భాగం. ఆమె జీవితంలో అధికభాగం బోరింగు కొట్టి నీళ్ళు తేవడంలోనూ, మిగిలిన భాగం నీళ్ళు తేవడం వల్ల వచ్చిన రొమ్ము నొప్పితో బాధపడ్డంతోనూ గడచిపోతోంది. బోరింగ్‌మోత వినను వినను ఆమె ముఖంలో బాధ ప్రస్ఫుటమవుతోంది. ఆమె తలను ఒడిలోకి వంచుకొని 'ఈ నొప్పి నెట్ట భరింతునే అక్కా! గుండెల్ని పిండేస్తా వుండాది, ఏం జేతునే తల్లె' అంటూ వంకర్లు పోతూ వుంది.

పొద్దుపోయిన తర్వాత బిడ్డకు మళ్ళీ ఒళ్ళు వెచ్చబడ్డంతో సుభద్రకు యిప్పుడు పాపభీతి పట్టుకుంది. బంగారట్టా మొగుణ్ణి యింట్లో పెట్టుకొని దారిలో కనపడిన మగోనికంతా యికిలిస్తే దేవుడు అంతకంత సూపించకపోడు. సుభద్ర పశ్చాత్తాప పరితప్త అయి వెంకటపతికి దూరంగా జరిగి కూచుంది. బిడ్డకు జ్వరం తగ్గిపోతే రాళ్ళగంగమ్మ పరషలో కోడిని కోస్తానని ఆమె మొక్కుకుంది. శివరాత్రికి గుడివంక గుడిలో ఈశ్వరుడికి అభిషేకం జేయిస్తానని మొక్కుకుంది. పిల్లవాడికి స్వస్థత చేకూరాలేగానీ, ఆమె అందుబాటులో గల దేవుళ్ళందరికీ పేరుపేరునా మొక్కులు చెల్లించుకోవడానికి సిద్ధంగా వుంది.

అయితే సుభద్ర తనకు దూరంగా జరగడం వల్ల వెంకటపతి యిప్పుడు విచారించే స్థితిలో లేడు. యింటికి వెళ్ళగానే పెండ్లాం తెగిన ఏతాం మోడుకు బదులుగా కొత్తది తేలేదని పెట్టబోయే చీవాట్లపైనే అతడి మనస్సంతా కేంద్రీకృతమై వుంది. రాత్రికో, రేపటికో తడి తగలక పోతే ఆర్నెల్ల పంట మట్టిపాలు గాకతప్పదు. వెంకటపతి కించపాటుతో చేతులు నలుపుకోసాగాడు.

'గువ్వ ఎంత దూరం ఎగిరినా గూడు చేరుకోవాల్సినట్టు ఎంత దూరం యాత్ర చేసినా కడాకు యిల్లు చేరుకోవాల్సిన వోళ్ళమే గదన్నా' అంటూ సుదీర్ఘంగా నిశ్వసించి దిగడానికి

ఉద్యుక్తుడైన వాడల్లా సంచీని తడుముకొని ఒక్కసారిగా గతుక్కుమన్నాడు సీమేగౌడు. అనుమాన నివృత్తికోసం సంచీని విప్పి కూడా చూశాడు. నిజమే, అందులో దేవుడి లడ్లు మాయమైనాయి. భగవత్ప్రసాదాన్ని సైతం చౌర్యం చేయ గల క్రౌర్యం అన్యులకెలా సాధ్యం? సీమేగౌడు లీడరు కోసం కళ్ళు మిటకరించి గాలిస్తున్నాడు. 'అన్నన్నా! కడాకు ఎట్టాకాలం వచ్చేసిందప్పా, తప్పదు, యింక కలిగ్గం బగ్గుమని మండిపోక తప్పదు. మనుషులు కడాకు యింతకు తెగిస్తావుండారే, యింక ప్రపంచం బుగ్గి అయిపోక తప్పదు' తినని ప్రసాదపు తీపిదనాన్ని పండ్లు వూడిపోయిన లొక్కి దవడలతో లొట్టలేసి మరీ గుర్తుకు తెచ్చుకుంటూ లీడరును శాపనార్థాలు పెట్టసాగాడు సీమేగౌడు.

సామదాన భేద దండోపాయ క్రమం లీడరు విషయంలో వెనుక నుంచీ ప్రారంభమవు తుంది. అతడి దగ్గర అయిదో ఉపాయం కూడా ఒకటి కద్దు. అది దేబిరింపు. మొదట అతడు గేట్‌మేన్‌ను కొట్టినంత పని జేసి, అతడు వదలకపోవడంతో మరికొంత సేపు తిట్టి జూశాడు. తర్వాత అటు జోలారు పేటలోను, యిటు బంగారు పేటలోను తనకు తెలిసిన ఉభయ జంక్షన్ల రైల్వే అధికారుల వల్ల గేట్‌మెన్‌కు ఒనగూడగల మేళ్ళను ఏకరువు పెట్టాడు. కుప్పం బస్టాండులో కండక్టర్లు కొంతమంది తనతో కుదుర్చుకున్న సంధి విశేషాలతో కూడా అతడిని కొంత ఎడ్యుకేట్ చేయడానికి ప్రయత్నించాడు. చివరికతడు అయిదో ఉపాయంగా తనతో బాటూ బస్సులోవున్న అతిథీనులైన, దురదృష్టవంతులైన ప్రయాణీకు ల్నందర్నీ కావమనీ, ఒక క్షణం గేట్ తెరిచిన పక్షంలో బస్సు అవలీలగా అవతలి ప్రక్కకు చేరుకుంటుందనీ, ఎక్కడో రాబోతున్న రైలు కోసం బస్సు నిక్కడ యింతసేపు ఆటంక పరచడం భావ్యం కాదనీ ప్రాధేయపడసాగాడు. నిజానికి గేట్‌మేన్ లీడరుకు అన్ని విధాలా విధేయుడే. కానీ రైలు ఈ క్షణంలోనో, మరుక్షణంలోనో రాబోతున్న సమయంలో గేట్ తెరవడం అత్యంత అపాయకరం. ప్రమాదం జరగడానికి క్షణం చాలు.

అంతరాంతరాల్లో మెదిలే ఆలోచనలా రైలు ఎక్కడో కూత వేసింది. చుట్టూ వున్న ప్రజలందరూ నిశ్చేష్టులై చూస్తూవుండగా సుందరేశ వడియార్ రైలు బాటకు అడ్డంగా బడి గుడుపల్లె వైపు పరుగెత్తసాగాడు. గత మూడు రోజులుగా అతడు, అతడి భార్య, కొడుకులు చేసిన కుండలను, బానలను, తొట్లను కాల్చడానికి ఆ రోజు రాత్రికే వాముకు నిప్పు పెట్టవలసి వుంది. ఆ పనికి తప్పనిసరిగా తాను వుండి తీరాలి. అసలే ఆత్రం మడుసులు. ఆత్రపడినా, ఆదమరిచినా కుండలు పెంకులైనట్టే. ఎక్కడో పొగ కన్పించినట్టయి వడియార్ గులకరాళ్ళ మీద నుంచీ పరుగెత్తసాగాడు.

రైలు బలంగా కూతవేస్తూ గుడుపల్లె స్టేషను దాటింది. కడుపులోని తేమ ఆవిరైపోగా ఎండిపోయిన డొక్కలతో నీరింకిపోతున్న బావుల్లో ఏతాలు తొక్కుతున్న మనుషుల్ని గమనించకుండా – దాహశాంతి కోసమో, దొంగపైరు మేయడం కోసమో ఊర్లోని కొట్టాల నుంచీ బయటపడి రైలు పట్టాలు దాటబోయే బక్క గొడ్లను ఒకటి రెండింటినైనా ఆ రాత్రికే హతమార్చాలని హఠం పట్టినట్టుగా – లెవెల్ క్రాసింగుల దగ్గర పడి గాపులు పడుతున్న మోటారు వాహనాలను, నొగలకు లాంతర్లు వేలాడుతున్న ఎద్దుల బండ్లను ఖాతరు చేయకుండా – నాగరికత చొరవడని, వేగ రహితమై జడప్రాయమై నిస్తేజమైపోయిన జనపదాల చీకట్లను తన పెద్ద డూమ్‌లైట్ కాంతితో ఛేదించుకుంటూ – తన సుదీర్ఘ భయంకరా రావంతో జనాల్ని భయకంపితుల్ని చేస్తూ – కిటికీల గుండా కన్పిస్తున్న విద్యుద్దీపపు కాంతుల్ని దారిపొడవునా ప్రసరింపజేస్తూ – పట్టాలు అదురుతుండగా, గులకరాళ్ళు చెదురుతుండగా, పెట్టెలు తీవ్రంగా చలిస్తుండగా ఎక్స్‌ప్రెస్ రైలు నెంబరు వన్ నాట్ త్రీ గేటును దాటుకుని అనతి దూరంలో ఒక మలుపు తిరిగి చీకటిలో కలిసిపోయింది. వెలుగురేఖ లాంటి రైలు మినుకు మినుకుమనే చుక్కగా మారి చీకటిలో యింకిపోయింది. కానీ దాని భయంకరమైన కూత యింకా రైలు దారి వెంబడి వున్న కామసముద్రంలోనూ, బిసానత్తంలోనూ, అత్తినత్తంలోనూ, సాలచింతనపల్లెలోనూ, కొడతన పల్లెలోనూ, కోరు చెంబగిరి, గుడిచెంబగిరి, జబ్బిగానిపల్లె, ఒంటిపల్లె, అగరం, కాడేపల్లె, చీకటిపల్లె, సోడిగానిపల్లె, సొన్నరసన పల్లెలోనూ యింకా మందమందంగా విన్పిస్తూనే వుంది. ప్రతి ధ్వనులు ఈనుతూనే వుంది.

సాగిపోయిన పెను యినప చక్రాలచేత ఘట్టితమై రైలు పట్టాలింకా వణుకుతూనే వున్నాయి. కిర్రుమని శబ్దం చేస్తూ గేటు తెరుచుకుంది. పెద్దపర్తిగుంట బస్సు చివరి మజిలీకి సమాయత్తమయింది. రైలు జబర్దస్తీని, బస్సు విసిగింపుల్ని విదిలించుకున్న తర్వాత వన్ నాట్ త్రీ గేటు, గేట్‌మేన్ మునసామి తమకు సహజమూ, అలవాటూ అయిన నిశ్శబ్దంలోకి, నిశీధిలోకి మిగిలిపోయారు.

10. స్వర్ణసీమకు స్వాగతం

బస్సు గుడుపల్లెలో ఆగింది. బస్సు యావత్తూ ఖాళీ అయిపోతుందేమోనన్నట్టుగా జనాలందరూ లేచి నిలబడ్డారు. వోల్టేజీ చాలక ఊర్లోని విద్యుద్దీపాలన్నీ కిరసనాయిలు బుడ్డీల్లా వెలుగుతున్నాయి. అంతమంది జనం దిగవలసిన పెద్ద స్టాపింగులా లేదది. చూపుమేరలో కన్పిస్తున్నవి నాలుగయిదు పెంకుటిండ్లు మాత్రమే.

కనిపించిన ప్రతి వ్యక్తినీ బంగారు గనుల గురించి వాకబు చేసి చేసీ రమణమూర్తికి అసహనం ఎక్కువవుతోంది. అతడు మర్యాదగా అడిగాడు. ప్రాధేయపడ్డాడు. కానీ కనీసం ఒక మనిషి దగ్గర్నుంచైనా సంతృప్తికరమయిన సమాధానం రాబట్టలేకపోయాడు. చివరికతడికి ఎవడి చొక్కానైనా కాలరు లాగి పట్టుకొని 'మర్యాదగా చెప్తావా, లేదా? ఎక్కడ బంగారు గనులు? ఎక్కడ మైనింగు వారి క్యాంపు' అంటూ నిలదీయాలనుంది. బస్సు నుంచీ కిందికి దిగిన జనం చీకట్లో కలిసి అయిపు దొరకకుండా అదృశ్యమవుతున్నారు.

బస్సంతా శ్మశాన వైర్యాగంతో నిండిపోయినట్టుంది. డ్రైవరు, కండక్టర్ల ముఖాల్లో సైతం ఒక దినం తాము కూడా ఇలా ఈ బస్సును, ఈ ఉద్యోగాన్నీ, ఈ ప్రపంచాన్నీ వదిలి వెళ్ళవలసినవాళ్ళమే గదా అనేట్టుగా నైరాశ్యం కమ్ముకుంది. బస్సును ఇంకా ముందుకు నడిపించాల్సిన అవసరం వున్నట్టు వారికి అనిపించడం లేదు. బస్సు స్టార్టు చేయకుండా మ్రాన్పడిపోయాడు డ్రైవరు.

డ్రైవరు, కండక్టరు గాక బస్సులో మిగిలినవారు ముగ్గురు. అందులో ఒకతని కాయం మాత్రం బస్సులో వున్నా, అతడు పూర్తిగా బస్సులో వున్నాడని చెప్పడానికి వీల్లేదు. అతడు సంపంగిగౌడు. 'ఓరి మిత్తి'లా అతడు ఏకాకి. సంవత్సరానికి ఎవరైనా ఒకసారి రారాని చుట్టాలు వస్తేగానీ అతడి ఇల్లు ఊడ్చే దిక్కు లేదు. అతడు ఎప్పుడైనా తినాలనిపించినప్పుడు దూరపు బంధువైన ఒక ముసలావిడ కొంపలో నాలుగు మెతుకులు తింటూ, మిగిలినప్పుడు

ఊరి ముందర రచ్చబండ మీద పడుంటాడు. అతడు తాగుతాడు అనడం బాగుండదు. తాగుడు అతడి రక్తాన్ని తాగుతోంది అనడం సమంజసం. అతడు తన ఆస్తిలో ఒక ఖచ్చితమైన భాగాన్ని సంవత్సరానికొకసారి అమ్మి పన్నెండు నెలల పొడుగునా తాగుతుంటాడు. జనం అందరూ దిగుతుండగా అతడికి స్పృహ రావడం వాస్తవమే. అది ఒక లిప్తపాటు. అతడు తాను అప్పుడే బస్సు దిగినట్టు, సంత గేటు దగ్గర రైలు పట్టాలు దాటి, చెరువు గట్టు కూడా గడచి రచ్చబండను సమీపించినట్టు, తానిప్పుడు రచ్చబండ మీదే శయనించి వున్నట్టు అనుకుంటున్నాడు. ఆ స్పృహలో అతడు వేపచెట్టుపై నుంచీ రెట్టలు వేసే కాకుల్ని తన అలవాటు ప్రకారం అమ్మలక్కలు తిట్టుకుంటున్నాడు.

ఉండి లేనట్టున్న సంపంగిగౌడును మినహాయిస్తే, బస్సులో చివరికి మిగిలిన ప్రయాణీకులు ఇద్దరే. ఈ బస్సులో తమ బతుకులెక్కడ తెల్లవారేదీ తెలియక ఆ ఇద్దరూ డ్రైవరు వైపు గుడ్లు మిటకరించి జూస్తున్నారు. డ్రైవరు, కండక్టరూ గాఢ నిశ్వాసాల యుగళ గీతాన్ని ధ్వనించి విధి లేనట్టుగా బండి కదిలించారు. కుప్పంలో బస్సు బయలుదేరినప్పటినుంచీ తానిప్పుడున్నది తన దేశంలోనేననీ, మీదు మిక్కిలి తన రాష్ట్రంలోనేననీ రమణమూర్తి అనేక పర్యాయాలు తనకు తానే నమ్మజెప్పుకోవలసి వచ్చింది. అయితే ఇంతవరకు దారిలో కొన్ని ఇండ్లు, వూళ్ళు కన్పిస్తూ వచ్చినందున బస్సు ఒక గమ్యం వైపు పోతున్నట్టుగా వుండేది. ఇప్పుడది కూడా లేదు. కేవలం తమ పోరు పడలేక డ్రైవరు రోడ్డు కన్పించేంతవరకూ లేదా బస్సులో పెట్రోలు వుండేంత వరకు బస్సును నడిపించాలని నిర్ణయించుకున్నట్టుగా అతడికి తోస్తోంది.

బస్సు ఎక్కినప్పటినుంచీ ఎదురైన కించపాట్లను భరించి కూడా మళ్ళీ చివరిసారిగా తన సమీప భవిష్యత్తు గురించి కండక్టరుతోగానీ, డ్రైవర్‌తోగానీ వాకబు చేయాలనుకున్నాడు రమణమూర్తి. కానీ వారిప్పుడు ఇలాంటి ప్రమాదాన్నేదో శంకించే కాబోలు ముఖాలకు గంటు పెట్టుకున్నట్టుగా దిగంతాల వైపు చూస్తున్నారు. చివరికిలా గాదని రమణమూర్తి ఒక్క ఉదుటున లేచి తిమ్మరాయప్ప పక్కకెళ్ళి కూర్చున్నాడు.

కొత్త సమాచారాలను సేకరించుకోవడంలో కష్టనష్టాల్నెదుర్కోవడం రమణమూర్తికేమీ కొత్తకాదు. అది అతడి ఉద్యోగం. ప్రముఖ రాజకీయ నాయకుడు గానీ, ప్రఖ్యాత సినిమా తారలుగానీ నగరానికొచ్చినప్పుడు వారిని చుట్టుముట్టే గుంపు మధ్య చొరబడి తనకు కావలసిన సమాచారం రాబట్టుకోవడంలో అతడు దిట్ట. నగరంలో ఏ మారుమూల ఏ విచిత్రం జరిగినా దాన్ని వార్తల కెక్కించడానికి ఆఘమేఘాల మీద బయల్దేరి బస్సుల్లోనూ, మోటారు సైకిళ్ళలోనూ, ఆటోలలోనూ క్రిక్కిరిసిన జన సందోహాన్ని తోసుకుంటూ నిర్జీత

స్థలం చేరుకుని జరిగిన సంఘటనల పూర్వాపరాలను బేరీజు వేసుకొని ఆసక్తికరమైన రూపునివ్వడంలో అతడు నేర్పరి. ఆ మేరకు పత్రిక యాజమాన్యం దగ్గర అతడికి మంచి పేరుంది.

అయితే ప్రస్తుతం రమణమూర్తి దృష్టి అంతా ఎక్కడుందంటే – దాదాపు ఒక నెల రోజుల క్రితం ఒక మీటింగులో అతడు ఈ బంగారు గనుల గురించి ఒక మంత్రివర్యుడి అభిభాషణ విన్నాడు. చాలని దానికి చిగురుగుంట బంగారు గనుల్లో పనిచేసే ఇంజనీరు ఒకతను తన చిన్ననాటి స్నేహితుడు కూడా ఆ మీటింగులో కలిశాడు. స్పాట్‌కు వచ్చి తన ఆతిథ్యం స్వీకరించి గనుల గురించి ఒక సచిత్ర వ్యాసం ప్రచురించవలసిందిగా అతడు అప్పుడే తనకు ఒక ఉచిత సలహా ఇచ్చాడు. అయితే రమణమూర్తికి ప్రజా బాహుళ్యంలో ఇంకా ప్రాధాన్యత సంతరించుకోని ఈ గనులను గురించి ఒక సమగ్రమైన వ్యాసాన్ని రాసి తన జర్నలిజానికి మెరుగులు దిద్దుకోవాలన్న తాపత్రయంతో బాటూ కంగుంది కుప్పం రావడానికి మరొక వ్యక్తిగతమైన కారణం కూడా వుంది.

ఇటీవల కొంతకాలం నుంచీ నగరంలో తన జీవితం మరీ యాంత్రికంగానూ, రొటీన్‌గానూ మారిపోతున్నట్టు రమణమూర్తికి అనిపిస్తూ వచ్చింది. ఇంచుమించుగా అర్ధరాత్రి వరకూ దోమలతోనూ, నల్లులతోనూ పోరాడి గెల్చుకొన్న నిద్రా సుఖాన్ని అలారం మ్రోతతో భంగపరిచే ఉదయాలు – సవ్యంగా నీళ్ళు రాని కామన్ బాత్‌రూం, లేవటరీల ముందు నడుం నొప్పితో నడిచే క్యూలు – శుచీ శుభ్రత లేని హోటళ్లలో ఈగలతో, బొద్దింకలతో కీచులాడి తినే చవీసారం లేని తిండి – గంటల తరబడి సిటీ బస్సుల కరుణా కటాక్ష వీక్షణాలు కోసం చేసే తపస్సు – క్రిక్కిరిసిన బస్సుల్లో అంగుళం జాగాలేని ఫుట్ బోర్డులపైన ఏ రైలింగో చేతికి దొరికితే అంతర్మధ్యంలో చేసే ప్రయాణంలో యవ్వన శాపం పొందిన ఏ స్త్రీ పమిట చెంగైనా తగిలితే కలిగే మనోవికార భ్రమ – ఏకాంతం వెదుక్కుంటూ వెళ్ళి ఎన్ని తుప్పలు, చెట్లు గాలించినా ప్రశాంతత తప్ప మిగిలినవన్నీ దొరికే పబ్లిక్ పార్కులు – కాస్తంత ఆహ్లాదం కోసమంటూ వెళ్ళి టికెట్ల సంగ్రామంలో నెగ్గి చివరంటా చూచి ఆపుకున్న డోకులతోనూ, అలవాటైన తలనెప్పితోనూ బయటపడే చలనచిత్ర వినోదం – ఏమోయి బాగున్నావా అనే మాటను కూడా నువ్విలాగాక ఇంకెలా అఘోరిస్తావులే అన్నట్టుగా అనగలిగిన మిత్రన్మన్యుల పలకరింపులు – వీటన్నిటి నడుమ దేశ ప్రఖ్యాతి పొందిన ఒకానొక పెద్ద దినపత్రికలో తానొక జర్నలిస్టును గదా అనే అర్థం లేని గర్వం – పగలు తీరని వేదన – రాత్రి వదలని అలసట – రమణమూర్తికి జీవితం రానురానూ ఒక ఇన్ సోమ్నియా రాత్రిలా మారిపోతున్నట్టుగా వుంది.

తెల్లవారేసరికి వీధుల్లోని బంకుల్లో వ్రేలాడే దినపత్రికల్ని చూస్తే అక్కడ పుర్రెలు వ్రేలాడదీసినట్టుగా వుంటుంది రమణమూర్తికి. ప్రతి ఉదయం అతడు దినపత్రికను మండుతున్న కాగితపు పీలికను పట్టుకొన్నట్టుగా చివర్లు మాత్రం పట్టుకుని చడవడాని కుపక్రమిస్తాడు. పత్రికాఫీసులో కూర్చుని వార్తలు రాయడం అతడికి అగ్ని ప్రమాదాలకు గురైన గుడిసెల్ని ఆలస్యంగా ఆర్పుతున్నట్టుగా వుంటుంది.

ప్రజలకు శాంతి భద్రతలను అభివృద్ధి అవకాశాలను కల్పించడం కోసం ఏర్పడిన ప్రజాపాలన సభల్లోని స్థానాలకోసం కుటిల స్పర్ధలతో, కుట్రా రాజకీయాల్తో జరిగే సంఘర్షణాత్మక ఎన్నికలు, తమ ఉనికికి మూలమైన ప్రజా బాహుళ్య సంక్షేమాన్ని విస్మరించి నాయకులు చేసుకునే పరస్పర స్వార్థ అజ్ఞాన అహంకార ఆరోపణలు, దేశ ముఖపత్రం లాంటి దినపత్రికలకు పతాక శీర్షికలు. సరైన రహదార్లు లేక, సక్రమమైన రవాణా సౌకర్యాలు లేక, వేగంకన్నా మనిషి ప్రాణానికే విలువనే ఇంగితం లేక ప్రతిరోజూ అదొక వ్రతంలా జరిగే రోడ్డు ప్రమాదాల తాలూకు ప్రత్యక్షర సమాచారాన్ని ఆసక్తికరంగా తీర్చిదిద్దడం కోసం ప్రత్యేక స్థానం కల్పించుకునే బాక్స్‌లు – ఉన్నపాటున ఒక రాజ్య భూభాగాన్ని మరొక రాజ్యం ఆక్రమిస్తున్నా, రాత్రికి రాత్రి ఒకరి మిసైల్ మరొకరి క్షిపణిని ధ్వంసం చేస్తున్నా, అగ్రరాజ్యాధినేతల శిఖరాగ్ర సమావేశం అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకే పరిమితం చేయాలంటూ కావించిన తీర్మానాన్ని శ్లాఘిస్తూ రాసే సంపాదకీయాలు – విదేశ పర్యటనలకు నాందిగా మృతవీరుల స్మారక చిహ్నాల వద్ద నియంతలు పుష్ప గుచ్ఛాన్ని వుంచే దృశ్యాన్ని మొదటి పేజీలలో సత్వరంగా ప్రచురించే టెలీఫొటోలు – నదీ జలాల పంపిణీపై, భూ ఆక్రమణలపై, బడుగు జనాలకు ప్రత్యేకంగా సమకూర్చవలసిన ప్రత్యేక సదుపాయాలపై నిరంతరంగా జరిగే చర్చలు, సక్రమంగా అమలు జరపబడని తీర్మానాలు – దేవాలయ ఆస్తులను మింగేసే ధర్మకర్తలతోనూ, అత్యాచారాలకు మతం రంగు పులిమే మతాధిపతుల తోనూ, అమ్యూజ్‌మెంట్ పేరుతో జూద గృహాలు, వ్యభిచార మందిరాలు నిర్వహించే అసలు సిసలైన అవినీతి పరాయణులతోనూ, 'ఏ వరమైనను ఇచ్చెద, అదియును నా కుర్చీ దక్క' అనే రాజకీయ దేవుళ్ళతోనూ 'మా ప్రత్యేక ప్రతినిధుల' ఇంటర్వ్యూలు – సమ్మెలు, బంద్‌లు, ఘోరావోలు, నిరాహారదీక్షలు, లాఠీఛార్జీలు, భాష్పవాయు ప్రయోగాలు, ఎన్‌కౌంటర్లు'... ఇలాంటి వార్తా సముదాయంతో ప్రతి ఉదయం దేశంలో దినపత్రికలు కాలుతున్న కంకాళాలలా తిరుగుతున్నట్టుగా వుంటుంది రమణమూర్తికి.

కొరడాలతో కొట్టినట్టుగా, ఎర్రగా కాల్చిన ఇనుప కడ్డీలతో వాతలు వేసినట్టుగా, ఊపిరి సలపనీయకుండా ముఖం మీద వేడి ఆవిరిని చిమ్మినట్లుగా, బలం కొద్దీ చెంపలు ఎడాపెడా

వాయించినట్టుగా, పత్రికా కార్యాలయంలోని గాజు కిటికీల గుండా దూరి జర్నలిస్టులపైకి విసిరే ఈ వార్తా భంజనాల పడగాల్పుల తాకిడికి రమణమూర్తి చిగురుటాకులా కంది పోయాడు. భారత రాష్ట్రపతిలా ప్రతిరోజూ జరిగే ఒక ప్రముఖ వ్యక్తి దారుణ హత్యపట్ల పళ్ళు తోముకున్నంత సర్వసాధారణంగా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తపరచడం రమణమూర్తికి సాధ్యం కావడం లేదు. ఈ ఒత్తిళ్ళకూ, సంఘర్షణలకూ దూరంగా కనీసం ఒక పది రోజులు ఎక్కడైనా అజ్ఞాతంగా, ప్రశాంతంగా గడిపి రావాలన్న రమణమూర్తి చిరకాల వాంఛ ఈడేరడానికి ఇప్పటికి వీలయింది.

అయితే రమణమూర్తికిప్పుడు తన సమస్య మరింత జటిలమై పోతున్న సూచనలు కన్పిస్తున్నాయి. విధ్వంసకరమైన మానవ నైజం దేశ కాలాలకు అతీతంగా ప్రపంచమంతా సర్వవ్యాప్తంగా వుందేమోనన్న భావన అతడ్ని నిలువెల్లా వణికిస్తోంది. జైలు గోడలు తప్పించుకోవడం కోసం సొరంగం తవ్వితే అది మరొక జైలు గదిలోకి తేలినట్టు, గట్టువైపు ఈదబోయి సుడిగుండంలో తగులుకున్నట్టుగా అతడు లోలోపలే క్రుంగిపోతున్నాడు.

ఎక్కడో చెదురుమదురుగా వచ్చిన వార్తల్లో చదివి అతడు వస్తూ వస్తూ ఈ ప్రదేశాన్ని గురించి ఏర్పరచుకున్న రూపం వేరు. అది బంగారు వేట. ఒకవైపు బంగారు పంటలు పండుతున్నాయి. మరోవైపు బంగారు గనులు బయల్పడ్డాయి. జనం ఆశ్రమాల్లాంటి ఇళ్ళలో ఆరోగ్యంగా, ఆహ్లాదంగా వున్నారు. రహదార్లు కడిగి పెట్టిన సాసర్లలా మెరుస్తున్నాయి. బస్సులు రన్‌వేల మీద విమానాల్లా నడుస్తుంటాయి. అయితే తీరా వచ్చిన తర్వాత అతడికి ఎదురైన అనుభవం వేరు. ఊహా వెలుతురు కిరణం పడి ఏడు రంగులీనుతున్న నీటి బుడగలాంటి అతడి కల జీవిత వాస్తవికత వేడికి చిట్లిపోయింది. తన ప్రయాణానికి ఒక నిర్దిష్ట, విశిష్ట ప్రయోజనం సంతరించుకోవాలన్న అతడి ఆశయం అడుగడుగునా నీరసించి పోతోంది. ఎట్టి క్లిష్టమైన పరిస్థితులలోనైనా ఇమిడిపోగల, ఎట్టి గహనమైన సందర్భాలలోనైనా తనకు కావలసిన సమాచారం సేకరించగల, ఎంతటి జటిలమైన సమస్యలనైనా విశ్లేషించగల తన వృత్తికి ఇది ఒక పరీక్షా సమయంగా అతడికి తోచింది. ఫక్తు విలేకరిలా అతడు తిమ్మరాయప్పతో ఇంటర్వ్యూకు దిగేశాడు. విపరీతమైన రణగొణ ధ్వనులమధ్య కర్మాగారంలో కార్మికుల్ని ఇంటర్వ్యూ చేస్తున్నట్టు అతడు తిమ్మరాయప్పతో గొంతు చించుకుని మాట్లాడ సాగాడు.

"ఏమండీ, ఈవైపు గనుల్లో బంగారం దొరుకుతోందట గదా! మీకు బాగా దగ్గరేనా?" అరచేతుల్ని మైకులా పెట్టుకుని తిమ్మరాయప్ప చెవిలో అరిచాడు రమణమూర్తి.

ప్రశ్నను అర్థం చేసుకోవడం కోసం, సమాధానం చెప్పడం కోసం తిమ్మరాయప్ప చేస్తున్న ప్రయత్నం అతడి ముఖంలో కవళికలు మారడం ద్వారా బాగా కన్పిస్తోంది. ఎలాగో గొంతు పెగుల్చుకుని "ఏమో సా, దొరకతాదని చెప్తా వుంటారు. ఆ యివరాలు మీయట్టా సదుంకున్నోళ్ళకే దెలియాల! మాకేం తెలస్తాది. ఎద్దుల్ని గొట్టి ముద్దల్ని దినేటోళ్ళము" అంటూ వినయంగా బదులిచ్చాడు తిమ్మరాయప్ప.

అన్ని విషయాలు తెలిసి వుండి కూడా కేవలం ముసలివాణ్ణి ఎద్దేవా చేయడానికో, పరీక్షించడానికో ఇలా ప్రశ్నలు వేస్తున్నట్టు, అతగాడికి తన నిజాయితీ పైనే అపనమ్మకం ఏర్పడిందేమోనన్న అనుమానం రావడంతో రమణమూర్తికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. అతడు లాల్చీ జేబులోంచీ సిగరెట్టు తీసి ముట్టించుకున్నాడు. రెండు మూడు గుక్కలు గబ గబ పీల్చి కొత్త వుత్సాహం తెచ్చుకున్నాడు. మరింత ఓపికతో ఈసారి మళ్ళీ తిమ్మరాయప్పతో తలబడ్డాడు.

"నేనీ ప్రాంతానికి కొత్త, అందుకే ఇలా అడుగుతున్నాను. బంగారు గనులిక్కడ పడడం వల్ల మీకందరికీ జీవనోపాధి లభిస్తోంది గదా. మీ బ్రదుకులు బాగుపడుతున్నాయి గదా?" అన్నాడు.

తిమ్మరాయప్ప తన లొక్కి దవడలు ఆడించుకుంటూ ఆగంతకునికి సరిగ్గా విన్పించడం కోసం వుండి వుండి ముందుకు వొంగిపోతూ చెప్పసాగాడు. "అదేవో సామీ! అక్కడా కొంతమంది పనికి బోతావుండారు. ఈ నేల్లో బంగారం దొరకతాదని శానామంది కార్లల్లో, జీపుల్లో వచ్చి పోతా వుండారు. ఈ నేలలోనే మేము పుట్నాము. మా నాయన, మా తాతల కాలాల నుంచీ మేమీ నేలను నమ్ముకొనే బతకతా వుండాము. కొంతమంది ఈ నేల్లో బంగారు గన్లు వాళ్ళే పెట్నామంటా మా దగ్గర ఓట్లేసుకుని పోతా వుండారు. ఇంకొంతమంది ఈ నేల్లో నుంచి బంగారం తీస్తామని ఇనపరేకుల్తో ఇండ్లేసుకోని ఈడనే కాపురం పెట్టేసి మా దగ్గర అన్ని కూలిపన్లు సెయ్యించుకుంటా వుండారు. వాళ్ళు వచ్చిన కాడినుంచి మా సేద్దాలు మూలబడిపోయినాయి. సేద్యంలోకి కూలికొచ్చేవాడు కనబడాటం లే. పోన్లే ఆడికే పోనీ అనుకుంటే ఆ గెని పన్లో కూడా వాళ్లేవీc మిగిలి మిట్టన బడిపోవటం లే. గెనిలో పని అంటే మిత్తవతో పోరినట్టే వుండాది. పోయిన పండగ నెల్లో ఆ సొరంగాల్లో నేల ఉల్లుకోని మా వోళ్ళు ముగ్గురు ఒకేనాడు కాలమయిపోయిరి. ఆ గెన్లో పడే కష్టం బూమ్మీదనే పడితే రాజనాలు పండు. అయినా బంగారం మీద జనాలకెందుకింత బ్రెమో తెలవటం లేదు. అదేమన్నా కూట్లోకి వస్తాదా? కూర్లోకి వస్తాదా? సేతుల కష్టంతో వడ్లు పండించు, రాగులు పండించు. తిండి జరగతాది. టెంకాయ సెట్లు బెట్టు, మామిడి తోపులు పెట్టు,

మనుషులకు నీడ దొరకతాది. ఊరు వాడంతా పచ్చగ లచ్చిమి కళకళలాడతాది. ఒక గురుగింజింత బంగారం కోసరం ఎకరాలు ఎకరాలుగా బీళ్ళు పెట్టేసినారు. నాకు తెలీక అడగతా సా, ఈడకొచ్చిన ప్రతి పెద్ద మనిషి ఈడ బంగారం దొరకతాదా. ఈడ బంగారం దొరకతా వుండాదా అని అడగతా వుండాడే, ఎవుర్రే గానీ ఇక్కడ తాగేదానికి నీళ్ళు దొరకతా వుండదా అని అడగతా వుండాదా? భూమండలానికి సొరంగం ఏసినట్టుగా యోజనాలు యోజనాలుగా తవ్వి కేజీఎఫ్‌కు ఎత్తుకోని బోతావుండారే. మంచినీళ్ళు తాగను సేద బావులు తవ్వాలని ఎవురైనా అనుకుంటా వుండారా? మా నాయినోళ్ళ కాలంలో వక్క పేళ్ళు, దుగ్గు, ఉప్పు ఇట్టాంటివి తప్పించి సంతలో ఏమీ కొనేవాళ్ళము గాము. ఇప్పుడు నూకల కాడ్నించి సమస్తము సంత నుంచి ఇంటికి చేరాల్సిందే. ఎందుకు జెప్పు సామీ ఈ బంగారం? బూమి మీద ఎట్టా సిరిమంతుడైనా లవణమన్నమె గానీ మెరుగు బంగారము మింగబోడని పెద్దోళ్ళు సెప్పే వుండారే! మేము మిగిలి మిట్నబడేకత ఎందుకడగతావు? పోయ అంతా బోయ. నీటి ఆదరువుకు కొదవ లేని కాలాల్లో, పైర్లు సక్రమంగా పండే కాలాల్లో మా ఇంట్లో ఆడోళ్ళంతా బంగారం నగలు దిగేసుకోనుండ్రి. అడ్డిగలు, అంట జోళ్ళు, వంకీలు, నాగరలు, కాసుల్దండలు అన్నీ పెట్టుకోనుండిరి. అన్నీ పోయినాయి. ఒకటి మిగిలింది. ఒంటి ఎంటిక మాదిరిగా ఒక ఒంటి పేట గొలుసు. దాన్ని పెట్టుకోని ఏ మారాజన్నా కాసులిస్తాడేమోనని వారం దినాలుగా పేటకు తిరగతా వుండా. కలపటం లేని సొక్కమయిన అపరంజి. దాన్ని పెట్టుకోని నాలుగు కాసులిచ్చేదానికి నన్ను గుంట మిట్టకు ఈడస్తా వుండారు. గుంటకు గుంట నీళ్ళు దాపతా వుండారు. ఈ అరవై డెబ్భై ఏండ్ల వొయిసులో ఎవురికాడికీ పొయ్యి చెయ్యి సాంచినోన్ని గాదు. ఈ పొద్దు ఎండిపోతా వుండే నా పైరు మూలకంగా ఈ పనికి ఒడిగట్టినా. అయినా నా ఎర్రిగానీ కలిగిన మారాజునైతే పలకరిస్తారు కానీ, నాయట్టా బికారోణ్ణి ఎవురు పలకరిస్తారు? బెమ్మంగారు అడిగితే సిద్ధయ్యగారు చెప్పినట్టుగా ఏమిరా సిద్ధా, లోకమెట్టుండాది అంటే ఎవురిలోకం వాళ్ళదిగా వుండాది సామీ అన్నెట్టుండాది. నేను పసరమట్టావోణ్ణి. కానీ ఒక మాట జెపతా. బూమిమీద కాయకష్టం జేసి నీతిగా జీవనం సేద్దామనేవోళ్ళు తగ్గిపోతా వుండారు. ఒకరు సంపాదించిన సొత్తును మింగేసి బదకదామనుకునేవాళ్ళు పెరిగేపోతా వుండారు."

బస్సు పూనకం వచ్చినట్టుగా సాగిపోతోంది. అది గుంతల్లో దూకుతుందో, రాళ్ళమీద గంతులు వేస్తోందో, మట్టిలో కూరుకుపోతోందో తెలియకుండా వికృతారావాలు చేస్తోంది. డ్యూటీ పూర్తి కావస్తుండడం వల్లనైతేనేమి, పగటివేళంతా క్రిక్కిరిసిన బస్సులో సర్కసు ఫీట్లు చేసి వుండడం వల్లనయితేనేమి, బయటి వాతావరణం కాస్తా చల్లబడటం వల్ల

నయితేనేమీ, కండక్టరు కునికిపాట్లు పడుతున్నాడు. అలవాటయిన పద్ధతిలో డ్రయివరు మరమనిషిలా చక్రం దిప్పుకుని బోతున్నాడు. బస్సు తన దారిలో తాను వెళ్తోందన్న స్పృహ రమణమూర్తి కెప్పుడో సన్నగిల్లింది. తిమ్మరాయప్ప యింకా ఏదో మాట్లాడుతూనే వున్నాడు. సారాంశం అర్థమయ్యాక అతడి గోష్టను మరింత విపులంగా వినలేక పోతున్నాడు రమణమూర్తి. దిగంత వ్యాప్తంగా చీకటి గుయ్యారమై పోయివుంది ప్రపంచం. ఈ నేలపైన అరుణోదయపు వెలుగులు, ధవళశరత్ జ్యోత్స్నలు, వాసంత సమీరాలు సంభవిస్తున్నాయన డానికి గానీ, ఈ నేలలోనే బంగారం దొరుకుతోందనడానికి గానీ, యిప్పుడేమీ దాఖలా కన్పించడం లేదు.

బస్సు ఆగింది, అప్పటికి రమణమూర్తి గూడా ఈ బస్సు ఎక్కడైనా ఆగిపోవడానికి సిద్ధంగా వుందనే భావనతోనే వున్నాడు. బస్సు తన సహజ కఠోర ధ్వనులన్నింటినీ ఆపేసి నిమ్మళంగా వుంది. తిమ్మరాయప్ప కూడా ఏదో అవాంతరం జరిగినట్టు గుర్తించాడు. నిజమే! బస్సు దారి తప్పి ప్రక్కనున్న యిసుక వాగులోకి దిగేసింది. చక్రాలు మోకాలి లోతు యిసుకలో కూరుకుపోయాయి. కనీసం పదిమందైనా చేతులు వేయాల్సి వుంటుంది. తెల్లవారితే గానీ బస్సు కదలటం కష్టం. డ్రైవరు కండక్టరును లేపి బస్సు ఆగిపోయినట్టు, ఊరింకా రెండు మూడు మైళ్ళ దూరంలో వున్నట్టు చెప్పాడు. నిద్రమత్తు నుంచీ బయటపడ్డ కండక్టరు మెల్లగా మందహాసం చేశాడు. బస్సు వూరికి చేరుకున్నంత మాత్రాన తమకు ఒనగూడే ప్రత్యేక సదుపాయమేదీ లేదనీ, పై పెచ్చు రాత్రి కాను కానూ ఊర్లో అఘోరిస్తున్న వాళ్ళంతా బస్సులోకి జొరబడి తిష్టవేసే ప్రమాదం వుందనీ, ఆ వూరికంటే ఈ ఆడవేనయమనీ ఉపదేశం చేసి మళ్ళీ చిదానందంతో కళ్ళు మూసుకున్నాడు.

చోదకులిద్దరు శయనించిన తర్వాత ఒకటి రెండు నిమిషాలసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది. తర్వాత తిమ్మరాయప్ప మెల్లగా బస్సు దిగాడు. అజ్ఞాత ప్రపంచంలో తనకు మిగిలిన ఒకే ఒక దారితోడు వెంకటరమణ మూర్తి కూడా దిగేశాడు.

"యింకేముండాది! ఊరి దగ్గరికొచ్చేసినాము. ఆ కన్పించే తగ్గులోనే క్యాంపుండాది. అది దాటితే మా వూరు. నాలుగడుగులు వేస్తే సరి" – తిమ్మరాయప్ప మెల్లగా నడవసాగాడు. ముందుగా మార్గదర్శి, వెనుక అన్వేషి – మళ్ళీ ప్రయాణం మొదలైంది. ఎత్తుపల్లాలు, మలుపులు, రాయిరప్ప, భూమి ఆకాశం కన్పించని కారు చీకటి. వేసిన అడుగు కింద మాత్రం నేల వుందని రమణమూర్తికి నమ్మకం వుంది. వేయబోతున్న అడుగు కింద పెద్ద గొయ్యే వుందో, ముండ్ల కంపే వుందో, ఎర్రతేలే వుందో, విషసర్పమే వుందో తెలియడం లేదు.

నిశ్శబ్దాన్ని చీలుస్తున్నట్టుగా తిమ్మరాయప్ప 'నిలువన్నా' అంటూ కేక వేశాడు. చరాలున ముందు పడబోతున్న అడుగును వెనక్కు లాక్కుని నిశ్చేష్టుడై పోయాడు రమణమూర్తి.

"సూడన్నా, యిదే నా బాయి, సూడు నా జీయితమంతా పోరకలాడి ఈ గుంతే నేను తవ్వింది. నా కొడుకు, నా కోడలు దీని మూలంగానే నాశనమయి పోయిరి. ఈ గుంత మూలంగానే మా యింట్లో ఆడోళ్ళ నగలంతా మట్టిపాలయిపోయింది. యింకన్నా జూడన్నా, ఈ బాయిలో జల కన్పడతా వుందేమో! రాకాసినోరు దెరుచుకోని నరగావు అడిగేట్టుగా వుందే ఈ గుంత – యింకన్నా జూడన్నా దీనికి నామీద దయ గలగతా వుండాదేమో. కడకు మిగిలింది ఇద్దో ఈ నగే..." రొండిపైన చెయ్యివేసి తడిమి చూసుకుని త్రాచు తోకను త్రొక్కిన వాడిలా అదిరి పడ్డాడు తిమ్మరాయప్ప.

"ఏడ! ఏడసామీ! నా నగ ఏడ? దేవుడా! నా నగ ఏడ సామీ" అంగలారుస్తూ నడుము చుట్టూ తడిమి చూసుకుంటున్నాడు తిమ్మరాయప్ప. "పోయింది, పోయింది సామీ! ఆ బస్సులో జనాలందరూ కుమ్మతా వున్నెపుడే అనుకుంటి. ఊపిరే సలపలేదే. ఆ బస్సులో యింకేడ చేతులాడేది! కాగితంతో పొట్లం చుట్టి పంచె కొంగులో మూటగట్టి రొండిలో దోపుకొనింది పోయింది గద సామీ! కన్ను కన్నుగా వుండగానే కంటి పాపను కత్తిరించేసినారే. యింకేంజేతున్రా తండ్రీ! యింక ఏం మొకం పెట్టుకోని యింటికి పోదు? తాతొస్తాడు, కాసులు దెస్తాడని దోవ జూసుకోనుంటాదే బిడ్డ, ఎట్ట దాని మొగం జూద్దు? బంగారట్టా బిడ్డ, చేజేతులా గొలుసుదీసి నా సేతుల్లో ఏసేసిందే, ఎట్టదాని మొగం జూద్దు, పోయ, ఈ పొద్దుటికి ఆ బిడ్డకు ఆదరువుగా ఒక నగ మిగిలిందనుకోనుంటి. పోయ! నేనేం జేతున్రా బగమంతుడా!" తిమ్మరాయప్ప గద్గదంగా విలపిస్తున్నాడు.

అప్పటికప్పుడు పిచ్చి పట్టబోతున్నట్టుగా విలపిస్తున్న ముసలివాడి వంక అచేతనంగా చూస్తూ నిలబడి పోయాడు రమణమూర్తి. మరుసటి క్షణంలో ముసలి వాడు ఏమైపోతాడోనన్న భయంతో అతడి శరీరం సన్నగా కంపిస్తూ వుంది. కొంపదీసి పక్కనే వున్న గోతిలో దూకేస్తాడో, లేదా బావిలో తొవ్విన రాళ్ళతో తలబాదుకుంటాడో అన్పించేట్టుగా ముసలివాడు ఏడ్చి గగ్గోలు పెడుతున్నాడు. ఏడుస్తూ పలవరిస్తూ అతడు నేలమీద కుప్పగా కూలిపోయాడు.

మంచు మెల్లగా కురవడం ప్రారంభమైంది. కీచురాళ్ళ రొద విన్పిస్తోంది. తిమ్మరాయప్పకు తన జీవితంలో యిక చేయగలిగిందేమీ ఉన్నట్టు కన్పించడం లేదు. ఐతే తనను నమ్మి తెలియని ప్రదేశంలో తన వెంట వచ్చిన పరదేశికి ఒక ఆశ్రయం చూపించవలసిన బాధ్యత

మాత్రం ఒకటి తనకు వున్నట్టు, తన బ్రతుకుకే చివరి దశలాంటి ఆ సమయంలో సైతం అతడు గుర్తించాడు.

పట్ల బలవంతం మీద అతడు మళ్ళీ లేచి నిలబడ్డాడు. "పోనీ! యిన్నేపోయ! యిప్పుడి దొకటి మిగిలి ఏమి ఉద్ధరిస్తాది? ఈ నగను కూడా ఈ బాయిలోనే వదిలేసి నూగులు యిడిచేసినానుకుంటా. యింకనా బాయి బాగుపడే రాతలే! యిదిట్టనే పూడిపోనీ! రేపు నేను సచ్చినాక కూడా నన్ను యిదే గుంతలో పూడ్చేయనీ! ఈ గుంత యిట్టనే ఖిలపడి పోనీ..." అంటూ అతడు దోసిటితో యింత మన్ను తీసి బావిలోకి కుమ్మరించి ముందుకు కదిలాడు.

నిశ్శబ్దం శోకిస్తున్నట్టుగా, నిశీథి శోధిస్తున్నట్టుగా వాళ్ళు మళ్ళీ నడవసాగారు. చూడను చూడనూ ఆకాశంలో కొత్త నక్షత్రాలు పుట్టుకొస్తున్నట్టుగా వున్నాయి. ఏదో మెయిలు బిసానత్తం స్టేషను దాటుకుని సుదీర్ఘంగా కూతవేస్తూ బెంగుళూరు వైపుకు పరుగులు తీస్తోంది. సాలోచనగా నిలబడి ఆకాశంలోకి దృష్టి సారించాడు రమణమూర్తి. ఎర్రటి, పచ్చటి లైట్లను వేసుకుంటూ విమానం ఒకటి మద్రాసు వైపుగా దూసుకొనిపోతూ వుంది. యిక్కడ నేను కూడా వున్నాను అన్నట్టుగా దూరంగా నిలబడిపోయిన పెద్దపర్తి గుంట బస్సులో సైతం ఒక చిన్న వెలుతురు వెలిగి మళ్ళీ ఆరిపోయింది. దిక్కూ దరీ కన్పించిన పుంత వెంబడి, చీకటి వెంట చీకటిలా యిద్దరు మనుషులు కాళ్లు ఈడ్చుకుంటూ నడుస్తున్నారు. రమణమూర్తికి ఒక్కసారిగా మెదడు అంతా శూన్యం అయిపోయినట్టు, సర్వమానవ సమస్యలకు పరిష్కారం సూచించగల పరమ రహస్యమేదో అవగతమవుతున్నట్టు మనస్సులో సంక్షోభం రేగుతోంది.

'అదుగో అక్కడ ఎలుతురు డాలు కొడుతోంది సూడన్నా! అదే' ఊతకట్టెతో నేలను, బలంగా ఊనుకుని, పూడిపోయిన గొంతును పెగుల్చుకుని గమ్యం చేరబోతున్నట్టుగా అన్నాడు తిమ్మరాయప్ప. అక్కడ చీకటి కొంత కొంతగా పలచబడుతోంది. యుద్ధభూమిలో వేసిన స్కంధారావాల్లా చిన్న చిన్న దీపాలు వెలుగుతున్న చిగురుగుంట బంగారు గనుల క్యాంపు కన్పిస్తోంది.

అయితే రమణమూర్తి యిప్పుడు వ్యక్తిమాత్రుడైన తాను ఒక రాత్రి చేయబోయే తాత్కాలిక మజిలీ గురించి ఆలోచించడం లేదు. అనేక వ్యయప్రయాసల కోర్చి మట్టిలో నుంచీ బంగారం వెలికిదీసి, జనుల భవితవ్యాన్ని సుసంపన్నం చెయ్యడం కోసం నవీన యంత్రాల తోడ్పాటుతో వందలాది కార్మికులు, సాంకేతిక నిపుణులు, దీర్ఘకఠోర శ్రమ సలుపుతున్న

ఈ భూమిలోనే ఒక నిర్భాగ్యుడైన ముసలివాడు ఉన్న తన బంగారాన్ని పోగొట్టుకుని విగతజీవిగా మారిపోతున్న దృశ్యం ఒకటి అతడి మనసును కలిచివేస్తోంది. వికసిస్తున్న మానవ మేధస్సు, పెంపొందుతున్న సాంకేతిక విజ్ఞానం మానవ శ్రేయస్సుకే వినియోగపడుతున్నాయన్న నమ్మకం అతడికి కలగడం లేదు. చిరకాలంగా తాను అనుభవిస్తున్న మనోవేదనకు మూలకారణమైన ప్రశ్న యిప్పుడిప్పుడే అతడికి స్పష్టమవుతోంది. ఆదిమ శిలాయుగాల నుంచీ అణుయుగం దాకా, అంతరిక్ష యుగం దాకా విస్తరిల్లిన మిలియన్ల సంవత్సరాల మానవ నాగరికతా ప్రస్థానానికి గమ్యం ఏమిటి? కనుచూపు మేరలో కానరాని ఆ స్వర్గధామం ఏ నిధి నిక్షేపాలకు నెలవు? ఏ భోగ భాగ్యాలకు కొలువు? ఏ సుఖ సంతోషాలకు ఆటపట్టు? ఈ నిరంతర స్పర్థాయుత, క్షణ క్షణ సంఘర్షణామయ, సతత అనిశ్చిత అపాయకర సుదీర్ఘ పథంలో చివరకు దొరికేదేమిటి? అది మిగిలేదెవరికి?

(అయిపోయింది)

❖ ❖ ❖



స్వర్ణసీమకు స్వాగతం

మధురాంతకం మహేంద్ర

అందరికీ తెలిసిన అనుభవాన్ని కళారూపంగా తీర్చి దిద్దడంలో రచయిత పొందిన కృతార్థకత సామాన్యమైనదిగాదు. వర్జీనియా వూల్ఫ్ రాసిన "మిసెస్‌డాలవే" గుర్తువస్తుంది నాకు... భిన్న ప్రవృత్తులు గల వ్యక్తుల చిత్రణను కూర్చడంలో ఒక ఆర్కెస్ట్రాని తయారు చేసిన ప్రతిభ కనబరిచాడు రచయిత.

– ఆర్.ఎస్. సుదర్శనం

ఓ పాసింజరు బస్సులో ప్రయాణం – అద్భుతంగా దృశ్యీకరించటమే కాదు, మొత్తం ఈ వ్యవహారం వెనకవున్న ఆర్థిక, సాంఘిక, తాత్త్విక నేపథ్యాన్ని ప్రత్యేకించి చెప్పకుండానే కథనంలో ఒదిగిపోయేలా చేయడం ఈ నవల ప్రత్యేకత.

– వి. రాజారామమోహనరావు

నవలలోని వర్ణన మహేంద్ర ప్రత్యేకతను తెలుపుతోంది. శిల్పం అనితర సాధ్యమన్నట్టుగా ఉంటుంది. రాయలసీమలో పేదరికం మీద, కరువుమీద, రైతులసమస్యల మీద తరువాతి కాలంలోవచ్చిన నవల లన్నింటికి ఇది మొదటిది అనే చెప్పవచ్చు... భారతీయ భాషలలో వచ్చిన గొప్పనవలల స్థాయిలో చేర్చవలసిన నవల...

– వాడ్రేవు వీరలక్ష్మీదేవి

అమరావతి పబ్లికేషన్స్
సాయిబాబారోడ్, గుంటూరు-522007